సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 12 వెల: ₹ 5.00
సంపుటి: 13
సంచిక: 11
శుక్రవారం 3-4-2020


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'


వైద్య సేవల
గుండె చప్పుడు.. నర్సింగ్!
-భవితలో


డివిలియర్స్‌ను స్లెడ్జింగ్ చేయలేదు
ఆరోగ్య కారణాలతోనే శాకాహారిగా మారానన్న కోహ్లి
-స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

"కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు రానున్న వారాల్లో నిర్ధారణ పరీక్షల నిర్వహణ (టెస్ట్), అనుమానితుల గుర్తింపు (ట్రేస్), వారిని ఐసోలేట్ చేయడం, క్వారంటైన్ చేయడం అనే అంశాలపై నిశిత దృష్టి పెట్టాలి. ప్రాణ నష్టాన్ని అత్యంత కనిష్ట స్థాయికి చేర్చడమే అందరి ఉమ్మడి లక్ష్యం కావాలి."
సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ




## దశలవారీగా లాక్‌డౌన్
# ఎత్తివేత!

**ఏప్రిల్ 14 తరువాత ప్రారంభించేందుకు కేంద్రం సమాలోచన**

- లాక్‌డౌన్ తరువాత నిష్క్రమణ వ్యూహంపై సూచనలివ్వండి
- సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ
- కరోనా కట్టడికి టెస్ట్, ట్రేస్, ఐసోలేట్, క్వారంటైన్‌లపై దృష్టి పెట్టండి.. ప్రాణనష్టం కనిష్టంగా ఉండటమే మన ఉమ్మడి లక్ష్యం
- కరోనాపై పోరులో రాష్ట్రాల కృషి అభినందనీయం

**లాక్‌డౌన్ ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు**

**నేటి ఉదయం 9 గంటలకు మోదీ వీడియో సందేశం**

ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే దిశగా మార్చి 25 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను ఎత్తివేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకేతాలిచ్చారు. లాక్‌డౌన్ కాలపరిమితి ముగిసిన ఏప్రిల్ 14 తరువాత ఈ దేశవ్యాప్త దిగ్బంధాన్ని దశలవారీగా ఎత్తివేసే దిశగా ఆలోచిస్తున్నట్లు గురువారం ముఖ్యమంత్రులతో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో వెల్లడించారు. ఏప్రిల్ 14 వరకు పూర్తిస్థాయిలో లాక్‌డౌన్‌ను అమలు చేసి ఆ తరువాత పరిస్థితులను బేరీజు వేసుకుంటూ దశలవారీగా ఎత్తివేసేందుకు ఒక నిష్క్రమణ వ్యూహాన్ని రూపొందించాల్సి ఉందని సీఎంలతో ఆయన వ్యాఖ్యానించారు. అందుకు అవసరమైన సూచనలను ఇవ్వాల్సిందిగా ఆయన సీఎంలను కోరారు. - వివరాలు 8లో

**9,96,974** ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు

**50,970** ప్రపంచవ్యాప్తంగా కరోనా మరణాలు

దేశం గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కోబోతోంది : ట్రంప్

స్పెయిన్‌లో ఒక్కరోజే 950 మంది మృత్యువాత - వివరాలు 8లో

'తబ్లిగీ'కి వెళ్లిన వారిలో **9,000** మంది క్వారంటైన్

**2,069** దేశవ్యాప్తంగా కరోనా కేసులు

**53** దేశంలో కరోనా మరణాల సంఖ్య

**960 మంది** విదేశీయుల వీసాలు రద్దు - వివరాలు 8లో

ఏపీలో మొత్తం **149** కరోనా కేసులు

## సమగ్ర వ్యూహం రూపొందించాం

- ఏపీలో కరోనా వైరస్ నివారణకు అన్ని విధాలా యత్నం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానితో ఏపీ సీఎం వైఎస్ జగన్

- వివరాలు 2లో

# 27 కొత్త కేసులు

**రాష్ట్రంలో 154కి చేరిన కరోనా బాధితులు**

మరో 600 మంది పరీక్షల ఫలితాలు నేడు వచ్చే చాన్స్

- వీరిలో 86 మంది ఢిల్లీ నుంచి వచ్చినవారు, వారి బంధువులే
- ఢిల్లీ నుంచి వచ్చినవారిలో 30% మంది ప్రచారకులు
- వారిని గుర్తించడంలోనే సమస్య.. నిఘా వర్గాల ప్రత్యేక దృష్టి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. గురువారం మరో 27 మందికి ఈ వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది. దీంతో కేసుల సంఖ్య 154కి చేరింది. ఈ మొత్తం కేసుల్లో ఢిల్లీ ప్రార్థనలకు వెళ్లొచ్చిన వారు, వారి బంధువులే 86 మంది ఉన్నారని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటివరకు మొత్తం తొమ్మిది మంది చనిపోయారు. బుధవారంనాటికి 14 మంది డిశ్చార్జి కాగా, గురువారం మరో ముగ్గురు డిశ్చార్జి అయ్యారు. దీంతో ప్రస్తుతం కరోనాతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారు 128 మంది ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

అయితే ఇప్పటివరకు నమోదైన కేసుల్లో ఏ జిల్లా నుంచి ఎన్ని వచ్చాయన్న దానిపై స్పష్టత లేదు. ములుగు జిల్లాలో రెండు కేసులు నమోదయ్యాయని అక్కడి జిల్లా అధికారులు మిగతా 2వ పేజీలో ▶



## మీటర్ రీడింగ్ లేనట్టే!



- సగటు వినియోగం ఆధారంగా మార్చి నెల విద్యుత్ బిల్లు
- కరోనా వ్యాప్తి నేపథ్యంలో డిస్కంల యోచన
- నేడు ప్రకటన జారీ చేసే చాన్స్

సాక్షి, హైదరాబాద్

మార్చి నెల విద్యుత్ వినియోగానికి సంబంధించిన విద్యుత్ బిల్లులను మీటర్ రీడింగ్ ఆధారంగా కాకుండా కొత్త పద్ధతిలో జారీ చేయాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సూత్రప్రాయంగా నిర్ణయించాయి. ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తి చెందు తున్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా మీటర్ రీడింగ్ తీయకుండానే ప్రత్యామ్నాయ పద్ధతిలో గత నెల వినియోగానికి సంబంధించిన బిల్లులు జారీ చేయాలని మిగతా 2వ పేజీలో ▶

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb CHICKEN
సూచించిన నేటి గుడ్డు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు
గుడ్డు రిటైల్ ధర ₹ 44 డజన్
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 70 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 92 కిలో
డ్రెస్డ్ స్కిన్‌తో 133 కిలో
స్కిన్‌లెస్ 152 కిలో
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇదండీ సంగతి



నిత్యావసర వస్తువుల్ని అక్రమంగా నిల్వ చేస్తావా అని మరీ తిట్టి ఎత్తుకెళ్లార్సార్.. వా!

## బిజినెస్
# కరోనా..

- వైరస్ పట్టింపులేకుండా ప్రైవేట్ బ్యాంకుల కొత్త టార్గెట్లు
- ఎట్టిపరిస్థితుల్లో బిజినెస్ పెంచాల్సిందేనని ఉద్యోగులపై ఒత్తిళ్లు
- కాన్ఫరెన్స్, వీడియో కాల్స్‌తో రోజూ పనితీరు వాకబు
- కొత్త ఆర్థిక సంవత్సరం వేళ దూకుడు..ఉద్యోగుల హైరానా

సాక్షి, హైదరాబాద్: దేశమంతా లాక్‌డౌన్‌తో షట్‌డౌన్ అయింది. ఎక్కడివారక్కడే ఇళ్లకు పరిమితమయ్యారు. కొందరు ఉద్యోగులు ఇళ్లనుంచే పనిచేస్తున్నారు. ఇంకొందరు విశ్రాంతి తీసుకుంటున్నారు. వైద్యులు, పోలీసులు, జర్నలిస్టులు.. ఇలా అత్యవసర సేవల కేటగిరీల్లోని వారు విధిగా విధులకు హాజరవుతున్నారు. బ్యాంకులూ అందులో భాగమే. అందుకే బ్యాంకులు తెరిచే ఉంటున్నాయి. కరోనా విస్తరిస్తున్న వేళ భయంగానే ఆఫీసులకు వెళ్లి ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. కానీ.. 'కరోనా'పట్టింపు లేకుండా, అప్రమత్తంగా ఉండాలనే హెచ్చరికలను పట్టించుకోకుండా కొన్ని ప్రైవేటు బ్యాంకులు ఉద్యోగులకు 'టార్గెట్'విధిస్తూ బిజినెస్ పెంచాలని ఒత్తిడి తెస్తున్నాయి. సాధారణంగా బ్యాంకులకు ఆర్థిక సంవత్సరం ప్రారంభంతోనే పని ఒత్తిడి మొదలవుతుంది. క్రితం ఏడాది ఎంత బిజినెస్ జరిగిందో అంతకు ఒకటిన్నర రెట్లు కొత్త సంవత్సరంలో జరగాలని లక్ష్యం నిర్ధారించి యాజమాన్యాలు పరుగు పెట్టిస్తాయి. కొత్త ఆర్థిక సంవత్సరం మొదలై మూడు రోజులైంది. దీంతో నాలుగైదు రోజులుగా నిత్యం కాన్ఫరెన్స్, వీడియోకాల్స్ ద్వారా సమావేశాలు ఏర్పాటుచేస్తూ కొత్త లక్ష్యాలను నిర్దేశిస్తున్నాయి. వాటిని సాధించాలని ఒత్తిడి తెస్తున్నాయి. కరోనా వైరస్ విస్తరిస్తూ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ టార్గెట్లపై ఉద్యోగులు విస్తుపోతున్నారు.



**రోజూ రూ.3 కోట్ల వ్యాపారం**

ప్రస్తుతం కొన్ని ప్రధాన ప్రైవేటు బ్యాంకుల మధ్య తీవ్ర పోటీ ఉంది. వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో శాఖలు తెరుస్తున్నాయి. ఓ ప్రాంతంలో ఓ ప్రైవేటు బ్యాంకు శాఖను ప్రారంభించగానే, అదే ప్రాంతంలో మరో పోటీ బ్యాంకు బ్రాంచీ ప్రారంభిస్తోంది. ఇలా ప్రధానంగా మిగతా 3వ పేజీలో ▶



## కొత్త విద్యాసంవత్సరం
# ఆలస్యం!

- పాఠశాలలు, కాలేజీలకు కనీసంగా 220 పనిదినాలు
- కరోనా నేపథ్యంలో అవి పూర్తికాకుండానే ముగింపు
- ఈ నెలలో టెన్త్ పరీక్షల నిర్వహణ అనుమానమే..
- నైన్త్ వరకు ఆటోమేటిక్ పాస్‌పై జారీకాని ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో ఈసారి నిర్దేశిత పని దినాలు పూర్తికాకుండా విద్యా సంవత్సరం ముగుస్తోంది. కరోనా నేపథ్యంలో అకడమిక్ కార్యక్రమాలకు 220 పనిదినాలు లేకుండానే విద్యాసంవత్సరం పూర్తి కానుంది. అంతేకాదు ఈ పరిస్థితి ఇంకా ఎన్నాళ్లు కొనసాగుతుందో తెలియని పరిస్థితుల్లో ఎలా ముందుకు సాగాలో అర్థం కాకుండా తయారైంది. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఒక విద్యా సంవత్సరంలో అన్ని సెలవులు పోగా కనీసంగా 220 పనిదినాలు పాఠశాలలు, కాలేజీలు పనిచేయాలి. ఆయా రోజుల్లోనే సిలబస్ పూర్తయ్యేలా ముందుగానే ఆయా విభాగాలు అకడమిక్ క్యాలెండర్‌ను రూపొందిస్తాయి. అందుకు అనుగుణంగా బోధన కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో విద్యా సంస్థలు, ముఖ్యంగా స్కూళ్లన్నీ మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండో శనివారాల్లో పని చేసేలా షెడ్యూల్ జారీ చేసి పనిదినాలను సర్దుబాటు చేసింది. అయితే ఇప్పుడు కరోనాతో కొత్త సమస్య వచ్చిపడింది. దీంతో ఈసారి నిర్దేశిత పని దినాలు లేకుండా ఈ విద్యా సంవత్సరం ముగియనుంది. వాస్తవానికి ఏప్రిల్ 23వ తేదీ పాఠశాలలకు చివరి పని దినం. కానీ రాష్ట్రంలో కరోనా కారణంగా దాదాపు నెలన్నర రోజుల ముందుగానే పాఠశాలలు బంద్ అయ్యాయి. మార్చి 15 నుంచి 31వ తేదీ వరకు సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. వాటిని ఈనెల 14వ తేదీ వరకు పొడిగించింది. అంటే అప్పటి వరకు పాఠశాలలు ప్రారంభమయ్యే మిగతా 3వ పేజీలో ▶

# ఆస్పత్రులకు క్యూ

**జలుబు, జ్వరాలతో ప్రభుత్వాస్పత్రులకు పరుగులు**

- 'గాంధీ'లో ఒక్కరోజే 500 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు
- ఏదో ఒక కాంటాక్ట్ ఉంటేనే టెస్ట్‌ల నిర్వహణ
- మర్కజ్ వెళ్లిన వారికీ క్వారంటైన్ ముద్ర
- తమకు రక్షణ లేదంటూ జూడాల నిరసన



సాక్షి, హైదరాబాద్

కరోనా భయంతో జ్వరం, జలుబు, దగ్గ లక్షణాలున్న రోగులు ప్రభుత్వాస్పత్రులకు పరుగెడుతున్నారు. ఢిల్లీ వెళ్లొచ్చిన వ్యక్తులతోపాటు వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, వారితో కాంటాక్టు కలిగి ఉన్నవారు హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా, ఫీవర్ ఆస్పత్రులు, వరంగల్‌లోని ఎంజీఎంకు పోటెత్తుతున్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు కరోనా భయంతో దాదాపు 800 మంది రాగా వరంగల్ ఎంజీఎంకు వంద మందికిపైగా వచ్చినట్లు చెబుతున్నారు. అయితే వారిలో కరోనా అనుమానిత లక్షణాలున్న వ్యక్తుల శాంపిళ్లనే పరీక్షలకు పంపించారు. హైదరాబాద్‌లో గురువారం ఒక్కరోజే దాదాపు 500 మంది స్వాబ్, రక్త నమూనాలను కరోనా నిర్ధారణ పరీక్షలకు పంపించినట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. మిగిలినవారి నమూనాలను పంపించడంలేదు. ఇలా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవడం మంచి పరిణామమని వైద్యాధికారులు అంటున్నారు. అన్ని జిల్లాల్లో ఢిల్లీ గ్యాంగ్‌తో టచ్ ఉన్న వారంతా ముందుకు రావాలని ప్రభుత్వం సూచిస్తోంది.

**మర్కజ్‌కు వెళ్లినవారికీ క్వారంటైన్ ముద్ర...**

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 1,030 మంది మర్కజ్‌కు వెళ్లి వచ్చినట్లు అధికారులు గుర్తించగా వారిలో 130 మంది మినహా మిగిలిన వారిని ఐసోలేషన్ కేంద్రాలకు తరలించారు. తీవ్రమైన లక్షణాలున్న వారికి వెంటనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాల్లోనూ వారి నమూనాలను సేకరించి హైదరాబాద్‌కు పంపుతున్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో సేకరించిన నమూనాల ఫలితాలు రాగా ఒకట్రెండు రోజుల్లో మిగిలిన జిల్లాలకు సంబంధించి మర్కజ్‌కు వెళ్లిన వారి నమూనాల ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే వారందర్నీ జిల్లాల్లోని క్వారంటైన్ కేంద్రాలకు తరలించారు. అలాగే మర్కజ్ యాత్రికులు, వారితో సన్నిహితంగా ఉన్న వారికి కూడా క్వారంటైన్ ముద్ర వేశారు. ఇప్పటిదాకా విదేశాల నుంచి వచ్చిన వారికి మాత్రమే ఈ ముద్ర వేయగా తాజాగా మర్కజ్‌తో సంబంధం ఉన్న వారందరికీ వేస్తున్నారు. మర్కజ్‌కు వెళ్లిన వారు, వారి కుటుంబ సభ్యులను ఇప్పటికే గుర్తించిన వైద్య ఆరోగ్యశాఖ.. వారిని మిగతా 2వ పేజీలో ▶



## చదువురాకున్నా 'పాఠం' నేర్పుతున్నారు!

- లాక్‌డౌన్ పూర్తిగా పాటిస్తున్న నిరక్షరాస్యులు, రైతులు, వృద్ధులు
- ఉల్లంఘనుల్లో 18 నుంచి 25 ఏళ్లలోపు వారే అధికం
- పట్టణాల్లో 50%, గ్రామాల్లో 80% అమలు.. లాక్‌డౌన్ అంటే తెలియదన్న వారు 6%
- తెలంగాణ పోలీసుశాఖ ఆన్‌లైన్ సర్వేలో వెల్లడి

- వివరాలు 3లో


శ్రీరామనవమిని పురస్కరించుకొని గురువారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు - 2లో

epaper.sakshi.com

# నెగెటివ్ వచ్చినా.. 14 రోజులు ఇంట్లో ఉండాల్సిందే

- కరోనా నెగెటివ్ వ్యక్తులకు కేంద్రం మార్గదర్శకాలు
- క్వారంటైన్ నుంచి ఊళ్లకు వెళ్లేవారికి పాస్‌ల జారీ

**సాక్షి, హైదరాబాద్:** కరోనా కారణంగా క్వారంటైన్‌లో ఉండి, నెగెటివ్‌గా తేలినవారు మరో 14 రోజుల పాటు హోం క్వారంటైన్‌లో ఉండాల్సిందేనని కేంద్రం స్పష్టం చేసింది. దేశంలో లాక్‌డౌన్ విధించిన దరిమిలా.. ప్రభుత్వం క్వారంటైన్‌లో ఉన్నవారిలో నెగెటివ్‌గా తేలినవారు పాటించాల్సిన నియమ నిబంధనలను కేంద్ర హోం శాఖ గురువారం విడుదల చేసింది. శరీరంలో వైరస్ లేదని నిర్ధారణ అయినా కూడా బాధితులు మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు/కేంద్రపాలిత ప్రాంతాలు వీటిని పాటించాలని పేర్కొంది.

**నిబంధనలు ఇవే..**



- క్వారంటైన్‌లో ఉన్న వ్యక్తికి కరోనా నెగెటివ్‌గా తేలితే.. హెల్త్ ప్రొటోకాల్ ప్రకారం.. వారిని విడుదల చేస్తారు. కానీ బృందాలుగా క్వారంటైన్ సెంటర్‌కు అనుమానితులుగా వచ్చిన వారిలో ఒక్కరికి పాజిటివ్ వచ్చినా.. ఎవరినీ బయటికి అనుమతించరు.
- ప్రస్తుతం లాక్‌డౌన్ అమల్లో ఉన్న నేపథ్యంలో కొందరు పౌరులు దేశంలోని వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. వీరంతా వారి సొంత రవాణా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.
- క్వారంటైన్ అయిన ప్రాంతాల నుంచి రాష్ట్ర ప్రభుత్వమే వీరికి ప్రత్యేక పాసులు జారీ చేస్తుంది.
- వీరికి ఒకే రూటులో నిర్ణీత కాల పరిమితితో పాసులు జారీ అవుతాయి.
- ఈ పాసులు జారీ అయిన మార్గంలో వీరి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు ఉండవు.
- వీరు సొంతూళ్లకు వెళ్లాక తప్పకుండా 14 రోజుల పాటు హోం క్వారంటైన్‌లో ఉండాల్సిందే. పైగా ఎక్కడ ఉంటున్నామన్న వివరాలు సదరు వ్యక్తి ముందుగానే వెల్లడించాల్సి ఉంటుంది.

## వలస కూలీల వివరాలకు కంట్రోల్ రూమ్

**సాక్షి, న్యూఢిల్లీ:** ఇతర రాష్ట్రాల్లో ఉన్న తెలంగాణ వలస కూలీలు, తెలంగాణలో ఉన్న ఇతర రాష్ట్ర కూలీలకు సంబంధించిన వివరాలకు ఢిల్లీ తెలంగాణ భవన్‌లో కోవిడ్–19 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ఇతర రాష్ట్రాలలో ఉన్న తెలంగాణ వలస కూలీలకు మౌలిక వసతులు, భోజనం ఏర్పాటు చేసేందుకు సంబంధిత రాష్ట్ర, జిల్లా అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన అభ్యర్థనలను వివిధ రాష్ట్రాల నోడల్ అధికారులతో లేదా తెలంగాణలోని జిల్లా, రాష్ట్ర నోడల్ అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. అంతే కాకుండా రాష్ట్రానికి వైద్య పరికరాల రవాణాను రెసిడెంట్ కమిషనర్ కార్యాలయం సమన్వయం చేస్తుందని వివరించారు. 25 వేల మాస్కులు, 2000 పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్స్, 10 వేల శానిటైజర్లు, 6,250 గాగుల్స్, 3,50,000 హెచ్‌సీక్యూ మాత్రలు అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ భవన్‌లో 011–23380556 ఫోన్ నెంబర్ ద్వారా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.



## ప్రతి కార్యకర్త రూ.100 ఇవ్వండి..

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పిలుపు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా మహమ్మారిపై యుద్ధం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ప్రతి బీజేపీ కార్యకర్త అండగా ఉండాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త పీఎం కేర్స్ **(pm cares)** నిధికి కనీసంగా రూ.100కు తగ్గకుండా సహాయం అందించాలని కోరారు. తద్వారా తెలంగాణలోని బీజేపీ కార్యకర్తలు కరోనా మహమ్మారిపై యుద్ధానికి సిద్ధం కావాలన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య విరాళమిచ్చి, స్క్రీన్ షాట్ తీసి సోషల్ మీడియాలో షేర్ చేయాలని పిలుపునిచ్చారు. కరోనా పేరుతో సింగరేణి కార్మికులకు జీతంలో కోతవిధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదని, సింగరేణి ఒక స్వతంత్ర సంస్థ అని సంజయ్ పేర్కొన్నారు. కార్మికుల కష్టార్జితంతో సంస్థకు వచ్చే లాభాల్లో నుంచి వారి జీత భత్యాలు తీసుకుంటారని, అలాంటి వారి కష్టాన్ని సొమ్ముచేసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు ఇప్పటికే ప్రభుత్వానికి ఒక రోజు జీతం రూ. 7.5 కోట్లు అందించారన్నారు. సింగరేణి కార్మికులకు లాక్ డౌన్ కాకుండా లేఆఫ్ ప్రకటించడంతో కార్మికులు ఆందోళనకు గురవుతున్నారన్నారు.



## కరోనాపై యుద్ధంలో సహకరించండి

**సాక్షి, హైదరాబాద్:** కరోనా మహమ్మారిపై చేస్తోన్న యుద్ధానికి అందరూ సహకరించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. 'కరోనా వైరస్‌ను ఎదుర్కోవడానికి అంతా ఏకంకండి. లాక్‌డౌన్ విజయవంతం చేయడంలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలి. పౌరులంతా భౌతిక దూరం పాటించాలి. కరోనాను ఓడించడంలో అంతా భాగస్వామ్యం కావాలి. మన కుటుంబాన్ని, సహచరులను, మొత్తం సమాజాన్ని రక్షించడంలో మీరు అందిస్తోన్న సహకారం ఎంతో గర్వకారణం. ఇక నుంచి కూడా ప్రజలు పోలీసులకు సహకరించి లాక్‌డౌన్ పాటించాలి.' అని డీజీపీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# 27 కొత్త కేసులు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రకటించినట్టు సమాచారం. ఢిల్లీ ప్రార్థనల్లో పాల్గొన్న ప్రతినిధులు, వారి బంధువులు, స్నేహితులను తీసుకొచ్చి పరీక్షలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకు వచ్చిన ఫలితాలు కాకుండా, ఇంకా 600 శాంపిళ్ల ఫలితాల కోసం వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు ఎదురు చూస్తున్నాయి. ఆ ఫలితాల ద్వారా ఇంకెన్ని కేసులు నమోదవుతాయో అనే ఆందోళన వ్యక్తమవుతోంది. పరిస్థితులను బట్టి అంచనా వేస్తే భారీగానే కేసులు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. శుక్రవారం వాటి ఫలితాలు రావొచ్చని చెబుతున్నారు.

**రాష్ట్రమంతా రెడ్‌జోనేనా?**

ఢిల్లీలో ప్రార్థనలు చేసుకొని వచ్చినవారిలో 1030 మంది ఉన్నారు. వారు వేలాది మందిని కాంటాక్ట్ అయినట్లు అంచనా వేశారు. అన్ని జిల్లాల నుంచి వెళ్లడంతో ఇప్పుడు రాష్ట్రమంతా రెడ్ జోన్‌లోనే ఉన్నట్లుగా భావిస్తున్నామని ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రతీ ప్రాంతం, ప్రతీ గ్రామం, ప్రతీ జిల్లా కూడా లాక్‌డౌన్‌ను సీరియస్‌గా పాటించాల్సి ఉందని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారిలో 70 శాతం మంది సాధారణ భక్తులు కాగా, మిగిలిన 30 శాతం మంది ప్రచారకులు అని వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కరోనా ప్రత్యేక ఉన్నతస్థాయి కమిటీ సభ్యుడు తెలిపారు. సాధారణ భక్తులు ఢిల్లీ నుంచి వచ్చిన తర్వాత వారి ఇళ్లకు వెళ్లారు. కానీ ప్రచారకులు మాత్రం సంబంధిత మందిరాల్లో ఉంటారు. వారిలో కొందరిని గుర్తించగా, ఇంకా 130 మందిని గుర్తించాల్సి ఉందని తెలిసింది. ఈ ప్రచారకులకు కుటుంబం ఉండదు. వారు ఎక్కడుంటారో స్పష్టమైన చిరునామా కూడా తెలియదు. పైగా వారు మందిరాల్లో ఉండటం వల్ల రోజూ వందల మందితో కలిసి తిరుగుతుంటారు. అలా వారు ఎంతమందితో కాంటాక్ట్ అయ్యారన్నదే ఇప్పుడు అధికారులను వేధిస్తున్న సమస్య. దీనిపై నిఘా వర్గాలు ప్రత్యేక దృష్టిసారించాయి.



ఏపీ ముఖ్యమంత్రి సహాయ నిధికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ రూ. 7.5 కోట్లు, హైఎండ్ మెడికల్ కిట్స్, శానిటైజర్లు, మాస్కులు, మందులు, వైద్య పరికరాల కొనుగోలుకు రూ. 3.5 కోట్లు.. ఇలా మొత్తం రూ. 11 కోట్లు విరాళంగా ఇచ్చింది. ఈ మేరకు చెక్కును ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందజేస్తున్న అరబిందో ఫార్మా హోల్ టైం డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డి. చిత్రంలో ఎంపీ వి. విజయసాయిరెడ్డి



కరోనా నియంత్రణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తమ వంతు సాయంగా భారతీ సిమెంట్స్ యాజమాన్యం రూ.5 కోట్లు, సంస్థ ఉద్యోగులు రూ.14.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాల చెక్కులను సీఎం వైఎస్ జగన్‌కు అందజేస్తున్న భారతీ సిమెంట్స్ ఫైనాన్స్ డైరెక్టర్ బాలాజీ. చిత్రంలో ఏపీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

# సమగ్ర వ్యూహం రూపొందించాం

- ఏపీలో కరోనా వైరస్ నివారణకు అన్ని విధాలా యత్నం
- వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానితో ఏపీ సీఎం వైఎస్ జగన్



**సాక్షి, అమరావతి**

రాష్ట్రంలో కోవిడ్–19ను సమగ్ర వ్యూహంతో ఎదుర్కొంటున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీకి తెలిపారు. వైద్య పరంగా ఇప్పుడున్న యంత్రాంగాన్ని, పరికరాలను పూర్తి స్థాయిలో మోహరిస్తున్నామని చెప్పారు. కోవిడ్–19 నియంత్రణ చర్యలపై వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో గురువారం ఢిల్లీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ.. హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైరస్ నియంత్రణలో భాగంగా ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి, లాక్‌డౌన్ నేపథ్యంలో పేదలు, రైతులను ఆదుకోవడానికి తీసుకుంటున్న చర్యలను వైఎస్ జగన్ వారికి వివరించారు. సీఎం ప్రధానికి వివరించిన ముఖ్యమైన అంశాలు ఇవీ..

**ఢిల్లీ సదస్సు కేసులే ఎక్కువ**

- ఢిల్లీలో తబ్లిగీ జమాత్ సదస్సుకు హాజరైన 1,085 మందిని గుర్తించాం. ఇందులో 977 మంది ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నారు. మిగతా వారు ఇతర ప్రాంతాల్లో ఉన్నారు.
- ప్రస్తుతం గుర్తించిన వారిలో 750 మందికి పరీక్షలు నిర్వహించగా 91 మందికి పాజిటివ్ వచ్చింది. వీరికి సన్నిహితంగా ఉన్న వారు, కుటుంబ సభ్యులు.. 544 మందికి పరీక్షలు నిర్వహించగా 20 మందికి పాజిటివ్ వచ్చింది. మొత్తంగా 111 మందికి పాజిటివ్. మిగతా వారందరినీ క్వారంటైన్‌లో ఉంచాం.
- ఇతరత్రా కేసులు పెరగకుండా క్లస్టర్ కంటైన్‌మెంట్ స్ట్రాటజీ ద్వారా పూర్తి స్థాయిలో దృష్టి సారించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. పరిస్థితి అదుపులోకి వస్తుందని భావిస్తున్నాం.
- విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, తిరుపతిల్లో 2,012 నాన్ ఐసీయూ బెడ్లు, 444 ఐసీయూ బెడ్లతో ప్రత్యేక కోవిడ్ ఆస్పత్రులను నెలకొల్పాం. 13 జిల్లాల ప్రధాన కేంద్రాల్లో కోవిడ్ –19 వైరస్ సోకిన వారికి చికిత్స అందించడానికి ప్రత్యేకంగా ఆస్పత్రులను కేటాయించాం. వీటిల్లో 10,933 నాన్ ఐసీయూ బెడ్స్, 622 ఐసీయూ బెడ్స్ సిద్ధం చేశాం. మొత్తంగా 1,000 ఐసీయూ బెడ్లను సిద్ధం చేశాం. వీటికి తోడు ప్రధాన పట్టణాలు, నగరాల్లో ఐసోలేషన్ కోసం మరో 20 వేల బెడ్లను సిద్ధంగా ఉంచాం.
- కోవిడ్–19 లక్షణాలు ఉన్న వారిని గుర్తించడానికి కుటుంబాల వారీగా సమగ్ర సర్వే చేశాం. గ్రామ, వార్డు వలంటీర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా ఇప్పటికి రెండు మార్లు సర్వే చేశాం. ఢిల్లీ సదస్సుకు హాజరైన వారిని గుర్తించి క్వారంటైన్‌కు తరలించాం. వారితో కాంటాక్టులో ఉన్న వారిని గుర్తించడం, పరీక్షలు నిర్వహించడం, మంచి వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం.
- మరిన్ని పరీక్షలు నిర్వహించడానికి టెస్టు కిట్లు, పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్స్ మరింత అవసరం ఉంది.

# ఆస్పత్రులకు క్యూ

▶ మొదటి పేజీ తరువాయి

పరీక్షలకు, క్వారంటైన్ కేంద్రాలకు తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో కొంతమంది స్వచ్ఛందంగా సహకరించి వచ్చారు. మరి కొందరు మొండికేశారు. హైదరాబాద్‌లో కూడా కొంతమంది ఇలాగే సహాయ నిరాకరణ చేయడంతో సంబంధిత ఏరియాలకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగి, వారిని ఆస్పత్రులకు పంపారు.

**ఆస్పత్రులు కిటకిట...**

మర్కజ్ వెళ్లిన వారిలో ఎక్కువ మంది కరోనా బారిన పడుతుండటంతో మిగిలిన వారిలోనూ భయం పెరిగింది. దాంతో ఒక్కసారిగా గాంధీ ఆస్పత్రికి క్యూ కట్టారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 603 మంది మర్కజ్‌కు వెళ్లారు. బుధవారం 300 మంది, గురువారం 500 మంది నమూనాలను గాంధీ ఆస్పత్రిలో సేకరించారు. బుధవారం సేకరించిన 300 నమూనాల్లో 30 మందికి పాజిటివ్ వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఏ జిల్లాకు చెందినవారు ఎందరనేది సర్కారు ప్రకటించలేదు. మర్కజ్ వ్యవహారం వెలుగుచూసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో సర్కారీ ఆస్పత్రులు కరోనా అనుమానితులతో నిండిపోతున్నాయి. సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ బెడ్స్ ఇప్పటికే నిండిపోయాయి. అక్కడ ప్రస్తుతం 135 మంది ఐసోలేషన్‌లో ఉన్నారు. గాంధీలోనూ పాజిటివ్ కేసులు పెరిగిపోతున్నాయి. ఛాతీ ఆస్పత్రిలో గురువారం 14 పాజిటివ్ కేసులు అడ్మిట్ అవ్వగా ఇప్పటికే అక్కడ 8 మంది చికిత్స పొందుతున్నారు. అక్కడ 31 మంది అనుమానితులు ఉన్నారు. కింగ్‌కోఠి ఆస్పత్రిలో 30 మంది రోగులకు చికిత్స చేస్తున్నారు. అక్కడ మొత్తం 350 పడకలు అందుబాటులో ఉన్నాయి.

**రక్షణ లేదంటూ జూడాల ఆందోళన...**

జూనియర్ డాక్టర్లపై కొందరు కరోనా బాధితులు, వారి కుటుంబాలు దాడి చేయడంతో గాంధీ ఆసుపత్రిలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో తమకు ఏమాత్రం రక్షణ లేదని రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమ భద్రతకు ప్రత్యేక రక్షణ దళం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# మీటర్ రీడింగ్ లేనట్టే..!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వినియోగదారులు సగటున నెలకు ఎంత విద్యుత్ వినియోగిస్తున్నారన్న విషయాన్ని శాస్త్రీయ పద్ధతుల ద్వారా అంచనా వేసి మార్చి నెలకు సంబంధించిన విద్యుత్ బిల్లులు జారీ చేయాలని భావిస్తున్నాయి. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు.. డిస్కంల సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్ రావుతో గురువారం విద్యుత్ సౌధలో సమావేశం నిర్వహించి ఈ విషయంపై చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మీటర్ రీడింగ్‌కు బదులు వినియోగదారుల సగటు విద్యుత్ వినియోగం ఆధారంగా మార్చి నెలకు సంబంధించిన బిల్లులు వసూలు చేయాలని ఈ సమావేశంలో ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

**కచ్చితత్వంతో జారీ..!**

సగటున ఒక నెల విద్యుత్ వినియోగాన్ని అంచనా వేస్తే విద్యుత్ టారిఫ్‌లోని శ్లాబులు తారుమారై వినియోగదారులపై అధిక భారం పడటమో, లేకుంటే డిస్కంలు ఆర్థికంగా నష్టపోవడమో జరిగే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటు వినియోగదారులు అటు డిస్కంలు నష్టపోకుండా సాధ్యమైనంత వరకు కచ్చితమైన అంచనాలతో బిల్లులు జారీ చేసేందుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు అధికారవర్గాలు తెలిపాయి. శుక్రవారం మరోసారి సమావేశమై ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందని, ఆ వెంటనే డిస్కంలు ఈ మేరకు సగటు వినియోగం ఆధారంగా విద్యుత్ బిల్లుల జారీకి అనుమతి కోరుతూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ)కి లేఖ రాయనున్నాయి. ఈఆర్సీ అనుమతించిన వెంటనే వినియోగదారులకు ప్రత్యామ్నాయ పద్ధతిలో బిల్లు లు జారీ చేయనున్నారు. మార్చి నెలకు సంబం ధించి వచ్చిన బిల్లు.. చెల్లించాల్సిన గడువు వివరాలతో వినియోగదారుల ఫోన్లకు ఎస్‌ఎంఎస్ సైతం పంపించనున్నారు. దీనిపై శుక్రవారం అధికారిక ప్రకటన జారీ చేసే అవకాశముంది.

**ఆన్‌లైన్‌లో చెల్లించండి..**

విద్యుత్ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా పాత బకాయిలు చెల్లించాలని జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు కోరారు. లాక్ డౌన్ అమలవుతున్న నేపథ్యంలో వినియోగదారులు నేరుగా నగదు రూపంలో బిల్లులు చెల్లించడం సాధ్యం కానందువల్ల ఈ సౌకర్యం వినియోగించుకోవాలని కోరారు. లాక్‌డౌన్ ప్రకటించిన సమయంలోని బిల్లులే కాకుండా గతంలో వినియోగించిన విద్యుత్ బకాయిలు కూడా వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఆ బకాయిలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు. లాక్‌డౌన్ అమలవుతున్నా విద్యుత్ సంస్థలు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి 24 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నాయని చెప్పారు. ఈ సదుపాయం నిరాటంకంగా కొనసాగడానికి వినియోగదారులు బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

## కరోనా నుంచి రక్షణకు బయోసూట్

### రూపొందించిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా బాధితులకు చికిత్స అందించే వైద్యులు, ఇతర సిబ్బంది ఆ వైరస్ బారిన పడకుండా ఉండేందుకు డీఆర్‌డీవో వినూత్న బయోసూట్‌ను రూపొందించింది. పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) సూట్‌ను వివిధ డీఆర్‌డీవో లేబొరేటరీలకు చెందిన శాస్త్రవేత్తలు.. టెక్స్‌టైల్, కోటింగ్, నానోటెక్నాలజీ తదితర సాంకేతికతలను పరిశీలించి వినూత్నమైన కోటింగ్ ద్వారా ఈ సూట్ తయారుచేశారు. ఈ సూట్‌లను అధిక మొత్తంలో ఉత్పత్తి చేసి, వైద్యులు, ఇతర సిబ్బందిని కరోనా నుంచి కాపాడేందుకు ఎంతగానో శ్రమిస్తున్నట్టు డీఆర్‌డీవో గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. కుసుంఘర్ ఇండస్ట్రీస్ అనే సంస్థ ఈ సూట్ తయారీకి సంబంధించిన ముడిసరుకు సహా, కోటింగ్ మెటీరియల్ ఉత్పత్తి చేయడమే కాకుండా, పూర్తి సూట్‌ను కూడా తయారు చేస్తున్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 7 వేల సూట్లను తయారు చేసే సామర్థ్యం ఉన్నట్టు పేర్కొంది. వస్త్ర రంగంలో అనుభవం ఉన్న మరో సంస్థతో కలసి రోజుకు 15వేల సూట్లను తయారుచేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు వివరించింది. సూట్‌ను అతికించే టేప్‌ల కొరత కారణంగా వీటి ఉత్పత్తి తగ్గుతోందని తెలిపింది. దీనికి ప్రత్యామ్నాయంగా సబ్‌మెరైన్‌ల తయారీలో ఉపయోగించే ఓ పదార్థాన్ని వినియోగిస్తున్నట్టు వెల్లడించింది.



## అసత్య ప్రచారానికి చెక్‌పెట్టేలా..

### ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వం

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తి, లాక్‌డౌన్ నేపథ్యంలో తప్పుడు వార్తలు, అసత్య సమాచారంతో జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం కరోనా కట్టడికి సంబంధించి ఇప్పటికే పలు చట్టాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. కరోనాకు సంబంధించిన సమాచారాన్ని అధికారిక ధ్రువీకరణ తర్వాత మాత్రమే ప్రజలకు చేరవేయాలని అన్ని రకాల మీడియాను ఇదివరకే ఆదేశించింది. తప్పుడు సమాచారాన్ని వ్యాపింపచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా సీఎం కేసీఆర్ పలు సందర్భాల్లో అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో వాస్తవ సమాచారాన్ని ప్రజలకు తెలియ చెప్పేందుకు ప్రత్యేక వెబ్‌సైట్‌ను డిజైన్ చేసినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్న కథనాలను ఈ వెబ్‌సైట్‌లో పెట్టడంతో పాటు అందులోని వాస్తవాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. **factcheck. telangana. gov.in** వెబ్‌సైట్లో వాస్తవాలు ధ్రువీకరించుకోవాలని కోరారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా తిరుగుతున్న కొన్ని వీడియోలు, సమాచారంపై గురువారం బులెటిన్ విడుదల చేసింది.




- కొందరు ముస్లిం యువకులు స్పూన్లు, ప్లేట్లు నాకుతున్నట్లుగా ఉన్న ప్రచారంలో ఉన్న వీడియోలు 2018కి సంబంధించినవి. ఆహారం వృథా చేయకుండా బోహ్రా ముస్లిం తెగలో ఇది ఒక ఆచారం.
- కరోనాపై సామాజిక మాధ్యమాల్లో సందేశాలు పంపేవారు శిక్షార్హులు అంటూ కేంద్ర హోం శాఖ పేరిట ప్రచారంలో ఉన్న లేఖ జారీ చేయడం అవాస్తవం.
- ఇటలీలో రోడ్ల మీద డబ్బును పడేస్తున్నారని ప్రచారంలో ఉన్న ఫోటోలు అవాస్తవం. వెనిజులాలో ద్రవ్యోల్బణం పెరిగి కరెన్సీ విలువ పడిపోవడంతో అలా చేశారు.
- లాక్‌డౌన్‌ను మే 4వ తేదీ వరకు ప్రధాని మోడీ పొడిగించినట్లు స్క్రీన్‌షాట్‌ను ఫొటో షాప్‌లో చేశారు. ప్రధాని ఇలాంటి ప్రకటన ఏదీ చేయలేదు.
- కొంతమంది ముస్లిం యువకులు బృందంగా ఏర్పడి తుమ్ముతున్నట్లుగా ప్రచారంలో ఉన్న వీడియోకు నిజాముద్దీన్ దర్గాకు ఎలాంటి సంబంధం లేదు. సూఫీ ఆచారం ప్రకారం ఇలా ఊగిపోవడాన్ని జిక్ర్ అంటారు. పాకిస్తాన్‌లో జనవరిలోనే ఈ వీడియో ప్రచారంలోకి వచ్చింది.

# ఏపీలో కరోనా పాజిటివ్ 149

**గురువారం ఒక్క రోజే 38 కేసులు**

**సాక్షి, అమరావతి:** ఏపీలో కరోనా పాజిటివ్ కేసుల ఉధృతి కొనసాగుతోంది. బుధవారం అర్ధరాత్రికి రాష్ట్రంలో 111 పాజిటివ్ కేసులు ఉండగా ఆ సంఖ్య గురువారానికి 149కు చేరింది. గురువారం ఒక్కరోజే 38 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు మినహా అన్ని జిల్లాలకు కరోనా వైరస్ విస్తరించింది. ఇక ఈ 38 కేసుల్లో ఢిల్లీ నుంచి వచ్చిన వారివే ఎక్కువగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. పాజిటివ్ కేసులు నమోదైన వ్యక్తుల ఇళ్ల చుట్టుపక్కల రెండు కి.మీ. వరకు ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా అదుపులోకి తీసుకుని కరోనా లక్షణాలున్న వారిని జల్లెడ పడుతున్నారు. నెల్లూరులో బుధవారం రాత్రి వరకు 3 పాజిటివ్ కేసులు మాత్రమే ఉండగా ఇప్పుడా సంఖ్య 24కు చేరింది. ఇప్పటివరకు తీసుకున్న నమూనాల్లో 1,321 నెగెటివ్ అని తేలాయని, మరో 409 కేసులకు సంబంధించి వైద్య నివేదికల ఫలితాలు రావాల్సి ఉందని వైద్య, ఆరోగ్య శాఖ గురువారం సాయంత్రం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది.

# శాస్త్రోక్తంగా రామయ్య కల్యాణం

- మిథిలా స్టేడియానికి బదులు బేడా మండపంలో కార్యక్రమం
- లాక్‌డౌన్‌తో భక్తులు లేకుండానే కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, అజయ్‌కుమార్

**సాక్షి, భద్రాద్రి కొత్తగూడెం:** దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో గురువారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. లాక్‌డౌన్ కారణంగా భక్తులు లేకుండానే పరిమిత సంఖ్యలో వేదపండితులు, అర్చకులు, ఇద్దరు మంత్రులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కొద్ది మంది అధికారులు మాత్రమే కల్యాణ వేడుకలో పాల్గొన్నారు. ప్రతీ సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా భద్రాద్రికి భక్తులు భారీగా తరలివచ్చేవారు. కానీ కరోనా వైరస్ ప్రభావంతో ప్రభుత్వం లాక్‌డౌన్ విధించడంతో భక్తులను కల్యాణ వేడుకలకు అనుమతించకపోవడంతో ఆలయం బోసిపోయింది. అయితే కోట్లాది మంది భక్తులు టీవీల ద్వారా ఈ కమనీయ ఘట్టాన్ని వీక్షించి తరించారు. భద్రాచలంలో భక్తరామదాసు కాలం నుంచి ఏటా శ్రీరామ నవమి వేడుకలను మిథిలా స్టేడియంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈసారి మాత్రం ఆలయంలో స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహించే బేడా మండపంలోనే కల్యాణ క్రతువును పూర్తి చేశారు. భక్తులు లేకుండా రామయ్య కల్యాణం నిర్వహించడం ఇదే తొలిసారని అర్చకులు తెలిపారు.

**తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు..**

శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణ క్రతువు గురువారం తెల్లవారుజామున రెండు గంటలకే ప్రారంభమైంది. మొదట స్వామివారికి సుప్రభాతం నిర్వహించారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళాశాసనం, ధ్రువమూర్తులకు అభిషేకం నిర్వహించారు. తరువాత అంతరాలయంలోని మూలమూర్తులకు కల్యాణం జరిపించారు. అనంతరం మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చరణలతో సీతారాముల ఉత్సవ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చారు. రజత సింహాసనంపై ఆశీనులను చేశారు. పవిత్ర జలాలతో పుణ్యాహవచనం చేశారు. భక్త రామదాసు చేయించిన దివ్యాభరణాలను అలంకరించారు. వేదికపై ఆసీనులైన శ్రీసీతారాములకు అర్చకులు ముందుగా తిరువారాధన, విష్వక్సేన పూజ నిర్వహించి మంటప శుద్ధి చేశారు. ఆ తర్వాత మోక్షబంధన, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీతధారణ గావించారు. అనంతరం ఆశీర్వచనం, పాద ప్రక్షాళనం, పుష్పోదక స్నానం నిర్వహించి వరపూజ చేసి, సంకల్పం చెప్పారు. అనంతరం కన్యాదానం, గోదానం, భూదానం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నం లో స్వామి, అమ్మవార్ల ఉత్స వ విగ్రహాలపై జీలకర్ర, బెల్లం ఉంచారు. భక్త రామదాసు చేయించిన మంగళసూత్రాలతో మాంగల్యధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తలంబ్రాల వేడుకను జరిపించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు రమణాచారి, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, స్థానిక ఎమ్మెల్యే పొదెం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు..**

శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి దంపతులు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. అభిజిత్ లగ్న సుముహూర్తాన సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు అర్చకులు స్వామి, అమ్మవార్లకు జీలకర్ర బెల్లం పెట్టారు. భద్రాద్రిలో సీతమ్మవారికి మూడు మంగళసూత్రాలు ఉండటం విశేషం. ఇందులో ఒకటి పుట్టింటిది, రెండోది మెట్టినింటిది కాగా, మూడోది భక్త రామదాసు (కంచర్ల గోపన్న) చేయించినది. భక్త రామదాసు చేయించిన ఆభరణాలు కల్యాణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాముడికి పచ్చల పతకం, సీతమ్మకు చింతాకు పతకం, లక్ష్మణుడికి రామ మాడ అలంకరించారు. ఏపీలోని తూర్పుగోదావరి నుంచి భక్తులు ఈసారీ గోటి (కోటి) తలంబ్రాలు పంపించారు.

## సీబీఎస్‌ఈ 11వ తరగతిలో అప్‌లైడ్ మేథమెటిక్స్




సాక్షి, హైదరాబాద్: విద్యార్థుల్లో గణిత నైపుణ్యాలను మరింతగా పెంచేందుకు 11వ తరగతిలో అప్‌లైడ్ మేథమెటిక్స్‌ను ఐచ్ఛిక (ఎలక్టివ్) సబ్జెక్టుగా సీబీఎస్‌ఈ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇప్పటివరకు స్కిల్ ఎలక్టివ్‌గా ఉన్న ఈ సబ్జెక్టును ఇకపై అకడమిక్ సబ్జెక్టుగా అమలు చేసేలా చర్యలు చేపట్టింది. 2020–21 విద్యా సంవత్సరం నుంచే దీనిని అమలు చేసేలా ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు భవిష్యత్తులో మేథమెటిక్స్ సంబంధ అంశాల్లో అవసరమైన నైపుణ్యాలను 11వ తరగతిలోనే నేర్పించేలా దీనిని అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులందరికీ ఇది తప్పనిసరి సబ్జెక్టుగా కాకుండా, ఇష్టమైన విద్యార్థులే దీనిని ఎంచుకునేలా ఏర్పాట్లు చేసింది. అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు కలిగిన అనుబంధ పాఠశాలలు దీనిని అమలు చేసేలా చర్యలు చేపట్టినట్లు సీబీఎస్‌ఈ వెల్లడించింది. అయితే 11వ తరగతిలో స్కిల్ ఎలక్టివ్ సబ్జెక్టుగా అప్‌లైడ్ మేథమెటిక్స్‌ను ఎంచుకున్న విద్యార్థులు 12వ తరగతిలో అకడమిక్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చని పేర్కొంది. అలాగే ఇకపై ఇది స్కిల్ ఎలక్టివ్ సబ్జెక్టుగా ఉండబోదని స్పష్టం చేసింది.

## నైపుణ్యాలు పెంచేందుకు వెబ్‌సైట్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు పెంచేందుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. కరోనా నేపథ్యంలో విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా ఉద్యోగ నైపుణ్యాలు మెరుగుపరచుకునేలా వివిధ పారిశ్రామిక వర్గాల భాగస్వామ్యంతో పలు ఆన్‌లైన్ పాఠాలను రూపొందించింది. నేషనల్ ఎడ్యుకేషనల్ అలయెన్స్ ఫర్ టెక్నాలజీ (నీట్) పేరుతో ఈ పాఠాలను రూపొందించి, వాటిని వెబ్‌సైట్‌లో (https://neat.aicte-india.org) అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యార్థులు ఇళ్లలో ఉండే తమ వెబ్‌సైట్ ద్వారా ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని ఏఐసీటీఈ వివరించింది.

## ఫోర్బ్స్ జాబితాలో హైదరాబాద్ యువకులు

### అభినందించిన మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: ఫోర్బ్స్ తాజాగా ప్రకటించిన '30 అండర్ 30' ఆసియా జాబితాలో చోటు సంపాదించుకున్న ఐదుగురు హైదరాబాద్ యువకులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గురువారం అభినందించారు. ఆసియా ఖండం వ్యాప్తంగా 30 ఏళ్ల లోపు వయసున్న 30 మందిని ఫోర్బ్స్ గుర్తించగా.. ఈ జాబితాలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువ పారిశ్రామికవేత్తలకు చోటుదక్కింది. ఫోర్బ్స్ జాబితాలో చోటు సంపాదించిన ప్రేమ్ కుమార్ (మారుత్ డ్రోన్స్), అశ్విన్ మోచర్ల (దీ థిక్ షేక్ ఫ్యాక్టరీ), సందీప్ బొమ్మి (యాడ్ ఆన్ మో), విహారి (అర్బన్ కిసాన్), పవన్ కుమార్ చందన (స్కై రూట్ ఏరోస్పేస్) పేర్లతో స్టార్టప్‌లను స్థాపించారు. ప్రస్తుత తరంలోని యువకులు తమ ఆలోచనలకు అనుగుణంగా అద్భుతమైన ఆవిష్కరణలు, వినూత్న మార్గాల్లో పురోగమిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహాయసహకారాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టీ హబ్, వీ హబ్ వంటి కార్యక్రమాల ద్వారా హైదరాబాద్ నగర స్టార్టప్ వాతావరణం బలోపేతమైందని పేర్కొన్నారు. కాగా ఈ ఐదుగురు పారిశ్రామికవేత్తలు ఆయా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. అలాగే వీరు స్థాపించిన కంపెనీలకు ఫండింగ్‌తో పాటు అనేక అవార్డులు కూడా లభించాయి. ఇందులో పలు స్టార్టప్‌లు టీ హబ్ ద్వారా ప్రారంభమవ్వడం లేదా టీ హబ్ ద్వారా సహాయ సహకారాలు అందుకున్నవి కావడం గమనార్హం.

## 'నారాయణ'లో ఆన్‌లైన్ తరగతులు

సాక్షి, హైదరాబాద్: లాక్‌డౌన్ నేపథ్యంలో విద్యార్థుల కోసం ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్లు నారాయణ విద్యా సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఈ ఆన్‌లైన్ తరగతుల ద్వారా ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు ఇంట్లోనే ఉండి వినవచ్చని, పరీక్షలు రాయవచ్చని ఆ ప్రకటనలో సంస్థ పేర్కొంది. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని నారాయణ బ్రాంచీల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని, రోజూ సగటున 10 వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్ తరగతులను వీక్షిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఆన్‌లైన్ విద్యా విధానంతో భవిష్యత్తులో విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులు రాబోతున్నాయని పేర్కొంది.

## 3 నుంచి 9 వరకు జన్‌ధన్ నగదు బదిలీ

### ప్రతి మహిళ ఖాతాలో రూ. 500

| బ్యాంకు ఖాతా చివరి నంబర్ | బదిలీ చేసే తేది |
|---|---|
| 0–1 | ఈనెల 3న |
| 2–3 | ఈనెల 4న |
| 4–5 | ఈనెల 7న |
| 6–7 | ఈనెల 8న |
| 8–9 | ఈనెల 9న |

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జన్‌ధన్‌యోజన మహిళా ఖాతాదారులకు శుక్రవారం నుంచి రూ.500 వేయనున్నారు. ఈనెల 3 నుంచి 9 వరకు బ్యాంకు ఖాతాల వారీగా నగదు బదిలీ చేయనున్నట్లు స్టేట్ లెవల్ బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) వెల్లడించింది. రాష్ట్రంలో మహిళలకు మొత్తం 50.25 లక్షల ఖాతాలు ఉన్నాయి. ఒక్కో మహిళకు రూ.500 చొప్పున కేంద్రం నెలకు రూ.251.25 కోట్లు ఖర్చు చేయనుంది. ఇలా మూడు నెలలకు 753.75 కోట్లు విడుదల చేయనుంది. బ్యాంకు అకౌంట్ నంబర్ చివరి అంకెల ఆధారంగా శుక్రవారం నుంచి బ్యాంకు ఖాతాలలో నగదు బదిలీ చేయనున్నారు. ఈ నెల 9వ తేదీలోపు అందరి ఖాతాలలోకి నగదు బదిలీ అవుతుందని ఎస్ఎల్‌బీసీ ప్రకటించింది. బ్యాంకు, బ్యాంకు మిత్ర, వినియోగదారుల సేవాకేంద్రాలు, ఏటీఎంల ద్వారా నగదు విత్‌డ్రా చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

## సింగరేణిలో సమ్మె సైరన్

గోదావరిఖని (రామగుండం): కార్మికుల సమస్యలపై సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు సమ్మె నోటీసు జారీ చేశాయి. గనుల లే ఆఫ్, కార్మికుల వేతనాల్లో 50 శాతం కోతను నిరసిస్తూ గురువారం గోదావరిఖనిలో సమావేశమైన సింగరేణి సెంట్రల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ ఫోరం నాయకులు సమ్మె నోటీసును ఫ్యాక్స్ ద్వారా సీఎండీకి పంపించినట్లు పేర్కొన్నారు. సింగరేణి పారిశ్రామిక వివాదాల చట్టం 1947 ప్రకారం ఈనెల 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కోవిడ్–19 (కరోనా వైరస్) రిలీఫ్ ఫండ్‌కోసం చెల్లించిన కార్మికుల ఒకరోజు వేతనం సొమ్మును వారికి తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. చట్ట విరుద్ధంగా కార్మికుల వేతనంలో 50 శాతం కోత విధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సొమ్మును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.



నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం బోర్గాం గ్రామంలో రేషన్ షాప్ వద్ద సామాజిక దూరం పాటిస్తూ లైన్లో నిల్చున్న జనం (ఫైల్)

# చదువురాకున్నా 'పాఠం' నేర్పుతున్నారు!

- లాక్‌డౌన్ పూర్తిగా పాటిస్తున్న నిరక్షరాస్యులు, రైతులు, వృద్ధులు
- ఉల్లంఘనుల్లో 18 నుంచి 25 ఏళ్లలోపు వారే అధికం
- పట్టణాల్లో 50 శాతం, గ్రామాల్లో 80 శాతం అమలు... లాక్‌డౌన్ అంటే తెలియదన్న వారు 6 శాతం
- తెలంగాణ పోలీసుశాఖ ఆన్‌లైన్ సర్వేలో వెల్లడి

నిరక్షరాస్యులు, వృద్ధులు.. ఈ దేశంలో ఎన్నికలు జరిగిన ప్రతిసారీ తప్పకుండా ఓటేసే ఉత్తమపౌరులు. ప్రస్తుతం లాక్‌డౌన్ అమలవుతున్న వేళ కూడా వీరు స్ఫూర్తిని చాటుతూ శభాష్ అనిపించుకుంటున్నారు. కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన లాక్‌డౌన్ అమలుకు వీరే పూర్తిగా సహకరిస్తున్నారు. ఈ విషయం తెలంగాణ రాష్ట్ర పోలీసులు నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో వెల్లడైంది. లాక్‌డౌన్ నిబంధనలను చదువురానివారు, వృద్ధులు నూటికి నూరుశాతం పాటిస్తూ ఇంటికే పరిమితమవుతున్నారు. లాక్‌డౌన్ ఉల్లంఘనుల్లో అధికశాతం చదువుకున్న యువతే ఉన్నారు. ముఖ్యంగా 18 – 25 ఏళ్లలోపు వయస్కులే ఎక్కువగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. పనీపాటాలేకుండా రోడ్లపై తిరుగుతూ పోలీసులకు, సమాజానికి ఇబ్బందులు కలిగిస్తున్నారు. – సాక్షి, హైదరాబాద్

### గ్రామస్తులే నయం..!

లాక్‌డౌన్ కచ్చితంగా పాటిస్తున్న వారిలో గ్రామస్తులే నయమని పోలీసుశాఖ వెల్లడించింది. చిన్న పట్టణాలు, టౌన్‌లలో దాదాపు 50 శాతం ప్రజలు కచ్చితంగా నిబంధనలు పాటిస్తున్నారు. గ్రామాలలో అత్యధికంగా 80 శాతం మంది ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. అవసరమైతే తప్ప బయటికి రావడం లేదు. అందులోనూ ఇంటికొక్కరు చొప్పున, ముఖానికి మాస్కులతో భౌతికదూరం పాటిస్తూ బయటికొస్తున్నారు. గ్రామాల్లోని చదువుకోనివారు, వృద్ధులు, వ్యవసాయదారులు, రైతులు మాత్రం నూటికి నూరుశాతం లాక్‌డౌన్ నిబంధనలను పాటిస్తున్నారు.

### లాక్‌డౌన్‌కు ఓకే..

ప్రజారోగ్య పరిరక్షణ నిమిత్తం ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌కు దాదాపు అన్ని వర్గాల ప్రజల నుంచి సానుకూలత వ్యక్తమవుతోంది. మెజారిటీ శాతం ప్రజలు లాక్‌డౌన్‌ను మరింత కఠినంగా, ఇంకా ఎక్కువ రోజులు అమలు చేయాలని కోరుకుంటున్నారు. వీరంతా ఇంటికి ఒకరిని మాత్రమే, అదీ నిత్యావసరాల కొనుగోళ్లకు లేదా అత్యవసర పనులుంటేనే బయటకు పంపుతున్నారు. ప్రభుత్వం సూచించిన నిబంధనలను 80 శాతం యథాతథంగా పాటిస్తూ లాక్‌డౌన్‌కు పూర్తిగా సహకరిస్తున్నారు. ఇక లాక్‌డౌన్ అంటే ఐడియా లేదని చెప్పిన కొందరి తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది.

### లాక్‌డౌన్ ఎన్నిరోజులుండాలి?

| | |
|---|---|
| 15 రోజులు చాలు: | 62% |
| 3 నెలలకు పొడిగించాలి: | 27% |
| 6 నెలలు అమలుచేయాలి: | 5% |
| ఐడియా లేదని చెప్పినవారు: | 6% |

### లాక్‌డౌన్ పాటిస్తున్న ప్రాంతాల శాతం

| | |
|---|---|
| చిన్నపట్టణాలు: | 50% |
| గ్రామాలు: | 80% |

# చికిత్స చేస్తేనే పీపీఈ కిట్లు

- ఐసీయూ, మార్చురీల్లో ఉండే వారికే హైరిస్క్..
- వారికే పూర్తిస్థాయి పీపీఈ కిట్లు అవసరం
- కరోనా మృతదేహాన్ని తరలించడం లోరిస్కే..
- సాధారణ వైద్యులకు 3 లేయర్ల మాస్కులు చాలంటున్న వైద్యాధికారులు
- మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ



సాక్షి, హైదరాబాద్: కరోనా బాధితులకు చికిత్స చేసే డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి మాత్రమే పూర్తిస్థాయిలో పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్స్ (పీపీఈ) అవసరమని వైద్య, ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. సాధారణ వార్డుల్లో, ఇతర చోట్ల పనిచేసే వారికి అవి అవసరం లేదని వెల్లడించింది. కరోనా చికిత్స నేపథ్యంలో తమకు కిట్లు అందుబాటులో లేవంటూ కొందరు డాక్టర్లు, వైద్య సిబ్బంది చేస్తున్న వాదనలు కొట్టేస్తూ.. ఎవరికి ఏమేమి అవసరమన్న దానిపై మార్గదర్శకాలు విడుదల చేసింది. పీపీఈ కిట్లలో ఫేస్ షీల్డ్ గాగుల్స్, ట్రిపుల్ లేయర్ మెడికల్ మాస్కులు, ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్, గౌన్స్, షూ కవర్స్, హెడ్ కవర్స్ ఉన్నాయి. ఇవన్నీ అందరికీ అవసరం లేదని మార్గదర్శకాల్లో సర్కారు తెలిపింది.

**వారికి మాస్క్, గ్లౌవ్స్ చాలు..**

ఓపీలో ఉండే వారికి, అనుమానితులు ఉండే ఐసోలేషన్ వార్డుల్లో పనిచేసే వారికి పూర్తిస్థాయిలో పీపీఈ కిట్లు అవసరం లేదని వైద్య, ఆరోగ్య శాఖ తేల్చి చెప్పింది. ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్‌లు ఉంటే సరిపోతుందని పేర్కొంది. కరోనా మృతదేహాన్ని తరలించే సిబ్బందికి కూడా ఎన్ 95 మాస్కులు, గ్లౌవ్స్ సరిపోతాయని తెలిపింది. కరోనా రోగుల వార్డుల్లో శానిటేషన్ చేసే వారికి, రోగుల బట్టలు ఉతికే వారికి కూడా గ్లౌవ్స్, ఎన్–95 మాస్కులు సరిపోతాయని తెలిపింది. క్షేత్రస్థాయిలో సర్వైలెన్స్ చేసే ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు మూడు లేయర్ల మాస్కులు ధరిస్తే చాలని తెలిపింది. క్షేత్రస్థాయిలో క్లినికల్ ఇన్వెస్టిగేషన్ చేసే వైద్య సిబ్బందికి ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్ చాలని , క్వారంటైన్‌లో ఉన్న కరోనా అనుమానితులను పరీక్షించే డాక్టర్లకు కూడా ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్ సరిపోతాయని తెలిపింది. వారి శరీర ఉష్ణోగ్రత చెక్‌చేసే వారికి, ఇతర సహాయకులకు గ్లౌవ్స్, మూడు లేయర్ల మాస్కులు సరిపోతాయని పేర్కొంది. కరోనా మృతదేహాన్ని ఒకచోట నుంచి మరో చోటకు తీసుకెళ్లే వారికి, కరోనా చికిత్స చేసే గదుల్లో తరచుగా క్లీనింగ్ చేసే వారికి ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్ సరిపోతాయని స్పష్టం చేసింది. కరోనా చికిత్స అందించే ఆస్పత్రుల్లో పనిచేసే అడ్మినిస్ట్రేటివ్, ఫైనాన్సియల్, ఇంజనీరింగ్, సెక్యూరిటీ సిబ్బందికి ఎలాంటి రిస్క్ ఉండదని, వారికి ఎలాంటి మాస్కులు, గ్లౌవ్స్ అవసరం లేదని పేర్కొంది. ఔట్ పేషెంట్ విభాగంలో పని చేసే వారికి మోడరేట్ రిస్క్ మాత్రమే ఉంటుందని, వారికి ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్ సరిపోతాయని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌లో కేసులను చూసే వారికి ఎన్–95 మాస్కులు, గ్లౌవ్స్ సరిపోతాయని స్పష్టంచేసింది.

### హైరిస్క్‌లో ఉన్నవారికే పూర్తి కిట్లు..

గాంధీ, ఉస్మానియా, ఫీవర్, ఛాతీ తదితర కరోనా చికిత్స చేసే ఆసుపత్రుల్లో ఉన్న వారందరికీ పీపీఈ కిట్లు పూర్తిస్థాయిలో అవసరం లేదని సర్కారు తెలిపింది. హైరిస్క్‌లో ఉన్నవారికే అన్ని రకాల ఎక్విప్‌మెంట్లు అవసరమని తేల్చి చెప్పింది. క్రిటికల్ కేర్ ఐసీయూలో పనిచేసే వారికి, మృతదేహాన్ని ప్యాక్ చేసేవారికి, ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవారికి, అంబులెన్స్‌లో పేషెంట్ హెల్త్ కండీషన్‌ను పర్యవేక్షించే వైద్య సిబ్బందికి, వైద్య పరీక్షల కోసం పేషెంట్ వద్ద నమూనాలు సేకరించే వారికి, దాన్ని ల్యాబ్‌కు పంపేవారికి, ల్యాబ్‌లో శాంపిల్స్‌ను పరీక్షించే వారికి, పోస్టుమార్టం చేసే సమయంలో డాక్టర్లకు మాత్రమే పూర్తి స్థాయిలో పీపీఈ కిట్లు అవసరమని తేల్చి చెప్పింది.



## నీటి వినియోగం ఆపండి

### ఇరు తెలుగు రాష్ట్రాలకు కృష్ణాబోర్డు లేఖలు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లోని శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నీటి మట్టాలపై కృష్ణా బోర్డు ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటి మట్టాలకు దిగువకు నీటి మట్టాలు పడిపోగా, నీటి వినియోగం సైతం పెరుగుతోంది.ఈ దృష్ట్యా తాగు నీటి అవసరాలకు కేవలం సాగర్‌పైనే ఆధారపడాల్సి ఉంటుందని, అక్కడ నిల్వ కేవలం 71 టీఎంసీ మేర మాత్రమే ఉన్నందున జాగ్రత్త పడాలని సూచించింది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల నీటి పారుదలశాఖ ఈఎన్‌సీలకు కృష్ణాబోర్డు లేఖలు రాసింది. ప్రస్తుతం శ్రీశైలం ప్రాజెక్టులో కనీస నీటి మట్టం 834 అడుగులకు దిగువకు వెళ్లి నీటి వినియోగం చేయడంతో నిల్వ 830.40 అడుగులకు పడిపోయిందని, కనీస మట్టానికి దిగువన 3.93 టీఎంసీ నీటి వినియోగం సైతం చేశారని బోర్డు లేఖలో వెల్లడించింది. సాగర్‌లో కనీస నీటి మట్టం 854 అడుగులకు ఎగువన కేవలం 71.33 టీఎంసీలు మాత్రమే లభ్యత నీరుందని, ఈ నీటితోనే ఇరు రాష్ట్రాలు జూలై ఆఖరు వరకు నెట్టుకు రావాల్సి ఉంటుందని వెల్లడించింది. వర్షాకాలం వరకు ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలు తీరాలంటే ఈ నీటినే జాగ్రత్తగా వాడాల్సి ఉంటుందని, ఈ దృష్ట్యా ప్రాజెక్టుల నుంచి నీటి వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని కోరింది.

# కొత్త విద్యాసంవత్సరం ఆలస్యం!

▶ మొదటి పేజీ తరువాయి

పరిస్థితి లేదు. పైగా వేసవి ఎండల కారణంగా ఇప్పుడు నిర్వహించాల్సినవి ఒంటి పూట బడులే. అవీ మూత పడ్డాయి. ఈనెల 14 తర్వాత మరో 9 రోజులు గడిస్తే విద్యా సంవత్సరమే పూర్తి కానుంది. అప్పటివరకు కూడా కరోనా అదుపులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో 220 పనిదినాల నిబంధనకు విఘాతం కలుగుతోంది. 40 రోజుల ముందుగానే విద్యా సంవత్సరాన్ని ముగించే పరిస్థితి వచ్చింది. వచ్చేది వేసవి కాబట్టి ఆ 40 రోజులు పాఠశాలలను నిర్వహిద్దామన్నా సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ఏం చేయాలన్న దానిపై విద్యాశాఖలో స్పష్టత లేకుండా పోయింది. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

**'పరీక్షల్లేకున్నా పాస్'ఉత్తర్వుల్లో జాప్యం**

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 19న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ఈనెల 6వ తేదీలోగా పూర్తి కావాలి. కరోనా కారణంగా మార్చి 23వ తేదీ నుంచి నిర్వహించాల్సిన అన్ని పరీక్షలు వాయిదా పడ్డాయి.అకడమిక్ కేలండర్ ప్రకారం ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించాల్సిన పరీక్షలు జరిగేలా లేవు. ప్రభుత్వం అన్ని విద్యా సంస్థలకు ఈనెల 14 వరకు సెలవులను ప్రకటించింది. 15న పాఠశాలలు ప్రారంభమైనా విద్యా సంవత్సరం ముగిసే 23వ తేదీలోగా పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేదు. అందుకే ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులను ఆటోమేటిక్‌గా పాస్ చేసి పైతరగతికి పంపించాలని భావిస్తోంది. అయితే దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఇంకా జారీ చేయలేదు. ఈ విషయంలో విద్యాశాఖలో కిందిస్థాయి అధికారులు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. పాఠశాల విద్యా కమిషనర్, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఒకరే కావడంతో ప్రభుత్వం ఏం ఆలోచిస్తుందన్నది కింది స్థాయి అధికారులకు తెలియని పరిస్థితి. అందుకే ప్రభుత్వం నుంచి నిర్ణయం వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని ఓ ఉన్నతాధికారి చెప్పారు.



### జూన్ 1న బడులు ప్రారంభమయ్యేనా?

ఇక కరోనా ప్రభావం ఈ నెలంతా ఉండే పరిస్థితులే కనిపిస్తున్నాయి. మే నెలలో ఆ ప్రభావం ఉండవచ్చన్న ఊహాగానాలు వెలువడుతున్నాయి. అదే జరిగితే జూన్ 1న వేసవి సెలవులు ముగిసి, తిరిగి బడులు ప్రారంభం కావడం (కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం) కష్టమేనని అధికారులు పేర్కొంటున్నారు. పరిస్థితులు చక్కబడితే ఈ నెలాఖరులో మిగిలిపోయిన పదో తరగతి పరీక్షలను నిర్వహించే అవకాశముంటుంది. లేదంటే మే నెలలోనే నిర్వహించాల్సి వస్తుంది. దాంతో ప్రాథమిక పాఠశాలలకు బోధించే టీచర్లంతా మే నెలలోనూ ఇన్విజిలేటర్లుగా పని చేయాల్సి వస్తుంది. అంతేకాదు పరీక్షలు అయ్యాక సబ్జెక్టు టీచర్లు జవాబు పత్రాల మూల్యాంకనం చేయాల్సి వస్తుంది. దీంతో వారికి అదనంగా సెలవులు ఇవ్వాల్సి వస్తుంది కాబట్టి వాటిని సర్దుబాటు చేస్తూ కొత్త విద్యా సంవత్సరాన్ని ఆలస్యంగా ప్రారంభించాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

## మార్కెట్లకు 'మహా' భయం

### గడ్డిఅన్నారం మార్కెట్‌ను మూసివేయాలని వినతి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కూరగాయలు, పండ్ల మార్కెట్లకు మహారాష్ట్ర భయం పట్టుకుంది. అక్కడ కరోనా బాధితుల సంఖ్య పెరుగుతుండటం, మరణాల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, ఆ రాష్ట్రం నుంచి సరుకు రవాణా చేస్తున్న వాహనాల దగ్గరకు వెళ్లాలంటేనే మార్కెట్ సిబ్బంది, హమాలీలు జంకుతున్నారు. మహారాష్ట్ర నుంచే ప్రధానంగా ఉల్లిగడ్డతో పాటు బత్తాయి, ద్రాక్ష దిగుమతి ఎక్కువగా ఉండటంతో ఆ వాహనాల సరుకులు దించేందుకు వెనుకంజ వేస్తున్నారు. స్థానిక వ్యాపారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డిని బుధవారం కలిసి, గడ్డిఅన్నారం మార్కెట్‌ను తాత్కాలికంగా మూసివేయాలని కోరారు. మహారాష్ట్ర వాహనాల ద్వారా కరోనా సోకుతోందన్న ఆందోళన ఎక్కువగా ఉన్న దృష్ట్యా, దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. అయితే, మార్కెట్‌ను పక్కనే ఉన్న 11 ఎకరాల స్థలానికి తరలించి అక్కడ కొన్ని రకాల పండ్ల అమ్మకాలు చేపడితే రద్దీని నియంత్రించ వచ్చని మంత్రి పేర్కొన్నట్లుగా తెలిసింది.

## 'ఒక్కొక్కరికి రూ. 5 వేలు ఇవ్వండి'

సాక్షి, హైదరాబాద్: కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు, గ్రామీణ పేదలను ఆదుకునేందుకు వారికి రూ. 5 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. కరోనా వైరస్ వ్యాప్తి దృష్ట్యా దేశంలోని సామాజిక, ఆర్థికమైన అంశాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నందున వ్యవసాయ, అసంఘటిత కార్మికులు, గ్రామీణ పేదలకు ఊరటనిచ్చే చర్యలు చేపట్టాలని ప్రధానికి రాసిన లేఖలో ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.విజయరాఘవన్, ప్రధానకార్యదర్శి బి.వెంకట్ కోరారు. ఉపాధి హామీ పథకం కింద నమోదు చేసుకున్న వారిలో 12.3 కోట్ల మంది క్రియాశీలకంగా పనుల్లో పాల్గొంటున్నారని, వారిలో 35% వరకు ఎస్సీ, ఎస్టీలున్నారని, వారికి ఈ సాయం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# బిజినెస్ కరోనా..

▶ మొదటి పేజీ తరువాయి

మూడు ప్రైవేటు బ్యాంకులు పోటీపడుతున్నాయి. తాజాగా ఇవి నాలుగు రోజులుగా కాన్ఫరెన్స్, వీడియో కాల్స్ రూపంలో సమావేశాలు ఏర్పాటుచేస్తూ ఉద్యోగులకు బిజినెస్ అప్పగిస్తున్నారు. కొత్తగా ప్రారంభమైన బ్రాంచీల్లో నెలకు కనీసం రూ.3 కోట్ల వ్యాపారం చేయాలని టార్గెట్ విధిస్తున్నారు. అప్పటికే ప్రారంభమై కనీసం ఏడాదైన బ్రాంచీలకు గతేడాది చేసిన బిజినెస్ మొత్తంలో అదనంగా 50 శాతం, పెద్ద బ్రాంచీలైతే ఒకటిన్నర రెట్లు వ్యాపారం చేయాలని లక్ష్యం విధించేశారు. కాస్త అటూఇటూగా ఈ పోటీ బ్యాంకులు కొత్త టార్గెట్లతో ఉద్యోగులను పరుగులు పెట్టిస్తున్నాయి.

**కొత్త ఖాతాలు, బీమా పాలసీలు, ఫారెక్స్ కార్డులు..**

బ్యాంకు ఉద్యోగులకు తొలి టార్గెట్ కొత్త ఖాతాలే. సేవింగ్స్, కరెంటు ఖాతాలతోపాటు, ఫిక్స్‌డ్, రికరింగ్ డిపాజిట్లు పెంచటం తదుపరి టార్గెట్. ప్రస్తుతం అన్ని వాణిజ్య బ్యాంకులు బీమా కంపెనీలతో టైఅప్ కుదుర్చుకున్నాయి. కొన్నింటికి సొంత బీమా సంస్థలున్నాయి. ఖాతాలు తెరిచే వారితో ఏదోఒక బీమా పాలసీ కూడా తీసుకునేలా చేస్తున్నాయి. జీవిత, వాహన, ఆరోగ్య బీమాలు తీసుకోవాలని ఖాతాదారులను ఒత్తిడి చేస్తుంటారు. వీటికి తోడు గృహ, వ్యాపార, విద్యారుణాలు.. ఇలా ఏదోఒక లోన్ తీసుకునేలా ఒప్పిస్తుంటారు. ఈ టార్గెట్లను సులభంగా సాధించేందుకు బ్యాంకులు తెలివిగా రుణాలతో బీమా పాలసీలను అనుసంధానిస్తున్నాయి. వీటన్నింటికి సంబంధించి విడివిడిగా టార్గెట్లను ఫిక్స్ చేసి బ్రాంచీల ముందుంచారు. కరోనా భయం, లాక్‌డౌన్ నిబంధనలతో అసలు బ్యాంకులకు ఖాతాదారులు రావటమే తగ్గింది. ఈ తరుణంలో టార్గెట్లను ఎలా సాధించాలని ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు.

**పదోన్నతులతో ముడిపెడుతూ..**

బ్యాంకుల్లో పదోన్నతి రావాలన్నా, జీతం పెరగాలన్నా వ్యక్తిగత టార్గెట్లను సాధించడంపైనే ఆధారపడి ఉంటుంది. టార్గెట్లపై ఏమరుపాటుగా ఉంటే దాని ఫలితం ప్రమోషన్లు, జీతాల పెరుగుదలపై ఉంటుందని పరోక్ష హెచ్చరికలు వినిపిస్తున్నాయి. దీంతో రెండ్రోజులుగా బ్యాంకు ఉద్యోగులు ఖాతాదారులకు సంబంధించిన బ్యాంకు అంతర్గత పనులు చూస్తూనే బిజినెస్ పెంచుకునే కసరత్తు ప్రారంభించారు. ఎక్కువ మంది ఫోన్లలో ఖాతాదారులతో మాట్లాడుతూ ఏదో ఓ పాలసీ తీసుకునేలా, ఖాతాలో డిపాజిట్లను పెంచేలా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ లాక్‌డౌన్ వల్ల వేతనాల్లో కోతపడే పరిస్థితి ఉందని, ఇప్పుడు ఇటువంటివి తలకెత్తుకోలేమని ఖాతాదారులు చెబుతుండటంతో బ్యాంకు ఉద్యోగులకు దిక్కుతోచడం లేదు.

### 'పీఎం కేర్స్'భారం కవరింగ్ కోసం..

చాలా బ్యాంకులు ప్రస్తుతం పీఎం కేర్స్ ఫండ్ కు భారీగా విరాళాలిస్తున్నాయి. ఇది అభినందించాల్సిన విషయమే. మరో పక్క వాటికిది అదనపు ఖర్చు కూడా. ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం బిజినెస్‌ను మరింత పెంచుకోవటం ద్వారా ఈ భారాన్ని కవర్ చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఫలితంగా ఈ భారం కూడా వినియోగదారులపై పడనుంది.

### టార్గెట్లు.. ఆప్షన్లు

- బ్యాంకు సిబ్బందిలో ప్రతి ఒక్కరు రోజూ కనీసం ఆరుకు తగ్గకుండా లావాదేవీలు చేయాలని ఓ ప్రధాన వాణిజ్యబ్యాంకు టార్గెట్ పెట్టింది. కొత్త ఖాతాలు, కొత్త డిపాజిట్లు, డిపాజిట్ల మొత్తం పెంపు, బీమా పాలసీలు.. వీటిలో ఏవైనా ఆరు చేయాలి.
- రుణాలకు సంబంధించి ప్రత్యేకంగా పాయింట్స్ విధానం ఉంటుంది. పంట, గృహ, విద్య, విదేశీ రుణాలు... ఇలా ఆయా రుణాలకు సంబంధించి నెలకు 600 పాయింట్లకు తగ్గకుండా సాధించాలని మరో బ్యాంకులో లక్ష్యం విధించారు.
- ఎన్ఆర్ఐలు పంపే డబ్బులను ఒడిసిపట్టుకునే (ఫారిన్ రెమిటెన్స్) విషయంలోనూ టార్గెట్లున్నాయి. వీరు ఇండియాలో ఉండే తమవారికి పంపే డబ్బును తమ బ్యాంకులో ఖాతా తెరిచి జమ చేసేలా చేయటం అన్నమాట.

సాక్షి
శుక్రవారం, ఏప్రిల్, 3

# రాష్ట్రాలకు చేయూత ఏది?

కరోనాపై ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న సమరంలో మన దేశం కూడా పూర్తిగా నిమగ్నమైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఆ మహమ్మారిపై సమష్టిగా బహుముఖ పోరు కొనసాగిస్తున్నాయి. ఊహించనివిధంగా వచ్చిపడిన ఈ ఉత్పాతాన్ని ఎదుర్కొనడానికి దేశమంతా లాక్‌డౌన్ ప్రకటించడం, వ్యాధిగ్రస్తుల్ని గుర్తించి, వారిని పరిశీలన కేంద్రాలకు తరలించడం, ఆసుపత్రుల్లో చికిత్స అందించడం, నిరుపేద వర్గాలకు రేషన్ అందించడం, నగదు సాయం చేయడం వగైరాలకు ప్రభుత్వాలన్నీ భారీ మొత్తం వ్యయం చేయాల్సివస్తోంది. అదే సమయంలో నిత్యావసరాలు, ఔషధాలు విక్రయించే దుకాణాలు తప్ప ఇతర వాణిజ్య కార్యకలాపాలన్నీ స్తంభించి ఖజానాలు బోసిపోతున్నాయి. పలు ప్రభుత్వాలు సిబ్బంది జీతాల్లో తాత్కాలికంగా కోత విధించాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లాక్‌డౌన్ ముగిశాక తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అటు ముఖ్యమంత్రులు కూడా ఇప్పటికే తీసుకున్న చర్యల్ని తెలియజేయడంతోపాటు ఆర్థిక ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రాగల వారాల్లో కరోనాపై మరింత తీవ్రంగా పోరాడవలసివుంటుందని ప్రధాని చెప్పడాన్ని గమనిస్తే రాష్ట్రాలు నిర్వ ర్తించాల్సిన కర్తవ్యాలు మున్ముందు చాలానే వుండొచ్చు. ఈ మహమ్మారిపై ముందుండి పోరాడుతున్న వైద్య సిబ్బందికి మాస్కులు, వ్యక్తిగత పరిరక్షణ ఉపకరణాలు మొదలుకొని రోగులకు సిద్ధం చేయాల్సిన వెంటిలేటర్లు, ఔషధాల వరకూ ఎన్నో అందుబాటులోకి తీసుకురావాల్సివుంటుంది. వీటికితోడు ఈ పంట దిగుబడుల కాలంలో వాటిని కొనడానికి రాష్ట్రాలు భారీగా వెచ్చించాల్సివుంటుంది.

దేశంలో అన్ని రాష్ట్రాల ఆదాయ వనరులూ ఒకేలా లేవు. కొన్ని రాష్ట్రాలు పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా ముందంజలో వుంటే మరికొన్ని ఎంతో వెనకబడి వున్నాయి. ఆరేళ్లక్రితం విభజన అనంతరం ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ అప్పటినుంచీ ఆర్థిక ఇబ్బందుల్లో వుంది. ఆ సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా హామీని అమలు చేసి, రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడాలని విపక్ష నేతగా ఉన్నప్పటినుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూనేవున్నారు. గతంలో సీఎంగా పనిచేసిన చంద్రబాబు ప్రత్యేక హోదా వదులుకుని ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించారు. దానివల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు. పైగా ఆయన పాలన రెండున్నర లక్షల కోట్ల అప్పులు మిగిల్చింది. ఇలాంటి అననుకూల వాతావరణంలో వచ్చిపడిన కరోనా సంక్షోభం వల్ల ఆదాయం మరింతగా తగ్గింది. అమ్మకం పన్ను, ఎక్సైజ్ పన్ను వగైరాలకు సంబంధించిన ఆదాయం గణనీయంగా పడిపోయింది. అయినా కరోనాను ఎదుర్కొనడానికి ఆ రాష్ట్రం శాయశక్తులా కృషి చేస్తోంది. వనరులను సమీకరించడానికి ప్రజా ప్రతినిధులు మొదలుకొని ప్రభుత్వ సిబ్బంది, పింఛన్‌దార్ల వరకూ సగం వేతనాలను వాయిదా వేయాల్సివచ్చింది. వేరే రాష్ట్రాలతో పోలిస్తే మెరుగైన ఆదాయం వున్న మహారాష్ట్ర సైతం లాక్‌డౌన్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతోంది. ఈసారి ఆదాయం రూ. 2,10,824 కోట్లు వుండొచ్చునని 2020–21 బడ్జెట్‌లో అంచనా వేసిన ఆ రాష్ట్రం అందులో 5.35 శాతం... అంటే రూ. 27,000 కోట్ల మేర తగ్గొచ్చునని అంచనా వేసింది. పంజాబ్, బెంగాల్, రాజస్తాన్ వంటివి నిరుపేద వర్గాలకు చేయూతనందించడానికి కూడా తమ దగ్గర తగినన్ని నిధులు లేవంటున్నాయి. వలస కార్మికులను, హఠాత్తుగా ఉపాధి కోల్పోయినవారిని ఎలా ఆదుకోవాలన్న అంశాన్ని తేల్చకుండానే కేంద్రం ప్రకటించిన లాక్‌డౌన్‌తో చాలా రాష్ట్రాలు సమస్యల్లో కూరుకుపోయాయి. స్వస్థలాలకు వెళ్లడం కోసం కాలినడకన బయల్దేరిన వలస కార్మికులను ఎక్కడికక్కడ నిలిపేసి, వారికి కూడు, గూడు కల్పించాలని కేంద్రం రాష్ట్రాలను కోరింది. కానీ ఇందుకు కావలసిన నిధులు ఎవరిస్తారన్నదే సమస్య. సంక్షోభ సమయాల్లో వ్యయం చేయడానికి రాష్ట్రాలకు వుండే విపత్తు నిధుల నుంచి ఖర్చు చేసుకోవడానికి అనుమతినిస్తున్నట్టు గత వారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వర్తమానం పంపింది. కానీ ఆ పద్దులో వుండేది చాలా స్వల్ప మొత్తమని రాష్ట్రాలు చెబుతున్నాయి. ఆ పద్దు కింద రాష్ట్రాలకు రావలసిన నిధులకు సంబంధించిన బిల్లులు కేంద్రం వద్ద ఎప్పుడూ పెండింగ్‌లోనే వుంటాయి. ఇక నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్‌కు సంబంధించిన పద్దులో రూ. 31,000 కోట్లు ఉన్నాయని, వాటిని కూడా వినియోగించుకోవచ్చునని కేంద్ర ఆర్థికమంత్రిత్వ శాఖ చెప్పింది. కానీ నమోదైన నిర్మాణ రంగ కార్మికులకు మాత్రమే అది వినియోగించాలి.

అసాధారణమైన విపత్తులు విరుచుకుపడినప్పుడు అందుకనుగుణంగా స్పందించడం కేంద్రం బాధ్యత. లేనట్టయితే రాష్ట్రాలు సంక్షోభంలో చిక్కుకుపోతాయి. ఎన్నికల సమయంలో చేసే వాగ్దానాల మాదిరి ఆ స్పందన వుండకూడదు. గత నెలాఖరున కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన కరోనా ప్యాకేజీకింద ప్రకటించిన నిధుల్లో కొన్ని అంతక్రితం ప్రకటించిన వివిధ పథకాలకు సంబంధించినవే. సారాంశంలో రాష్ట్రాల ఖజానాలు క్రమేపీ చిక్కిపోతున్నాయి. సాధారణ పరిస్థితుల్లో ద్రవ్యలోటు కట్టుదాటకూడదన్న పట్టుదలతో నిధుల వ్యయంలో కేంద్రం జాగ్రత్తగా అడుగులేస్తుంది. కానీ ఇప్పుడు నెలకొన్న ఈ సంక్షోభకాలంలో దాన్ని సడలించుకోవాలి. రాష్ట్రాలకు నిధుల కొరత లేకుండా చూడాలి. అప్పుడు మాత్రమే రాష్ట్రాలు ఈ సంక్షోభాన్ని అధిగమించాక ఉపాధి కల్పనకు కృషి చేయగలవు. ఈ పరిస్థితుల్లో జీఎస్‌టీ పద్దు కింద కేంద్రానికి అందాల్సిన నిధులు కూడా తగ్గుతాయనడంలో సందేహం లేదు. కానీ ఆర్‌బీఐ నుంచి రుణం తీసుకోవడంతో సహా అనేక చర్యలు తీసుకుని ఈ నిధుల్ని సమీకరించాలి. దీర్ఘకాలం లాక్‌డౌన్‌తో తలెత్తే సమస్యల వల్ల ప్రజల్లో అసంతృప్తి, అశాంతి ప్రబలకుండా వుండాలంటే రాష్ట్రాలకు ధారాళంగా నిధులందించాలి. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలి.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శార్వరి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, తిథి శు.దశమి రా.7.40 వరకు, తదుపరి ఏకాదశి
నక్షత్రం పుష్యమి ప.1.46 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం 2.04
నుంచి 3.36 వరకు, దుర్ముహూర్తం ఉ.8.24 నుంచి 9.11 వరకు
తదుపరి ప.12.26 నుంచి 1.15 వరకు
అమృతఘడియలు... ఉ.7.30 నుంచి 9.03 వరకు.

**సూర్యోదయం :** 5.58
**సూర్యాస్తమయం:** 6.09
**రాహుకాలం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు
**యమగండం :** ప.3.00 నుంచి 4.30 వరకు

# ఆమె ప్రకృతి-సమతూకం ప్రవృత్తి


దిలీప్ రెడ్డి

‘‘పాడు అనుభవాన్ని వదిలించుకో, కానీ, పాఠాన్ని మాత్రం భద్రపరచుకో’’ అంటారు ప్రఖ్యాత అమెరికా రచయిత, బ్లాగర్ ఫ్రాంక్ సోనెన్‌బెర్గ్. ఇటీవలి కాలంలో... మానవ జాతి యావత్తు ఎదుర్కొంటున్న కఠిన పరీక్ష కరోనా! మానవేతిహాసంలో పెద్ద మారణ హోమాలనుకున్న ప్రపంచ యుద్ధాల కన్నా ఇది పెద్ద కుదుపు. కొనసాగుతూనే ఉన్న ఈ ఉపద్రవం ఎందాకో తెలియని ఆందోళన! చైనాలో మొదలై... భూగోళం అన్ని కొసల దేశ దేశాల్లోకి వీసా, రాజపత్రాలు లేకుండానే ఈ వైరస్ చొరబడింది. సురక్షిత ఆరోగ్య వ్యవస్థల్నీ ధ్వంసంచేసి జీవితాల్ని కకావికలం చేస్తోంది. విశ్వవ్యాప్తంగా దాదాపు పది లక్షల మందికి సోకి, సుమారు యాభైవేల మందిని ఇప్పటికే పొట్టన పెట్టుకుంది. మధ్య ప్రాచ్యంలో చిచ్చు రేగింది. వైరస్ దాడికి అభివృద్ధి చెందిన యూరప్ సమాజం అతలాకుతలమైంది. అగ్ర రాజ్యం అమెరికా రోజుకో రీతిన వణకుతోంది. భారత్ యుద్ధమే ప్రకటించింది. భూమి మీద ఇప్పుడు.. అత్యవసరాలు తప్ప వ్యవస్థలన్నీ నిలిచిపోయాయి. మనిషి క్రియాశీల మనుగడకు తాళం పడింది. వైరస్ సోకితే చికిత్సకు మందు, రానీకుండా నివారణకు వాక్సిన్.. కనుగొనే పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ప్రపంచమంతా నివ్వెరపోతోంది! ఏమిటీ? ఇన్నేళ్ల కృషిలో మనిషి సాధించిన శాస్త్రసాంకేతిక ప్రగతి ఇంతేనా? కనీసం జీవి కూడా కాని ఒక ప్రొటీన్ కణం ఇంత విధ్వంసం చేస్తే సమాధానం లేదా? సమర్థంగా ఎదుర్కోలేడా? నేలపై మనిషి తుది విజేత కాడా? ఇవి ఇప్పుడు జనం మెదళ్లలో మొలుస్తున్న ప్రశ్నలు. సహజ వనరుల నెలవు, జీవవైవిధ్యానికి తల్లి అయిన సర్వసత్తాక ప్రకృతి ముందు మనిషి ఎప్పుడూ... అల్పజీవే! ఈ సత్యాన్ని రుజువు చేస్తోంది తాజా విపత్తు! ఏది, ఎప్పుడు హద్దు మీరినా దాన్ని నియంత్రిస్తూ సమస్త జీవరాశినీ సమతూకంలో ఉంచే ప్రకృతి స్వీయ నియంత్రణ ప్రక్రియలో భాగమేనా ఈ విలయం? అనే సందేహాన్ని మేధావి వర్గం వ్యక్తం చేస్తోంది. సరే, వైరస్‌పై పోరాటంలో మనిషి నెగ్గి, శాస్త్ర పరిశోధనలు ఫలించి, వీలయినంత తొందరగా ఈ విపత్తుకు పరిష్కారం లభించాలనే అందరూ కోరుకుంటున్నారు. ఈ చేదు అనుభవం మనిషికి ఓ గట్టి గుణపాఠం అవుతుందా? అయితే బాగుండు కదా! మనిషి మళ్లీ పాతరోజుల్లోకి జారి.. ప్రకృతితో మమేకమై, జీవవైవిధ్యంతో సహజీవనం చేస్తూ, మంచి మానవ సంబంధాలతో, పేరాశ వీడి జీవితాన్ని సరళం చేసుకుంటే ఎంత బాగుండు! అనే సనసన్నని కోర్కెలు ఆశావహుల మదిలో రేగుతున్నాయి. ప్రస్తుత ‘లాక్‌డౌన్’ కాలంలో బలవంతంగానైనా స్వీయనియంత్రణతో సంక్రమించే మంచి అలవాట్లను జనం మానకుండా కొనసాగిస్తే బాగుంటుందనేది ఆశ!

### ప్రకృతిని భంగపరిచినందుకే...

రకరకాల జీవుల్ని చైనా వాళ్లు ఆహారంగా తినడం కరోనా వ్యాప్తి తర్వాత పెద్ద చర్చనీయాంశమైంది. ఎలుకల్ని, తేళ్లని, పాముల్ని, గబ్బిలాలను తినడాన్ని చాలా సమాజాలు ఈసడించుకున్నాయి. కిక్కిరిసిన వారి మాంసాహార మార్కెట్ల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొట్టాయి. ప్రకృతి విరుద్ధమైన మనిషి నడతవల్లే ఇలాంటి ఉపద్రవాలొస్తాయని చాలా మంది భావించారు. విశ్వవ్యాప్త లాక్‌డౌన్ తర్వాత జనం ఇళ్లకే పరిమితమై... విమానాశ్రయాలు, నౌకా శ్రయాలు విశ్రాంతిలోకి జారినపుడు గమ్మత్తులే జరిగాయి. జాతీయ– స్థానిక రహదారులు వాహనాలు లేక బోసిపోయినపుడు, వీధులు సడి–సందడి లేని వాకిళ్లయినపుడు వన్యప్రాణులు స్వేచ్ఛగా జనావాసాల్లోకి రావడం ఎందరికో ఆనందం కలిగించింది. ఇటలీ నౌకాశ్రయ జలాల్లో డాల్ఫిన్లు స్వేచ్ఛగా ఆడటం, చాలా చోట్ల జింకలు, లేళ్లే కాకుండా సింహాలు, పులులు వంటి క్రూరమృగాలూ రోడ్లపైన, వీధుల్లో యథేచ్ఛగా తిరగడం ఆలోచనాపరుల్లో కొత్త భావాల్ని రేపింది. వాటి స్వేచ్ఛా విహారమంటే అవి జనావాసాల్లోకి రావడం కాదని, మనిషి గృహ నిర్బంధంలో ఉండటంతో తమ స్వస్థలాలకు వచ్చినట్టని పర్యావర ణవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఫాక్టరీలు మూతపడి,

### సమకాలీనం




వాహనాలు నిలిచి పోయి, వీధుల్లో జన సంచారం తగ్గి దాదాపు అన్ని రకాల కాలుష్యాలు రమారమి తగ్గిపోవడం ఓ కొత్త అనుభూతిచ్చింది. పిట్టల అరుపులూ ఇళ్లల్లోకి స్పష్టంగా వినిపిస్తున్నాయి. సాయంకాలం పూట బాల్కనీల్లోకి వస్తే, ఎక్కడో వీధి చివర ఆరుబయట సాగే ముచ్చట్లూ లీలగా చెవికి సోకుతున్నాయి. ముఖ్యంగా నగర, పట్టణవాసులు వినూత్న జీవి తాన్నే చవిచూస్తున్నారు. అపరిమిత వస్తు వ్యామోహం, ధనాశతో మనిషి జీవితాన్ని ఎంత సంక్లిష్టం చేసుకున్నాడు! అలా కాక, నిరా డంబరపు సాధారణ జీవితమైతే ఎంత సరళంగా ఉంటుందో తెలిసి వస్తోంది. అందులోని మాధుర్యం ఎంతన్నది, అది మరచి ఒకట్రెండు తరాలు మారినా.. ఆధునికులకు స్వయంగా అనుభవంలోకి వస్తోంది.

### ఇది సామాజిక దగ్గరితనమే!

కరోనా వైరస్ వ్యాప్తిని నివారించేందుకు ప్రభుత్వాలు పిలుపునిచ్చింది, మనమంతా పాటిస్తున్నది సామాజిక దూరం కానేకాదు! అది భౌతిక దూరం. ముందు తెలియక ఎవరో అలా ‘సోషల్ డిస్టాన్సింగ్’ అనే పదబంధం చలామణిలోకి తెచ్చినా, అది తప్పుడు ప్రయోగమే! ఒకరి నుంచి వేరొకరికి సంక్రమించే స్వభావం ద్వారా ఈ వైరస్ వ్యాధిని వ్యాపింప జేస్తుందని, మనిషికి మనిషి దూరంగా ఉండాలనేదే ఇందులో కీలకం. మనుషులు బృందాలుగా, సమూహాలుగా ఉండొద్దనేది పిలుపు. అందుకు కావాల్సింది భౌతిక దూరమే తప్ప సామాజిక దూరం కాదు. పైగా, ఇలా ఉండమనే ‘లాక్ డౌన్’ నిషేధాజ్ఞలతో ఎక్కువ మంది ఇళ్లకే పరిమితమౌతున్నారు. ఇళ్లనుంచే ఉద్యోగాలు చేస్తున్నారు. ఎక్కడో వేరే నగరాలు, పట్టణాలు, హాస్టళ్లలో ఉండే పిల్లల్ని కూడా రప్పించుకొని, తగు జాగ్రత్తలతో అంతా ఇళ్లకే పరిమితమౌతున్నారు. ఇంటర్‌నెట్ విస్తృతి పుణ్యమా అని, చదువులకు ఆటంకం కలుగకుండా ఆన్‌లైన్ తరగతులు కూడా పిల్లలకు లభిస్తున్నాయి. ఫలితంగా కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత పెరిగి సంబంధాలు బలపడుతున్నాయి. విదేశాల్లో ఉన్నవారితో నిత్యం మాట్లాడుకుంటున్నారు. ఏదైనా విపత్తు వచ్చినపుడు, కలిసి ఉండటం వారిలో మరింత చనువుని, ధైర్యాన్ని, సామీప్యతను పెంచేదే! పరస్పర అవగాహనా పెరుగుతుంది. కరోనా తర్వాతి తాజా పరిణామాలతో ఇప్పుడు కుటుంబంలోని వ్యక్తుల మధ్య, కుటుంబాలు, కాలనీలు, పల్లెలు, రాష్ట్రాలు, దేశాల మధ్య... ఇలా అవసరార్థం పెరిగిన సామాజిక సామీప్యత మంచికే దారితీస్తోంది! సమాజంలో మనుషుల మధ్య అంతరాలు తగ్గించే క్రమంలో సామాజిక దూరం ఉండొద్దని, సామాజిక సామీప్యతే మంచిదని ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు సాగాయి, ఇంకా సాగుతున్నాయి! ఈ మూడు వారాల నిర్బంధం మనుషుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచి, మానవ సంబంధాల్ని మెరుగుపరచాలని కోరుకోవడంలో తప్పులేదు.

### మార్పును సుస్థిరం చేస్తేనే!

వ్యక్తులకే కాకుండా అది వ్యవస్థలకు, ప్రభుత్వాలకూ వర్తిస్తుంది. కరోనా విసిరిన పెనుసవాల్‌ను మనం ఎదుర్కొంటున్న క్రమంలో కొన్ని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. వాటికనుగుణంగా ప్రజలు, ప్రభుత్వాలు నిర్దిష్ట చర్యలకు సిద్ధపడాలి. సమాజ భవిష్యత్తును తీర్చి దిద్దుద్దాలి. స్వీయ గృహ నిర్బంధ సమయంలో ఉన్న జనం ప్రశాంత చిత్తంతో ఆలోచించాలి. కనీసం మూడు వారాలు, అంటే 21 రోజులు... పాత అలవాట్లను వదిలించుకోవడానికి, కొత్త అలవాట్లను దృఢపరచుకోవడానికి ఇది సరిపోయే సమయమేనని మానసికశాస్త్ర నిపుణులూ అంగీకరిస్తున్నారు. తమలో వచ్చిన మంచి మార్పుల్ని ఎవరికి వారు శాశ్వతీకరించుకోవాలి. అన్ని వేళలా శుభ్రత పాటించాలి. ఎంపిక చేసిన పౌష్టికాహారంతో ఆహార పద్ధతుల్ని మార్చుకోవాలి. చిన్నపాటి కసరత్తుతో శారీ రక శ్రమ చేయడం, సమయం వెచ్చించి కుటుంబ సభ్యులతో చనువు పెంచుకోవడం, మద్యానికి పూర్తిగా దూరమవడం, పరిమిత వస్తువు లతో నిరాడంబరంగా ఉంటూ జీవనశైలి మార్చుకోవడం.... ఇలా జన మంతా తమలో వచ్చిన ఎన్నో మంచి మార్పుల్ని సుస్థిరం చేయాలి. తద్వారా పాత రోజులు గుర్తొచ్చేలా సరికొత్త సమాజాన్ని ఆవిష్కరించొచ్చు. పొట్ట చేతబట్టుకొని పట్టణాలు, నగరాలకు వలస వచ్చిన అల్పజీవులను కరోనా కొట్టిన దెబ్బ కోలుకోలేనిది! ఉన్న ఊరు వదిలి నాడు ఎంతోకొంత ఆశతో పట్టణాలు, నగరాలకొచ్చారు. కానీ, ఇప్పుడు ఏ ఆశా, ఆదెరువూ లేక బిక్కుబిక్కుమంటూ వెనక్కి తర లారు. దేశవ్యాప్తంగా దాదాపు అయిదున్నర నుంచి ఆరుకోట్ల మంది వలస కూలీల దీన స్థితి ఎవరికీ పట్టడం లేదు. లాక్‌డౌన్ ప్రకటిస్తున్నపుడు గానీ, కంటతడితో వలస కూలీ ఇంటిల్లిపాదీ సొంతూరు బాట పట్టినపుడు గానీ ప్రభుత్వాలు వారి గురించి పెద్దగా ఆలోచించ లేదు. చిత్తశుద్ధితో ఆలోచించాల్సిన సమయమొచ్చింది. గ్రామీణ భారతంలో ఉపాధి కరువై సాగిన అపరిమిత వలసలతో పట్టణాలు, నగరాలు పెను సవాల్‌నే ఎదుర్కొంటున్నాయి. వసతులు, వనరులకు మించిన జనాభాతో అవి పెద్ద మురికి కూపాలవుతున్నాయి. 2050 నాటికి ఇదొక జటిల సమస్య అవుతుందని ఐక్యరాజ్య సమితి (యూఎన్)హెచ్చరించింది. గ్రామీణ వలసల్ని నిలువరించాలని, పట్టణ పేదలు గ్రామాలకు వెనుతిరగడాన్ని (రివర్స్ మైగ్రేషన్) ప్రోత్స హించాలనీ సూచించింది. ఎదురు చూసిన తిరుగు వలసలను కరోనా కల్పించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్నొక అవకాశంగా మలచు కొని వారికి సొంతూళ్లలోనే ఉపాధి కల్పించాలి. అవసరమైతే ప్రత్యేక ఆర్థిక ఉద్దీపనల్ని ప్రకటించాలి. వ్యవసాయ, అనుబంధ రంగాలు, వ్యవసాయాధారిత పరిశ్రమల్ని ప్రోత్సహించాలి. ఏ దిక్కూలేక రెండు మార్లు భంగపడ్డ పేదలకు మార్గదర్శకత్వం నెరపాలి. అతిపెద్ద ప్రజా స్వామ్య వ్యవస్థలో తమవి సంక్షేమ రాజ్యాలని చెప్పుకునే ప్రభుత్వాలు ప్రతి విపత్తునుంచీ పాఠాలు నేర్చుకోవాలి. ప్రజలకు దన్నుగా నిలవాలి. సదరు ప్రజలూ ప్రకృతిని గౌరవిస్తూ జీవవైవిధ్యంతో మమేకమై బతికితేనే మనుగడ!

ఈ–మెయిల్ : dileepreddy@sakshi.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### వ్యాప్తి



నిజాముద్దీన్ మర్కజ్ పై ఎక్కువగా స్పందిస్తున్నవారంతా మార్చి నెలలోనే ఆనంద్‌పూర్ సాహిబ్‌లో పెద్ద పండుగ జరిగిందని తెలుసుకోవాలి. దీనికి ఇటలీ నుంచి హాజరైనవారిలో ఆరుగురు తరువాత మృతి చెందారు. వాళ్ల కుటుంబ సభ్యులు ఏడుగురికి పాజిటివ్ వచ్చింది. ఈ పండుగకు దేశంలోని పంజాబ్ సహా వివిధ ప్రాంతాల నుంచి యాభై వేలమంది వరకూ హాజరయ్యారు. మార్చి నెల మధ్య వరకు చాలా మతపరమైన వేడుకలకు అనుమతి ఉంది. వీళ్లందరి పైత్యం వల్ల మనమంతా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– సైరా షా హలీమ్, హక్కుల కార్యకర్త

### శిక్ష



దేశ రాజధాని ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ నుంచి మత ప్రబోధకులను క్వారంటైన్ కేంద్రానికి తరలిస్తుండగా వారిలో ఒకడు డాక్టర్లు, నర్సులపై ఉమ్మాడని తెలిసి షాక్ అయ్యా. అటువంటి వారిని వెంటనే అదుపులోకి తీసుకోవాలి. వైద్యులు, నర్సులపై దాడులకు పాల్పడేవారిపై కఠినమైన సెక్షన్ల కింద నేరాలు మోపాలి.

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

### ఏకాకి



ప్రస్తుత పరిస్థితుల్లో మీ కోసం, మీకు సంబంధం లేనివారి కోసం, కొన్నిసార్లు మీకు తెలియనివారి కోసం అవిశ్రాంతంగా పనిచేస్తున్నవారు తాము ఏకాకులమని అనుకోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. మనలోని ప్రతి ఒక్కరం మనకు చేతనైనది చేద్దాం. భారతదేశం, భారతీయులంతా ఒకే కుటుంబం.

– షారూక్ ఖాన్, హీరో

### అనుభవం



సినిమాలు, టీవీ, న్యూస్ మీడియాలో ఇవాళ్టికి 16 ఏళ్లు పూర్తి చేసుకున్నా. ఆరు చానళ్ల ప్రారంభ బృందాల్లో ఉన్నా. ఏడు చానళ్లలో పనిచేశా. నేను చూసినంత వరకు అంతా తాత్కాలికమే. పొగరుబోతుగా ఉంటే తొందరగా పతనమవుతామని నేర్చుకున్నా. ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండాలని చెబుతా. మనం ఈ ప్రపంచానికి ఏమిస్తామో, అదే మనకీ వస్తుంది. ప్రేమను పంచండి.

– అటిక ఫారూఖీ, జర్నలిస్ట్

### ఓటమి



కేవలం అరవై రోజుల్లో కరోనా కేసులు వెయ్యి దాటకుండా మన దేశం ఆపగలిగింది. ప్రధాని మోదీ నేతృత్వంలో మనమంతా విజయం సాధించాం. నాయకత్వం వహించమంటూ ఇతర దేశాలు ఆయనను ఆహ్వానిస్తున్నాయి. అందుకని, అతని శత్రువులంతా కరోనా వ్యాప్తి చేసి ఆయనకు చెడ్డ పేరు తీసుకురావాలని చూస్తారా? మోదీని ఓడించాలనుకుంటున్న ఆయన శత్రువులు మొత్తం దేశాన్నే ఓడిస్తున్నారు.

– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### నవమి



అప్పుడు నిజాముద్దీన్ మర్కజ్ మాదిరే ఇప్పుడు శ్రీరామ నవమి సందర్భంగా పలువురు ఒక చోట చేరారు. ఓ దేవుడా, దయచేసి వీళ్లందరినీ కాపాడు. మూర్ఖత్వం అనేది ఏదో ఒక మతానికి మాత్రమే సొంతం కాదు.

– నిఖిల్ వాగ్లే, జర్నలిస్ట్

# ‘రూల్ ఆఫ్ లా’ను కాటేస్తున్న కరోనా

విశ్లేషణ


మాడభూషి శ్రీధర్

అసలే మందులేని రోగం. కావలసినన్ని ఐసీయూ గదులు, డాక్టర్ల మాస్కులు కూడా లేవు. లాక్‌డౌన్ తప్ప ఏ ప్రభుత్వమూ ఏమీ చేయలేని దీన దశ. నోరు మూసుకుని ఇంట్లో ఉండటం తప్ప పౌరులు చేయగలిగిన పనేదీ కనిపించడం లేదు. చస్తామేమో అనే భయం వల్లే వారాల తరబడి దిగ్బంధనాలకు అంత అవసరం, ప్రాణాంతక ప్రాధాన్యం వచ్చి పడింది. కర్ఫ్యూలో బయటకు వచ్చిన వాడిని తంతున్నారు. వంగబెట్టి లాఠీలతో ఎడాపెడా కొడుతున్నారు. కానీ పెద్ద మీటింగ్‌లు, సమావేశాలు పెట్టిన వారు, మతబోధలు చేసేవారు, కావాలని తుమ్మిన వారు, ఉమ్మిన వారు, దగ్గి తుంపరలు పంచి రోగాలు పెంచే వారు.. లాఠీ లతో ఎవరు కొడతారు వీళ్లను?

ఏమైనా కానీ ఈసారి అయోధ్యలో శ్రీరామనవమి ఉత్సవాలు జరిపి తీరతానంటాడు ఉత్తర ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్. కరోనా వైరస్ అల్లా పంపిన సైనికుడు అంటాడు ఒక ఇమాం. లాకౌట్‌లో బయటకు వస్తే పిర్రల మీద లాఠీ దెబ్బలు తినాలి. కాని ఉత్సవాలు, ప్రబోధాలు చేసుకుంటే ఫరవాలేదా? ఢిల్లీ నిజాముద్దీన్‌లో తబ్లీఘీ అమిర్ సాద్, దేశ విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతూ, లాక్‌డౌన్ పైన, కరోనా వైరస్ పైన అత్యంత వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఒక జాతీయ టీవీ చానల్ వీడియోలో చూపింది. కరోనా విషానికి మతం, రాజకీయ రంగులు పులమడం, చివరకు జీహాద్ ఆయుధంగా కూడా వాడుకోదలచుకుంటే, ఈ రోగానికి ఎందరు ఆహుతి అవుతారు?

మొదటి కరోనా మరణం మనదేశంలో జనవరి 30న చూసాం. మార్చి 19 దాకా ప్రభువులు రాజకీయాలతో బిజీగా ఉన్నారు. యంత్రాంగాలు నిద్రలో ఉన్నాయి. హఠాత్తుగా జనతా కర్ఫ్యూ ప్రకటించారు. అది ముగిసిందో లేదో లాక్‌డౌన్ మొదలైంది. ఎయిర్ పోర్టులు, రైళ్లు, బస్సులు, మెట్రోలు నిలిచిపోయాయి. అయినా రకరకాల సమావేశాలు జరుగుతూనే ఉన్నాయి. నిజాముద్దీన్ నుంచి మత ప్రచారాలకై మారుమూల గ్రామాలకు వెళ్తూనే ఉన్నారు. ఇండోనేషియా వారు తెలంగాణకువచ్చి కరోనా కరచాలనాలు, వైరస్ మతప్రబోధాలు చేసారు. ఆరుగురు చనిపోయారు. తబ్లీఘీ సమావేశాల్లో హాజరైన వేలాది మంది దేశంలో ఏ మూలకు వెళ్లి ఎందరిని కలిశారో ఆరా తీయడానికి వారిని వెంటాడి వేటాడి పట్టుకుని ఒంటరి చేసి, బస్సుల్లో దవాఖానలకు తీసుకుపోవడానికి ఒక కేంద్ర ప్రభుత్వం, అనేకానేక రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. ఢిల్లీలో వారిని దవాఖానకు తరలిస్తుంటే సిబ్బందిమీద తుమ్ముతూ రోడ్ల మీద ఉమ్ముతున్న ఈ ప్రబోధకులను ఏం చేయాలి?

తెలంగాణలో కరోనాను పారద్రోలుతున్నాం అని భావిస్తున్న దశలో నిజాముద్దీన్ తబ్లీఘీ మతప్రచారకుల ప్రవేశం కథ మళ్లీ మొదటికి తెచ్చింది. అంతగా దెబ్బతినలేదనుకున్న ఏపీలో, తమిళనాడులో వైరస్ బాధితులు పెరిగిపోతూనే ఉన్నారు. విదేశీ టూరిస్టు వీసాల మీద వచ్చి, మత ప్రచారాల్లో పాల్గొంటూ ఉంటే, వీసా గడువు దాటి ఇక్కడే ఉంటే, లాకౌట్ తరువాత కూడా వీరు ఢిల్లీ మధ్యలో నివసిస్తూ ఉంటే, అక్కడనుంచి వేలాది మంది విదేశీయులు, స్వదేశీయులు గ్రామాలకు తరలిపోతూ ఉంటే, తెలియని నిఘా వ్యవస్థ, విదేశీ మంత్రిత్వ శాఖ, ప్రభుత్వాలు ఏం చేస్తున్నట్టు?

తబ్లీఘీ ఏం చేస్తుందో నిఘా వాళ్లకు తెలియదా? కౌలాలంపూర్‌లోని శ్రీ పెటాలింగ్ మసీదులో ఫిబ్రవరి 27 నుంచి మార్చి 1 దాకా జరిపిన తబ్లీఘీ సమావేశాలలో పదహారు వేలమంది పాల్గొనడం, ఆగ్నేయాసియాలో కరోనా వైరస్‌ను భయానకంగా వ్యాప్తి చేసిన మహాసభగా దీనికి అపకీర్తి రావడం నిఘావారికి తెలియదా? వారి కదలికల మీద కన్నేసి ఉంచాల్సిన బాధ్యత లేదా? 500 మందికి వీరు వైరస్ అంటించారని వార్తలు వచ్చాయి. ఇండోనేసియా వణికిపోయింది. ‘ఈ ప్రపంచంలో జీవనసౌఖ్యం కొంతే, మరణించిన తరువాత ఆనందంతో పోలికే లేదు’ అని మలేసియాలో తబ్లీఘీ ప్రచార నినాదం. పాక్‌లో కూడా వీరు లాక్‌డౌన్‌లను, కర్ఫ్యూలను ధిక్కరించి మసీదుల్లో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఒకరికి అంటిస్తే నేరం. కాని వందలాది మందికి కరోనా కావాలని తగిలిస్తే జనహనన ఘోరం కాదా? ఈ కరోనా వైరస్ మన రూల్ ఆఫ్ లాను కబళిస్తే ప్రజాస్వామ్యాన్ని ఐసీయూలో పెట్టి డాక్టర్లు బతికిస్తారా బ్రదర్?

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# లాక్‌డౌన్ జిందాబాద్! కరోనా ముర్దాబాద్

సందర్భం


డా॥ చెరుకు సుధాకర్

ఎప్పుడో మార్క్స్ ‘దాస్ క్యాపిటల్’ రాసినప్పుడు ప్రపంచాన్ని కమ్యూనిజం అనే భూతం కమ్మేసిందని పెట్టుబడుల స్వర్గధామాలు బెంబేలు పడ్డాయని చదివాం. అది 150 ఏండ్ల కింది ముచ్చట. ఇప్పుడు పెట్టుబడులు ‘గ్లోబల్ మార్కెట్’గా వేళ్ళూనికొని సామ్రాజ్యాలు నిర్మిస్తున్న కాలంలో జీవమో కాదో, తెలియని వైరస్ రాణి మృత్యు కిరీటం (కరోనా) తొడుక్కొని విధ్వంస ‘కోవిడ్’ రాలై పెట్టుబడిని, మానవ నిర్మిత మహా కట్టుబడిని, కట్టుబాట్లను అన్నింటినీ కుప్పకూలుస్తున్న భీతావహ కాలంలో మనమున్నాం. మన శరీరమే ‘వైరి’పక్షమైనాక కుచ్ న కరోనా ప్లీజ్ కరోనా అంటున్నాం. నిన్నటి జన చైనా లాంగ్‌మార్చ్ నెత్తుటి చిత్తడి వూహాన్ ఊహకందని ప్రపంచ మహా పారిశ్రామిక నగరమై, ఎదిగి, ఏ కారణం చేతనో ప్రపంచాన్ని కమ్మేసిన వైరస్ దాడికి జన్మస్థలమయ్యింది. మనుషుల ఆహారపు అలవాట్ల మీద చర్చకు ఒకనాటి విప్లవ విముక్తి ప్రాంతం, బుద్ధుని శాంతి ప్రదేశం వూహాన్ కేంద్రమవడం విషాదమే. పాపమంతా చైనాదే అని ట్రంప్ దుమ్మెత్తి పోయడం, యూరప్ దేశాలు భజన చేయడం తప్పితే ఈ ఆధునిక, నాగరిక దేశాలు తమ ప్రజల్ని తాము రక్షించుకోలేని ఆత్మరక్షణలో ప్రాణాల కోసం పరుగెత్తడం ఇంకా విషాదం.

మార్చి, 22న జనతా కర్ఫ్యూ, ఆ తెల్లారి నుండి ఏప్రిల్ 14 వరకు లాక్‌డౌన్ ప్రకటించారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జనాభా గల దేశం ఇంటికి పరిమితమయ్యే ఆచరణను అలవాటు చేసుకునే పనిలో ఉంది. దేశంలోని కోట్లాది మంది నిరుపేదలకు కరోనా గండం. పూట గడవని ఆకలి గండం.. నిత్యం నిద్రలేని రాత్రుల్ని పోలీసుల లాఠీ చప్పుళ్ల మధ్య వినిపిస్తూనే ఉన్నది. ఢిల్లీ, ముంబైలో వందల కిలోమీటర్లు ప్రభుత్వాలు ఏ రవాణా ఏర్పాట్లు చేయకపోవడంతో ‘కరోనా కత్తుల వంతెన’పై మహానగరాలు దాటుతూ పల్లెకు ప్రయాణం... దేశం ఎటుమూల చూసినా ఈ పరిస్థితి దీనంగా వుంది కాబట్టే ప్రధానమంత్రి మన్ కీ బాత్‌లో ఈ అకాల కష్టానికి మన్నించమని వేడుకున్నారు.

ఎప్పుడో చైనా యుద్ధ క్షేత్రాల్లో నార్మన్‌బెతూన్ ‘డాక్టర్లారా! గాయపడిన వాళ్ళు మన దగ్గరకు రాలేరు... మనమే టీమ్‌లుగా వెళ్ళాలని అన్నమాట ఇప్పుడు ఆచరిద్దాం. ఇప్పుడు ట్రంప్‌కు ఇష్టమైన పదం ‘చైనా వైరస్’కు కూడా అదే పద్ధతి. దక్షిణ కొరియా చేసింది అదే. ఆ పని చేయని, అవకాశం రాని ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్, ఇరాన్ ఎంత నష్టపోయినవో ఎంత రక్తమోడ్చుతున్నాయో మనకు తెలుసు. మన దేశపు దేశవాళీ అంతర్గత (హెర్డ్) ఇమ్యూనిటీ పుణ్యమో, అధిక ఉష్ణోగ్రతో, మ్యుటేషన్స్ మహత్యమో ఏదైనా కానీ మనం రెండో దశను దాటి ప్రమాదకర మూడో దశలోకి నెమ్మదిగా ప్రవేశిస్తున్నాము. దేశంలో 11 లక్షల మంది డాక్టర్లు, ఇతర వైద్య విధానాలు, మహాసైన్యం వలె ఉన్న భారత ‘నైటింగేల్స్’ అయిన మన నర్సులు ఎందరో ఉండగా విజ్ఞత కలిగిన పాలకులుంటే అద్భుతాలు సాధించవచ్చు.

ఒక నగరాన్ని మాత్రమే లాక్‌డౌన్ చేసిన వూహాన్ నమూనా మన దేశానికి పనికి రాదు. కరోనా కత్తిని తునాతునకలు చేసే సన్నద్ధత, విజయం అధిక నిధుల కేటాయింపు, దీర్ఘకాలికంగా కొనసాగే ఆరోగ్య ప్రణాళికతోనే సాధ్యం. చేష్టలుడిగి ఇంట్లో ఏదో వ్యాపకంతో మన మధ్యతరగతి కొన్నిపదుల రోజులు ఈడ్చుకురాగలుగుతుందేమో కానీ రెక్కాడితే డొక్కాడని పేదలకు సాధ్యంకాదు. ఏ ఉద్దీపనలైనా యుద్ధప్రాతిపదికనే జరగాలి. జనతా కర్ఫ్యూ మొదలు ఇప్పటిదాక నిలబెట్టుకున్న ఇమేజ్‌కు తగ్గ కార్యాచరణ ఉండాలని మన దేశం ఆశిస్తున్నది. కరోనాకు కట్టడి ఏదంటే గడప దాటి మృత్యు కిరీటాన్ని మనం ముద్దాడకపోవడమే. మశూచి, పోలియో, సార్స్‌లపై జీవన పతాక ఎగిరేసిన భారత్ వ్యూహాత్మక, ఆచరణాత్మక ముందడుగు కోసం ప్రపంచం ఎదురు చూస్తుంది. కరోనా భయంకరమైన అంటువ్యాధి అనేది నిజమే కాని, ఇంతకంటే మృత్యుశీతలమైన అనేక వ్యాధులను ప్రపంచం, దేశం, మానవాళి ఓడించి నిలబడిందన్న సందేశం, సంకేతం కశ్మీర్ నుండి కన్యాకుమారి దాకా అవసరం. కరోనాకు ఏ మందు లేదు.. చావే దాని మరో పేరు, ఇప్పట్లో వ్యాక్సిన్ రాదు అంటూ కరోనా చావులను డిజిటల్ సౌండ్‌లో వినిపించడంలో మైండ్‌గేమ్ కంటే ప్రమాదముంది. ధైర్యంతో, హేతుబద్ధతతో కూడిన..

లాక్‌డౌన్ జిందాబాద్ కరోనా ముర్దాబాద్.

వ్యాసకర్త తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షులు
మొబైల్ : 98484 72329

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

**లాక్‌డౌన్‌లో కాలూచెయ్యీ ఆడదు. ఆటిజం పిల్లలున్న తల్లిదండ్రులకు మాత్రం ఆ తేడా తెలియదు! ఆ చిన్నారుల శిక్షణ, సంరక్షణల కోసం వాళ్లెప్పుడూ.. లాక్‌డౌన్‌లో ఉన్నట్లే ఉంటారు. శిక్షణ కొనసాగింపు మాత్రమే ఇప్పుడు వారి సమస్య. ఆ సమస్యకు హారిక మంచి పరిష్కారం కనిపెట్టారు.**


ప్రతీకాత్మక చిత్రం

# హాయ్.. చిన్నారీ





**ఆ**టిజం ఉన్న పిల్లలను ప్రత్యేక పాఠశాలలకు పంపుతూ వస్తున్న తల్లిదండ్రులకు ఈ 'లాక్‌డౌన్' సమయంలో ఆ పిల్లల్ని చూసుకోవడం పెద్ద సవాల్ అవుతోంది. అలాంటి తల్లిదండ్రులకు, వారి పిల్లలకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు ఆటిజం చికిత్సా నిపుణురాలు పట్లోళ్ల హారికారెడ్డి. 'స్పెషల్లీ ఏబుల్డ్ చిల్డ్రన్' కోసం హైదరాబాద్ అత్తాపూర్‌లో ఉన్న యాదా ఎబిఎ సెంటర్‌లో నిపుణురాలిగా ఉన్న హారిక సైకాలజీలో ఎమ్మెస్సీ చేశారు. అమెరికాలోని ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని సైకాలజీ విభాగంలో ఆటిజం ముఖ్యాంశంగా రెండేళ్ల కోర్సు చేసి వచ్చాక గత ఐదేళ్లుగా ఆటిజం ఉన్న చిన్నారులను సాధారణ స్థితికి తెచ్చేందుకు వారికి, వారి తల్లిదండ్రులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే.. ప్రస్తుతం లాక్‌డౌన్ కారణంగా పాఠశాలలు మూతపడినా ఆటిజం పిల్లల మానసిక స్థితిని మెరుగు పరిచేందుకు, అదే సమయంలో తల్లిదండ్రులకు ఆలంబనగా నిలిచేందుకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన సాక్షితో ముచ్చటించారు.

**పిల్లలకు.. పెద్దలకూ**

''ఆటిజం ఉన్న పిల్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండవు. వాళ్లంతట వాళ్లు ఆడుకోలేరు. తినలేరు. పిలిస్తే పలకరు. ఇలాంటి పిల్లలకు వారానికి నలభై గంటల చొప్పున రెండు సంవత్సరాలు అంతరాయం లేకుండా శిక్షణ ఇస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఓ వైపు ఇలా పిల్లలకు శిక్షణ ఇస్తూనే మరోవైపు ఆ పిల్లలతో ఎలా మెలగాలో పెద్దలకీ శిక్షణ ఇస్తుంటాం. అయితే ఆ శిక్షణ.. పూర్తయ్యేవరకు క్రమం తప్పకూడదు. అందుకే ఈ లాక్‌డౌన్‌లోనూ వారందరికీ ఆన్‌లైన్‌లో ప్రతిరోజూ కౌన్సెలింగ్ ఇస్తున్నాను. ఈ ఖాళీ టైమ్‌లో పిల్లలను ఎలా ఎంగేజ్ చేయాలి, వారిచేత ఏమేం యాక్టివిటీస్ చేయించాలి, వాళ్ల ప్రవర్తనలో మార్పులు వస్తే ఎలా హ్యాండిల్ చేయాలి.. ఇలాంటివన్నీ ఆన్‌లైన్‌లోనే సూచిస్తున్నాను.

**'వెళ్లి కూర్చో' అనకూడదు**

ఇంట్లో అయితే రోజులో ఇన్ని గంటలు చెప్పాలి అని ప్రత్యేకంగా ఏమీ ఉండదు. ఉదాహరణకు.. తల్లి కిచెన్‌లో పనిచేస్తూ ఉన్నప్పుడు ఆ టైమ్‌లో అమ్మాయి / అబ్బాయి వస్తే ఓ దగ్గర కూర్చో అని చెప్పకూడదు. కూరగాయలన్నీ కలిపి వాటిని వేటికవి విడి విడిగా చేయమనాలి. కూర్చోబెట్టి కొద్దిసేపు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ నేర్పించవచ్చు. ఏ పనులు వీలైతే అందులో నిమగ్నం అయ్యేలా చెయ్యాలి. తీరిక సమయాలలో మన చిన్నప్పుడు ఆడిన అష్టాచెమ్మా, మ్యూజికల్ చెయిర్స్, డ్యాన్స్.. ఇలా ఫన్‌గా ఉన్నవన్నీ చేయిస్తుంటే పిల్లలకు ఉత్సాహం కలుగుతుంది. ఇలాంటి టైమ్‌లో ప్రత్యక్ష శిక్షణలో ఉన్నంతగా చేయలేరు. కానీ, కొంత రిజల్ట్ అయితే తప్పకుండా ఉంటుంది.

**తండ్రికి కనెక్ట్ అవుతారు**

మగపిల్లలు తండ్రి చెబితే త్వరగా కనెక్ట్ అవుతారు. తండ్రి నేర్పిస్తే త్వరగా నేర్చుకుంటారు. స్నానం చేయడం ఎలాగో చెప్పడం, బట్టలు వేసుకోవడం, పెన్ను పట్టుకోవడం.. రాయడం.. ఇలా ఏవైనా తండ్రి చెప్పవచ్చు. కాసేపు పిల్లలతో ఆడుకున్నా వాళ్లు బాగా రిలీఫ్ అవుతారు. తోబుట్టువులు ఇంట్లో ఉంటే వాళ్లతో కలిసి ఆడుకోవడం, కలిసి చేసే పనుల వల్ల నలుగురితో మసలే నైపుణ్యాలు కూడా పెరుగుతాయి'' అని తెలిపారు హారిక.

– నిర్మలారెడ్డి

## 'దిద్దీ' పంపుతున్నా

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ తీసుకుంటున్న తల్లిదండ్రులలో కొందరు.. చెప్పినవి పాటిస్తూ తమ పిల్లలు నేర్చుకున్న విషయాలను వీడియోలు చేసి పంపిస్తున్నారు. ఆ వీడియోలు చూసి పిల్లల ప్రవర్తనలో లేదా పాటించే పద్ధతుల్లో ఎక్కడైనా లోపం ఉంటే వాటిని కరెక్ట్ చేస్తూ ఉంటాను. కొన్ని మెళుకువల్ని ఎలా పాటించాలో చాలా మంది తల్లిదండ్రులకు తెలియదు. వారి పిల్లలందరి గురించి నాకు ముందే కొంత తెలుసు కాబట్టి వారికి సంబంధించిన విషయాలను మరింత వివరంగా చెప్పగలుగుతాను. ఇప్పుడు అదే చేస్తున్నాను.

– హారికారెడ్డి, ఆటిజం చికిత్సా నిపుణురాలు


హారికారెడ్డి

మానవ నాగరికతలో బండి చక్రం కనుగొనడం గొప్ప ఆవిష్కరణ అంటారు. చక్రం మనిషిలో కదలిక తెచ్చింది. వలస వేగవంతం చేసింది. ఉన్న చోటనే ఉండటం మనిషి చరిత్రలో లేదు. అందుకే ప్రపంచంలోని ప్రతి దేశం మనిషికి ఆవాసం అయ్యింది. తెలుగువారు ప్రతి దేశంలో ఉన్నారు. మూలాలు ఉన్న రెండు రాష్ట్రాల్లో పెద్దలను వదిలిపెట్టి వెళ్లారు. తల్లిదండ్రులు ఇక్కడ... పిల్లలు ఎక్కడో. అంతా బాగుండే వాతావరణం కరోనాతో అతలాకుతలమైంది. ఒకరి మేలు ఒకరు కోరుకోవడమే ఇప్పుడు మిగిలింది. ఎప్పుడు కలుస్తామో... ఎన్నాళ్లకు కలుస్తామో.



# దేశం ఏదైనా వేదన ఒక్కటే

**గ**తంలో అంతా హుషారుగా ఉండేది. ఉత్సాహంతో ఫోన్లు మోగేవి. 'ఈ వీకెండ్‌కి ఏంటి ప్లాన్?', 'నాన్నా.. నా ఫ్రెండ్ ఇండియా వస్తున్నాడు.. మోకాళ్ల నొప్పుల టాబ్లెట్స్ పంపిస్తున్నాను.. ఇంకేమైనా కావాలా?', 'ఒరేయ్.. భాస్కర్ అంకుల్ వాళ్లు వస్తున్నారు.. వాళ్లతో పచ్చళ్లు, చింతపండు, కారం పంపించనా?',

'షఫీల్డ్ నుంచి లండన్ షిఫ్ట్ అవుతున్నారట.. న్యూ ఆపర్చునిటీ ఏదైనా వచ్చిందా?',

'ఆన్‌సైట్ మీద స్విట్జర్లాండ్ వెళ్తున్నానే.. అట్లాంటాలో ఇల్లు లీజ్‌కు ఇద్దామనుకుంటున్నా.. ఇండియన్స్ ఎవరన్నా ఉంటే చూస్తావా?' ఇలాంటి సంభాషణలు ఇప్పుడు లేవు. ఇండియా నుంచి ప్రపంచంలోని ఏ దేశానికి ఫోన్ చేసినా ప్రపంచంలోని ఇంకే దేశం నుంచి ఇండియాకు ఫోన్‌కాల్ వచ్చినా ఒకటే మాట.. పదే పదే.. 'జాగ్రత్త.. బయటకు వెళ్లకండి' అనే. కరోనా వైరస్ మూలంగా ప్రపంచమంతా దాదాపుగా షట్‌డౌన్ అయింది. ఉన్న చోటు నుంచే ఎక్కడో ఉన్న తమ వారి క్షేమ సమాచారాన్ని వింటూ.. కోరుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇదిగో.. గల్ఫ్ మీదుగా యూరప్‌ను పలకరిస్తూ అమెరికాలోనూ ఆరా తీసి కెనడాను కుశల ప్రశ్నలు అడిగి.. ఆ అభిప్రాయాలను ఇలా షేర్ చేస్తున్నాం ఇక్కడ.

### చైనీస్ స్ట్రీట్ వైపు వెళ్లట్లేదు



**నే**ను కెనడాలో ఉంటాను. టొరొంటోలో. మా అక్కయ్య అమెరికాలో స్థిరపడింది. అమ్మా నాన్న హైదరాబాద్‌లో ఉంటారు. మా అక్కయ్య ఇండియా వచ్చిన కొన్ని రోజులకే ఈ కరోనా గొడవ మొదలయ్యేసరికి మొన్న ఫిబ్రవరి సెవెన్త్‌కే అమెరికా బయలుదేరిపోయింది. ఈ విషయం తెలిసిన హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లు హైదరాబాద్‌లో మా ఇంటికి 'దిస్ హోమ్ ఈజ్ అండర్ క్వారంటైన్' అని స్లిప్ అతికించారట. ఫిఫ్టీన్ డేస్‌లో నాలుగుసార్లు హోమ్ విజిట్ కూడా చేశారని మా పేరెంట్స్ చెప్పారు ఫోన్‌లో. సేఫ్టీమెజర్స్ బాగానే తీసుకుంటున్నారని హ్యాపీగా అనిపించింది అది విన్నాక . ఇక్కడ ఇండియన్స్‌మి జాగ్రత్తగానే ఉంటున్నాం. మా పక్కనే చైనీస్, కొరియన్స్ ఉండే స్ట్రీట్ ఉంటుంది 'యంగ్‌స్ట్రీట్' అని. దాని వైపే వెళ్లట్లేదెవ్వరం.

– ఎద్ల పవన్ రెడ్డి, ఐటీ ఉద్యోగి, కెనడా

### జాలిగా చూస్తున్నారట



**మా** సొంతూరు విజయవాడ. మా అమ్మానాన్నకు ఒక్కదాన్నే కూతుర్ని. పెళ్లయ్యాక, భర్తతో అమెరికా వచ్చేశాను. మాకు ముగ్గురు పిల్లలు. మొన్నటి దాకా అంతా బాగానే ఉంది. అంతకుముందు 'మీ అమ్మాయి అమెరికాలో ఉంటోందా?' అంటూ మా పేరెంట్స్‌ని అబ్బురంగా చూసినవాళ్లే 'పాపం వీళ్ల అమ్మాయి అమెరికాలో ఉంటోంది' అని జాలిగా అంటున్నారట. మా పేరెంట్స్ ఇద్దరూ 60 ఏళ్లు దాటినవాళ్లే. నిజానికి ఈ ఏప్రిల్లో వాళ్లు అమెరికా రావడానికి టికెట్ కూడా కన్‌ఫర్మ్ అయింది. ఇదిగో కరోనా వల్ల అది క్యాన్సిల్ అయిపోయింది. వాళ్లూ నా దగ్గరే ఉంటే అందరం ఒక్కచోటే ఉన్నామన్న నిశ్చింత ఉండేది.

– కేజియా ముప్పిడి, కాంట్రాక్ట్ ఎంప్లాయి, వాషింగ్‌టన్ డీసీ

### ఫ్యామిలీ అక్కడ.. నేనిక్కడ

**ఆ**న్‌సైట్ మీద ఆస్ట్రేలియా వచ్చాను. సిక్స్ మంత్స్ అవుతోంది. నా వైఫ్ ప్రెగ్నెంట్. వచ్చే నెల తనకు డ్యూ డేట్. నేను హైదరాబాద్ వెళ్లాల్సింది. కరోనా వల్ల నో చాన్స్. ఆమె ఇప్పుడు వాళ్ల అమ్మవాళ్ల ఊరు పులివెందులలో ఉంది. మా పేరెంట్సేమో హైదరాబాద్‌లో. నేనిక్కడ. ఎంత టెన్షన్‌గా ఉందో. ఒక్క ఊరట ఏంటంటే.. ఇండియాలో లాక్‌డౌన్ చాలా స్ట్రిక్ట్‌గా జరుగుతోందని. ఇక్కడ లాక్‌డౌన్ అంత పర్‌ఫెక్ట్‌గా లేదు. గ్రాసరీస్, రెస్టారెంట్స్ అన్నీ తెరిచే ఉన్నాయి. సోషల్ డిస్టెన్సింగ్ మెయిన్‌టైన్ చేస్తున్నారంతే.



– రవి కిషన్, ఐటీ ఎంప్లాయి, సిడ్నీ

### నిజమెంతో తెలియదు



**మి**గతా దేశాలు ఈ ఔట్‌బ్రేక్స్‌ని తట్టుకోవడానికి హాస్పిటల్స్ కడ్తుంటే బ్రిటన్‌లో మాత్రం శ్మశానాలు ఏర్పాటు చేస్తున్నారన్న విషయం మమ్మల్ని చాలా భయపెడ్తోంది. వైరస్ ఎఫెక్ట్ మైల్డ్‌గా ఉన్నవాళ్లు హాస్పిటల్స్‌కు రాకూడదు ఇంట్లోనే ఉండాలి అని ఒక ప్రచారం వైరల్ అవుతోందిక్కడ. ఈ క్రైసిస్‌లో ఇండియన్స్ అంతా కలిసిమెలిసి ఉంటున్నాం. రెంట్ కట్టుకోలేని స్టూడెంట్స్‌కి ఇంటిని షేర్ చేస్తున్న తెలుగు కుటుంబాలూ ఉన్నాయి. ఇలాంటివి తెలిసినప్పుడు భరోసాగా అనిపిస్తోంది. ఇండియాలో ఉన్న పేరెంట్స్ గుర్తొచ్చినప్పుడు మాత్రం దిగులుగా అనిపిస్తోంది.

– సి.రమోల, సాఫ్ట్‌వేర్, లండన్

### ధైర్యం చెప్పుకుంటున్నాం



మా అమ్మాయి కాలిఫోర్నియాలో ఉంటుంది. ఆమె దగ్గరకి వచ్చి ఇక్కడే చిక్కుకున్నాను కరోనా వల్ల. మా ఆయనేమో మా సొంతూరు నిజామాబాద్‌లో ఉన్నారు. మొన్న 23వ తేదీ మా 50వ పెళ్లిరోజు. అప్పటికల్లా ఇండియా వెళ్లిపోవాలని టికెట్ బుక్ చేసుకున్నాను. ఫ్లయిట్స్ అన్నీ క్యాన్సల్ అయి.. నేనిక్కడ.. కేక్ కట్ చేస్తూ వీడియో కాల్‌లో విషెస్ చెప్పుకున్నాం. ఇప్పుడు ఒకరికొకరం ధైర్యం చెప్పుకుంటున్నాం.

– పొట్లూరి ఛాయాదేవి, రిటైర్డ్ టీచర్, కాలిఫోర్నియా

వీళ్లే కాదు.. దుబాయ్, మస్కట్ లేబర్ క్యాంపుల్లో ఉన్నవాళ్లూ ఇలాంటి భయం, భరోసాతోనే ఇంటికి ఫోన్లు చేస్తున్నారు. ఒకరి సంక్షేమం మరొకరు కాంక్షిస్తున్నారు. ఎవరిని కదిలించినా.. పదిలం అనే మాటే పలకరింపు.. వీడ్కోలుగా వినపడుతోంది.

– సరస్వతి రమ

కరోనా కథ

## ఎట్లున్నవ్?

**శాం**త మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రిలో నర్సు. భర్త, రెండేళ్ల బాబు, అత్తమామలు గద్వాలలో ఉంటారు. గంట ప్రయాణమే కాబట్టి రెండు రోజులకోసారి ఇంటికి వెళ్లి వస్తూ ఉండేది శాంత. ఉన్నట్టుండి ఇదిగో, ఈ 'కరోనా భూతం' విరుచుకు పడటంతో లాక్‌డౌన్ ప్రకటించారు. మరిక టౌన్నుంచి కదలటానికి వీల్లేకపోయింది శాంతకు. మరోవైపు హాస్పిటల్లో పురిటి కేసులు ఎక్కువగా ఉంటున్నాయి. తన డ్యూటీ పురుళ్ల వార్డులో కాబట్టి మరింత జాగ్రత్తగా ఉండాలి. ముఖానికి మాస్కు, చేతులకు గ్లవ్స్‌తోపాటుగా ఆసుపత్రిలోకి అడుగు పెట్టిన వెంటనే, ఆ తర్వాత ప్రతీ అరగంటకోసారి చేతులు కడుక్కోవటం, శానిటైజర్ ఉపయోగించటం తప్పనిసరి. పేషెంట్సుకి సంబంధించినవారిని రావద్దనీ, చూలింతల, బాలింతల ఆహార, ఆరోగ్య విషయాలు తామే చూసుకుంటామనీ, లాక్ డౌన్ అయ్యేవరకూ డిశ్చార్జ్ చేయము అనీ గట్టిగా చెప్పేశారు హాస్పిటల్ వారు. దానితో శాంతలాంటి నర్సులకు డ్యూటీ గంటలు ఎక్కువ అయ్యాయి. తనకు పనంటే భయం లేదు. పైగా ఎంతో ఇష్టంగా చేస్తుంది. కానీ పిల్లవాడిపైనే బెంగగా ఉంటోంది. తల్లి మనసు కదా.



ఆ రాత్రి శాంత మొబైల్ ఫోన్ మోగింది. అటునుంచి భర్త నరేందర్. ''శాంతా, ఎట్లున్నవ్? తింటున్నవా? మేమంతా మంచిగున్నం. పోరడి గురించి బెంగవద్దు. అమ్మ మంచిగా చూసుకుంటుంది. నువ్వు జెప్పినవుగా మేము ఇంట్లనే ఉన్నం. లాక్ డౌన్ పూర్తయ్యే వరకు నువ్వు జెప్పిన జాగర్తలు పాటిస్తం... ఫికర్ చేయకు...'' అని చెప్పాడు. ''అట్లనే... నేను మంచిగున్న..'' అని ఉబుకుతున్న కన్నీటిని ఆపుకుని చెప్పింది శాంత. తడిసిన కనుకొలకులను కొనగోట తుడుచుకుని ఫోన్ కాల్ కట్ చేసాడు నరేందర్.

– నండూరి సుందరీ నాగమణి

గీతారాంజీ

## వైరసాసురమర్దిని

లండన్ నుంచి వారం క్రితమే తను నివాసం ఉంటున్న దక్షిణాఫ్రికా తీరప్రాంతం డర్బన్ చేరుకున్న గీతా రాంజీ.. కరోనా లక్షణాలేమీ లేకుండానే కరోనాతో మంగళవారం కన్నుమూశారు! ఆమె మరణంతో ప్రపంచ క్రిమిశాస్త్ర పరిశోధనారంగం దాదాపుగా ఒక విధమైన కుంగుబాటు స్థితిలోకి వెళ్లిపోయింది. "ప్రపంచానికి ఇప్పుడు ఆమె అవసరం ఉంది. ఈ సమయంలోనే ఆమె మనకు దూరం అయ్యారు" అని యు.ఎన్.ఎయిడ్ అధినేత్రి విన్నీ బియాన్యిమా అన్నారు.

**అం**టువ్యాధి మీద ఎప్పుడూ ఇద్దరు పోరాడుతుంటారు. ఒకరు వ్యాధిగ్రస్థులు. ఇంకొకరు వ్యాధిని ఈ భూమండలం నుంచే సమూలంగా నిర్మూలించేందుకు పరిశోధనలు చేస్తున్నవారు. ప్రొఫెసర్ గీతా రాంజీ గత ముప్పై ఏళ్లుగా హెచ్.ఐ.వి., టీబీ క్రిముల కీలెరిగి వాత పెడుతూ ఒక్కో విజయం సాధిస్తూ వస్తున్నారు. ఇక తనకూ ఆమె చేతిలో చావు తప్పదని అనుకుందో ఏమో కరోనా మహమ్మారి మాయోపాయం పన్ని ఆమెను తీసుకెళ్లిపోయింది.

కరోనాతో మరణించిన తొలి భారత సంతతి దక్షిణాఫ్రికా మహిళ గీతా రాంజీ. గురువారం నాటికి ఆ దేశంలో దగ్గర దగ్గర 200 వరకు కరోనా మరణాలు నమోదయ్యాయి. గీతారాంజీ అంత్యక్రియల విషయమై గురువారం మధ్యాహ్నం వరకు కూడా ఆ దేశ ప్రభుత్వం నుంచి ఒక స్పష్టమైన ప్రకటనేమీ వెలువడలేదు. చనిపోయింది సాధారణ వ్యక్తి కారు. సహజమైన మరణమూ కాదు. సాధారణ పరిస్థితులూ లేవు. మనకు ఉన్నట్లే అక్కడా 21 రోజుల లాక్‌డౌన్ ఉంది. మార్చి 27 నుంచి అమలు అవుతోంది. ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి లేనిదే గౌరవ వందనంతో కూడిన ఒక ప్రత్యేక కార్యక్రమంగా గీతారాంజీ అంతిమ సంస్కారాలను నిర్వహించేందుకు లేదు.

గీతారాంజీ ప్రపంచ ప్రఖ్యాత వైరాలజిస్టు. ప్రాణాంతక క్రిముల స్వభావాల మీద, అవి సంక్రమించ జేసే వ్యాధుల మీద అధ్యయనం చేస్తుంటారు. ఆ వ్యాధులకు టీకాలు కనిపెడుతుంటారు. దర్బన్‌లోని 'సౌతాఫ్రికన్ మెడికల్ రిసెర్చ్ కౌన్సిల్'లో హెచ్.ఐ.వి. నివారణ విభాగం డైరెక్టర్‌గా, ప్రయోగాల ప్రధాన పరిశోధకురాలిగా పని చేస్తున్నారు. ఆ పని మీదే ఇటీవల లండన్ వెళ్లి తిరిగి డర్బన్ వస్తున్నప్పుడు ఆమెకు తెలియకుండానే ఆమెలోకి కరోనా ప్రవేశించింది! పైకి లక్షణాలేమీ చూపించకుండా దొంగదెబ్బ తీసింది.

గీతారాంజీ భర్త ప్రవీణ్ రాంజీ. దర్బన్‌లోనే పేరున్న ఫార్మసిస్టు. ఇద్దరు మగ పిల్లలు. లండన్‌లో మంచి ఉద్యోగాలలో ఉన్నారు. ఆమె వాళ్లకు ఎప్పుడూ చెబుతుండే మాట ఒక్కటే.. 'సమాజాన్ని చూడండి. సమాజానికి ఏమైనా చేయండి. మనకు కావలసినవన్నీ దేవుడు అమర్చిపెట్టాడు. సమాజానికి అవసరమైన వాటిని మనం చేర్చిపెట్టాలి' అని.

హెచ్‌ఐవీ బారిన పడుతున్న అమాయక, నిరుపేద దక్షిణాఫ్రికా మహిళల కోసం గీతా రాంజీ మంచి ఫలితాన్నిచ్చే నివారణోపాయాలను, పెద్దగా ఖర్చుతో కూడుకోని వైద్య విధానాలను కనిపెట్టారు. అందుకు గుర్తింపుగా రెండేళ్ల క్రితం ఆమె 'విశిష్ట మహిళా శాస్త్రవేత్త' అవార్డును అందుకున్నారు. లిస్బన్ (పోర్చుగల్)లోని ప్రతిష్ఠాత్మకమైన 'యూరోపియన్ డెవలప్‌మెంట్ క్లినికల్ ట్రయల్స్ పార్ట్‌నర్‌షిప్' సంస్థ ఆ అవార్డును ఇచ్చింది. విజ్ఞానశాస్త్ర అధ్యయన, పరిశోధనా రంగాలలోకి ఎంత ఎక్కువగా ఆడపిల్లలు వస్తే అంత ఎక్కువగా అంతుచిక్కని ఆరోగ్య విపత్తులకు అద్భుతమైన పరిష్కారాలు లభిస్తాయని అంటుండేవారు గీతారాంజీ.


కరోనాతో కన్నుమూత : గీతా రాంజీ, వైరాలజిస్ట్

### పిల్లలు పుట్టాకే మాస్టర్స్ డిగ్రీ

**తూ**ర్పు ఆఫ్రికాలోని ఉగాండాలో జన్మించారు గీతారాంజీ. 1970లలో నాటి ఉగాండా క్రూర పాలకుడు ఇడీ అమీన్ బారి నుంచి తప్పించుకుని ఇండియా వచ్చేసింది గీత కుటుంబం. హైస్కూల్ వరకు ఇండియాలోనే చదివి, పై చదువులకు ఇంగ్లండ్ వెళ్లారు గీత. అక్కడే కెమిస్ట్రీ, ఫిజియాలజీలో బియస్సీ (ఆనర్స్) చేశారు. క్లాస్‌మేట్ ప్రవీణ్ రాంజీని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అతడు కూడా భారతీయ సంతతి ఆఫ్రికనే. తర్వాత ఇంగ్లండ్ నుంచి డర్బన్ వచ్చారు. అక్కడ పేరున్న ఒక మెడికల్ స్కూల్‌లోని పిల్లల వైద్య, చికిత్సల విభాగంలో గీత పని చేశారు. పిల్లలు పుట్టాక కొద్దిపాటి విరామం అనంతరం మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ చేశారు.

కరోనా సాంగ్

## చేతులెత్తి మొక్కుతా..!

**హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉంటారు రామ్. లాక్‌డౌన్‌కి జనం స్పందించకపోవడంపై బాగా కలత చెందారు. కలం కదిపారు. 'చేతులెత్తి మొక్కుతా.. చేయి చేయి కలపకురా..' అంటూ మేల్కొలుపు పాట పాడారు. ఇప్పుడా పాట యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ఈ సందర్భంగా రామ్‌ని 'సాక్షి' పలకరించింది.**

''మాది కాకినాడ దగ్గర పిఠాపురం పక్కన కోలంక గ్రామం. ఎంబిఎ కోసం 2006 లో హైదరాబాద్ వచ్చాను. చదువు పూర్తయ్యాక టాక్స్ కన్సల్టెంట్‌గా పనిచేశా. చిన్నప్పుడు రెండేళ్ల పాటు క్లాసికల్ మ్యూజిక్ నేర్చుకున్నా. ఆ అనుభవంతో టాక్స్ కన్సల్టెంట్‌గా ఉన్నప్పుడే యాడ్స్ కమర్షియల్స్‌కి బ్యాక్ గ్రౌండ్ వర్క్‌చేశా. అది రేడియో మిర్చి లో మ్యూజిక్ కంపోజర్‌గా అవకాశం అందించింది. అక్కడి నుంచి మ్యూజిక్ నా ప్రపంచం అయిపోయింది. రెండేళ్ల క్రితం స్నేహితులతో కలిసి 'చౌరస్తా' బ్యాండ్ స్టార్ట్ చేశా. గాయకుడిగా, రచయితగా మారా. 'లాయలో లల్లాయలో..' అనేది నేను రాసిన తొలి పాట. అది క్రిటిక్స్ ప్రశంసలకు నోచుకుంది. ఆ తర్వాత రైతుల సమస్యల మీద రాసిన పాటలతో 'సాగు బరువాయెనా..' అనే ఆల్బమ్ విడుదల చేశా. గుర్రం ఆనంద్ అనే స్నేహితుడితో కలిసి రాసిన 'ఊరెళ్లిపోతా మామా..' పాటకైతే బాగా పేరు తెచ్చింది. రెగె ప్లస్ ఫోక్ కలిపిన స్టైల్‌లో నా మ్యూజిక్ ఉంటుంది. ఇప్పుడు రేడియో నుంచి వైదొలిగాను. సినిమాలకు కూడా పనిచేస్తున్నా.

**లాక్‌డౌన్ కదిలించింది**

ప్రస్తుతం ఉన్న పరిస్థితులు అందరికీ తెలిసినవే. ప్రభుత్వాలు, అధికారులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నా కూడా ప్రజలు సహకరించకపోవడం చాలా బాధ కలిగించింది. అందుకే ఒక రాత్రి పూట కూర్చుని ఆవేదనతో ఈ పాట (చేతులెత్తి మొక్కుతా..) రాసి రికార్డ్ చేశాను. అప్‌లోడ్ చేసేశాను. దాదాపు 15లక్షల వ్యూస్ వచ్చాయి. ఈ పాట హిట్టయింది, పేరొచ్చింది అనేదెలా ఉన్నా జనంలో మార్పొస్తే ఇంకా సంతోషం కలుగుతుంది. నా వైపు నుంచి యూత్‌కి చిన్న సూచన. మీరు కూడా హోమ్ క్వారంటైన్‌లో ఉంటూ ఇలాంటి పాటలు తయారు చేయండి..'' అంటున్నారు రామ్.

– ఆరెన్నార్


రామ్

## ఇంటిప్స్

- గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపుపొడి వేసుకొని ఉదయం, సాయంత్రం తాగితే జలుబు త్వరగా తగ్గుతుంది. గొంతు గరగర, నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
- కొద్దిగా నీటిని చేర్చి పచ్చిపసుపు దంచి రసం తీయాలి. దీన్ని చర్మం పై అలర్జీ ఉన్న చోట రాస్తే ఉపశమనం లభిస్తుంది. అలెర్జీ తగ్గుతుంది.
- పసుపుపొడిని నీటిలో కలిపి ముద్ద చేయాలి. దీన్ని వేపాకు గుజ్జులో కలిపి చర్మం పైన పూయడం ద్వారా ఎగ్జిమా వంటి చర్మవ్యాధులను నివారించవచ్చు.
- నువ్వుల నూనెలో పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని దోమ కాటు వల్ల వచ్చిన దద్దుర్లపైన రాస్తే త్వరగా ఉపశమనం కలుగుతుంది.
- పసుపులో కొంచెం సున్నం కలిపిన మిశ్రమంతో బెణికిన చోట మర్దనా చేస్తే నొప్పి తగ్గుతుంది.



epaper.sakshi.com



## ముందుంది కష్టకాలం : భారత షట్లర్ ప్రణయ్ ఆందోళన

కరోనా విజృంభణతో క్రీడాలోకంలో భయానక పరిస్థితులు నెలకొని ఉన్నాయని, మరో నెలన్నరలోపు అంతా సర్దుకోకపోతే తమపై ఆర్థికంగా భారీ భారం పడుతుందని భారత షట్లర్ హెచ్ఎస్ ప్రణయ్ అభిప్రాయ పడ్డాడు. కరోనా దెబ్బకు ప్రపంచ వ్యాప్తంగా జరగాల్సిన అన్ని స్పోర్ట్స్ ఈవెంట్‌లు నిలిచిపోవడంతో పలు క్రీడలకు సంబంధించిన ఆటగాళ్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లే పరిస్థితుల్లో ఉన్నారని, ముఖ్యంగా బ్యాడ్మింటన్ ప్లేయర్లపై ఈ ప్రభావం తీవ్రంగా ఉందని ప్రణయ్ అన్నాడు. 'లాక్‌డౌన్ కారణంతో జరగాల్సిన అన్ని ఈవెంట్‌లు నిలిచిపోయాయి. దాంతో ఆటగాళ్ల సంపాదనకు ఆటంకం ఏర్పడింది. ఇప్పుడు మేమంతా మా స్పాన్సర్లపై ఆధారపడి ఉన్నాం. అయితే వ్యాపారాలు జరగకపోవడంతో వారి ఆదాయం కూడా బాగా పడిపోయింది. మరో నెలన్నరలోపు ఈ పరిస్థితుల్లో మార్పు రాకుంటే మాకు గడ్డుకాలమే' అని కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత ప్రణయ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

# డివిలియర్స్‌ను స్లెడ్జింగ్ చేయలేదు!

### ఆరోగ్య కారణాలతోనే శాకాహారిగా మారా ● కోహ్లి చెప్పిన విశేషాలు



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి లాక్‌డౌన్ కారణంగా దొరికిన సమయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నారు. దేశవ్యాప్త కర్ఫ్యూ ప్రకటించడానికి కాస్త ముందుగా అతను, తన భార్యతో కలిసి ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయాడు. ప్రస్తుతం అతను అక్కడే ఉన్నాడు. ఈ నేపథ్యంలో 'ఇన్‌స్టగ్రామ్'లో కోహ్లికి, ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్‌కు మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. కేపీ అడిగిన ప్రశ్నలకు కోహ్లి జవాబులిచ్చాడు. కొన్ని విశేషాలు విరాట్ మాటల్లోనే...

- నేను, అనుష్క ఒకే చోట ఇంత సమయం ఎప్పుడూ గడపలేదు. అయితే మనం ఏమీ చేయలేం. అంతా బాగుంటే ఈ సమయానికి చిన్నస్వామి స్టేడియంలో ఉండేవాడిని.
- ఒక్క సారి కూడా బెంగళూరు ఐపీఎల్ గెలవలేకపోవడం నిరాశ కలిగించేదే. పెద్ద స్టార్లు ఉండటంతో అందరి దృష్టి జట్టుపైనే ఉండేది. 3 సార్లు ఫైనల్, 3 సార్లు సెమీస్ చేరినా టైటిల్ గెలవకపోతే వీటికి అర్థం లేదు. అత్యుత్తమ జట్టుతో కూడా టైటిల్ సాధ్యం కాలేదు. మేం ఎంత గెలిచేందుకు ప్రయత్నిస్తే అది అంత దూరమైనట్లు అనిపించింది.
- భారత్ తరపున ధోనితో, ఐపీఎల్‌లో డివిలియర్స్‌తో జోడిగా మైదానంలో ఆడటాన్ని బాగా ఇష్టపడతా. ఆటలో ఎలాంటి పరిస్థితులు ఉన్నా నా మిత్రులపై మాత్రం ఆగ్రహం చూపించలేను. డివిలియర్స్ అలాంటి వాడే. అతనితో నా స్నేహం ఎంతో ప్రత్యేకం. కాబట్టి నా కెరీర్‌లో ఎప్పుడూ అతడిని స్లెడ్జింగ్ చేయలేదు. అసలు కళ్లలో కళ్లు పెట్టి నేరుగా చూడలేదు.
- 2014 ఇంగ్లండ్ పర్యటన నా కెరీర్‌లో చేదు జ్ఞాపకం. బాగా ఆడాలని ఎంతగా ప్రయత్నించినా ఘోరంగా విఫలమయ్యాను. నిజాయితీగా చెప్పాలంటే జట్టు కోసం కాకుండా వ్యక్తిగత ప్రదర్శనపై దృష్టి పెట్టి తప్పు చేశా. ఇంగ్లండ్ గడ్డపై టెస్టుల్లో బాగా ఆడితే నాకు పేరు ప్రఖ్యాతులు బాగా వచ్చేస్తాయని భావించడంతోనే సమస్య వచ్చింది.
- 2018 ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు శాకాహారిగా మారాను. అంతకు ముందు దక్షిణాఫ్రికా సిరీస్ సమయంలో నా మెడ భాగంలో వెన్నుముక సమస్యలతో తీవ్రంగా బాధపడ్డా. రాత్రి పడుకోలేకపోయేవాడిని. నా శరీరం ఎక్కువ మొత్తంలో యూరిక్ ఆసిడ్ విడుదల చేసేది. దాంతో అప్పటికప్పుడు మాంసాహారం మానేసేందుకు సిద్ధమయ్యా.



- 2008లో ఒక సారి గోల్ఫ్ ఆడాను. చక్కటి స్టాన్స్‌తో కవర్ మీదుగా సూపర్ షాట్ ఆడాను. డివిలియర్స్ నా వద్దకు వచ్చి బంతి నువ్వే తెచ్చుకోవాలని చెప్పాడు. అంతే...నేను మళ్లీ ఈ ఆట ఆడనని చెప్పేశా.

*చివరకు ఈ చర్చలో మధ్యలోకి వచ్చిన అనుష్క శర్మ 'ఇక చాలు... డిన్నర్ టైమ్ అయింది' అంటూ పోస్ట్ పెట్టడంతో పీటర్సన్ ఈ ఇంటర్వ్యూను ముగించాడు.*

# ఆ ఒక్క సిక్సర్‌తో వరల్డ్ కప్ గెలవలేదు!

### గౌతం గంభీర్ అసహనం



**న్యూఢిల్లీ:** భారత జట్టు రెండో సారి వన్డే ప్రపంచ కప్ సాధించిన రోజు 2011, ఏప్రిల్ 2 గురించి తలచుకోగానే కెప్టెన్ ధోని అద్భుతమైన సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించిన క్షణం అభిమానుల మనసుల్లో మెదులుతుంది. ఆ షాట్ అందరి హృదయాల్లోనూ అలా ముద్రించుకుపోయింది. అయితే శ్రీలంకపై నాటి ఫైనల్ విజయంలో అందరూ విస్మరించే అంశం గౌతం గంభీర్ ఆడిన కీలక ఇన్నింగ్స్ గురించే. 31 పరుగుల వద్దే సెహ్వాగ్, సచిన్ అవుటైన తర్వాత పట్టుదలగా నిలబడిన గంభీర్ విజయానికి పునాది వేశాడు. చివరకు 122 బంతుల్లో 97 పరుగులు చేసిన అతను త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. వరల్డ్ కప్ జ్ఞాపకాలు గుర్తు చేసినప్పుడల్లా ధోని సిక్సర్‌పైనే చర్చ జరగడంపై తన అసహనాన్ని గంభీర్ ఏనాడూ దాచుకోలేదు. దానిపై నిర్మొహమాటంగా తన అభిప్రాయాన్ని చెబుతూ వచ్చిన అతను 9 ఏళ్ల తర్వాత కూడా మరోసారి ఆ ఆగ్రహాన్ని ప్రదర్శించాడు. ప్రముఖ క్రికెట్ వెబ్‌సైట్ 'క్రిక్‌ఇన్ఫో' ధోని ఆడిన చివరి షాట్ ఫోటో పెట్టి '2011లో ఈ రోజు... లక్షలాది భారతీయుల సంబరాలకు కారణమైన షాట్' అని వ్యాఖ్య జోడించింది. దీనిపై గంభీర్ వెంటనే స్పందించాడు. 'క్రిక్‌ఇన్ఫో...మీకో విషయం గుర్తు చేస్తున్నా. 2011 ప్రపంచకప్ భారత్ గెలిచింది. మొత్తం భారత జట్టు, సహాయక సిబ్బంది గెలిచింది. ఒక సిక్స్‌పై మీకున్న అతి ప్రేమను బయటకు విసిరి కొట్టండి' అని ఘాటుగా బదులిచ్చాడు.

**విరాళంగా రెండేళ్ల జీతం...**

ప్రస్తుతం తూర్పు ఢిల్లీ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు కూడా అయిన గంభీర్ కోవిడ్–19ను సమర్థంగా ఎదుర్కొనే విషయంలో ప్రభుత్వానికి తన వంతు ఆర్థిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చాడు. ఎంపీగా తనకు లభించే రెండేళ్ల జీతాన్ని 'పీఎం కేర్' ఫండ్‌కు విరాళంగా ఇస్తున్నట్లు అతను ప్రకటించాడు. ఇంతకు ముందే నెల జీతాన్ని విరాళంగా ప్రకటించిన అతను ఎంపీ ల్యాడ్స్ నిధులలో రూ. 1 కోటి దీనికి కేటాయిస్తున్నట్లు కూడా చెప్పాడు. విరాళాలు అందించిన ఇతర క్రీడా ప్రముఖులలో భారత ఫీల్డింగ్ కోచ్ ఆర్.శ్రీధర్ (రూ. 4 లక్షలు), ప్రముఖ షూటర్ అపూర్వి చండీలా (రూ. 5 లక్షలు), భారత బ్యాడ్మింటన్ సంఘం (రూ. 10 లక్షలు) ఉన్నారు.

# 90 లక్షలు!

### మహిళల టి20 ప్రపంచకప్ ఫైనల్ వీక్షకుల సంఖ్య



**దుబాయ్:** ఇటీవల జరిగిన మహిళల టి20 ప్రపంచకప్ టోర్నమెంట్‌కు వీక్షకులు బ్రహ్మరథం పట్టారు. అభిమానుల్లో ఎంతో ఆసక్తి రేపిన టైటిల్‌పోరు వీక్షకుల సంఖ్యలో గత రికార్డులన్నీ బద్దలుకొట్టిందని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గురువారం ప్రకటించింది. ఐసీసీ తాజాగా ప్రకటించిన గణాంకాల ప్రకారం మార్చి 8న భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆస్ట్రేలియా వేదికగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను భారత్‌లో ఏకంగా 90.2 లక్షల మంది వీక్షించినట్లు వెల్లడించింది. ఎంసీజీ మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో 86,174 మంది హాజరవ్వగా... భారత్‌లో ఈ మ్యాచ్‌ను టీవీల ద్వారా చూసేందుకు 178 కోట్ల నిమిషాల సమయం వెచ్చించినట్లు వారి లెక్కల్లో తేలింది. ఈ టోర్నీ మొత్తాన్ని చూసేందుకు భారత అభిమానులు 540 కోట్ల నిమిషాల సమయాన్ని కేటాయించినట్లు తెలిపింది. దీన్ని ఒక్కో అభిమాని... ఒక్కో మ్యాచ్‌ను వీక్షించిన సమయం ఆధారంగా లెక్కించినట్లు ఐసీసీ పేర్కొంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్ వేదికగానూ ఈ టోర్నీ రికార్డు సృష్టించింది. 2019 పురుషుల ప్రపంచకప్ తర్వాత డిజిటల్ వేదికలపై అత్యంత ఆదరణ పొందిన రెండో టోర్నీగా నిలిచింది. మహిళల క్రికెట్‌కు సంబంధించి ఇదే మొదటిది కావడం విశేషం. ఈ మాధ్యమం ద్వారా ఫిబ్రవరి 21 నుంచి మార్చి 8 మధ్య ఈ టోర్నీకి సంబంధించిన 110 కోట్ల వీడియోలు అభిమానులు చూశారు.

# ఐఎస్‌ఎల్‌కు పెరిగిన వీక్షకులు

**న్యూఢిల్లీ:** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) తన వీక్షకుల సంఖ్యను భారీగా పెంచుకుంది. తాజా ఐఎస్‌ఎల్ (2019–20) సీజన్‌ను వీక్షించిన ప్రేక్షకుల సంఖ్యను గత సీజన్‌తో పోలిస్తే 51 శాతం పెంచుకుందని టోర్నీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. 16.8 కోట్ల మంది తాజా సీజన్‌ను వీక్షించినట్లు తెలిపారు. ప్రధాన ప్రసారకర్తగా ఉన్న స్టార్ స్పోర్ట్స్, స్టార్ ఇండియా ఈ సీజన్‌ను 11 చానళ్ల ద్వారా 7 భాషల్లో దేశవ్యాప్తంగా ప్రసారం చేసింది. దీంతో పాటు హాట్‌స్టార్, జియో టీవీ డిజిటల్ వేదికపై ప్రత్యక్ష ప్రసారం చేశాయి. అట్లెటికో డి కోల్‌కతా రికార్డు స్థాయిలో మూడోసారి ఐఎస్‌ఎల్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్లో చెన్నైయిన్ ఎఫ్‌సీను కోల్‌కతా ఓడించింది.

# డీఎల్‌ఎస్ సూత్రధారి లూయిస్ ఇక లేరు!

**లండన్:** టోనీ లూయిస్ అంటే ఎవరికీ తెలియకపోవచ్చు. కానీ క్రికెట్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి అంటే తెలియని వారుండరు. క్రికెట్‌కు బాగా అక్కరకొచ్చే 'డక్‌వర్త్ లూయిస్ పద్ధతి' (డీఎల్‌ఎస్) సూత్రధారుల్లో టోనీ ఒకరు. మ్యాచ్ ప్రతికూల పరిస్థితుల్లో ఆగిపోతే ఈ డక్‌వర్త్ లూయిస్ పద్ధతినే అనుసరించి విజేతను తేలుస్తారు. వర్షంతో ఆగి... సాగే మ్యాచ్‌లకు విజేతను తేల్చే పద్ధతిని కనిపెట్టిన గణాంక నిపుణుల్లో ఒకరైన ఇప్పుడు లూయిస్ కన్నుమూశారు. 78 ఏళ్ల టోనీ లూయిస్ అనారోగ్య కారణాలతో మృతి చెందినట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఒక ప్రకటనలో తెలిపింది. ఓ యూనివర్సిటీలో గణిత ప్రొఫెసర్ అయిన టోనీ లూయిస్, మరో గణాంక నిపుణుడు ఫ్రాంక్ డక్‌వర్త్‌తో కలిసి ఓ లెక్క తెచ్చారు. ఓవర్లు, పరుగులు, వికెట్లు, రన్‌రేట్, తాజా పరిస్థితి అన్నింటిని లెక్కలోకి తీసుకొని ఓ సారుప్య నిష్పత్తితో గణాంకాలను



లూయిస్




ఆవిష్కరించారు. ఇది వర్షంతో మధ్యలోనే ఆగిపోయిన, ఆగి సాగిన ఎన్నో మ్యాచ్‌లకు ఫలితాన్నిచ్చింది. లూయిస్ సాగించిన శోధనలకు, సాధించిన ఆవిష్కరణలకు గుర్తింపుగా ఇంగ్లండ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'ఎంబీఈ' (మెంబర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటీష్ ఎంపైర్) పురస్కారంతో సత్కరించింది. డీఎల్‌ఎస్ రాకముందు అర్ధంతరంగా ఆగే మ్యాచ్‌ల కోసం ఓ మూస పద్ధతిని అవలంభించేవారు. అప్పటి దాకా ఆడిన ఓవర్లలో అత్యధిక సగటు పరుగుల లెక్కతో విజేతను తేల్చడమో... లక్ష్యాన్ని నిర్దేశించడమో జరిగేది. 1992లో జరిగిన ప్రపంచకప్‌లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్ ఫలితాన్ని తేల్చిన అప్పటి విధానం పెను విమర్శలకు దారితీసింది. దీంతో మెరుగైన కొత్త పద్ధతి కోసం ఐసీసీ అన్వేషించగా... డక్‌వర్త్, లూయిస్ ఇద్దరు కలిసి రూపొందించిన పద్ధతి ఐసీసీని మెప్పించింది. దీంతో వారిద్దరి పేర్లతోనే డీఎల్ సిస్టమ్‌గా 1997 జనవరి 1నుంచి అమలు చేశారు. నిజానికి ఇదేమీ తేలిగ్గా అర్థమవదు. అయితే పాత పద్ధతి కంటే మేలైనది కావడంతో ఐసీసీకి డీఎల్‌ఎస్ తప్ప వేరే ప్రత్యామ్నాయం కనపడలేదు. తదనంతర కాలంలో ఈ పద్ధతికి ఆస్ట్రేలియన్ ప్రొఫెసర్ స్టీవెన్ స్టెర్న్ మెరుగులు దిద్దడంతో అతని పేరు కూడా కలిపి 2014నుంచి డక్‌వర్త్–లూయిస్–స్టెర్న్ (డీఎల్ఎస్)గా వ్యవహరిస్తున్నారు.

సినిమా

# వైరసవత్తరమైన సినిమాలు



### వైరస్ బ్యాక్ డ్రాప్ లో వచ్చిన సినిమాలు

గతాన్ని విశ్లేషించుకోవడానికి, ప్రస్తుతాన్ని అర్థం చేసుకోవడానికి, భవిష్యత్తుని ఎదుర్కోవడానికి కీలకమైన వాటిలో సినిమా కచ్చితంగా ఒకటి. సినిమా సమాజానికి అద్దమే కదా! బయటి ప్రపంచంలోని కష్టాలను తప్పించుకోవడానికి సినిమాని ఎస్కేప్ గా వాడతాం. సినిమా ఫ్యాంటీసిలోకి వెళ్లిపోయి మనకున్న అనవసరమైన తలనొప్పులను తాత్కాలికంగా మర్చిపోతాం. ప్రస్తుతం మనందరి ముందు ఉన్న సమస్య ఒక్కటే... కోవిడ్ – 19 (కరోనా వైరస్). ఈ ప్రమాదం నుంచి ఎలా బయటపడతాం అన్నదే అందరి మదిలో ఉన్న ఆలోచన. గతంలోనూ ఇలాంటి వైరస్‌లు ప్రపంచం మీదకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టాయి. బీభత్సాన్ని సృష్టించాయి. వాటిని తట్టుకొని నిలబడ్డ సందర్భాలున్నాయి. అయితే అలాంటి సంఘటనల ఆధారంగా కొన్ని కాల్పనిక సినిమాలు వచ్చాయి. వైరస్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన సినిమాల గురించి తెలుసుకోవడం మంచి అవకాశం ఇది. సినిమాలోని పాత్రలను కష్టపెట్టిన ఆ వైరస్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు ప్రేక్షకులను మెప్పించి, 'వైరసవత్తరం' అనిపించుకున్నాయి. ఆ చిత్రాల విశేషాలు.

### వైరస్ (2019)



2018లో కేరళపై నిఫా వైరస్ దాడి చేసింది. ఎన్నో ప్రాణాలు కోల్పోయాం. అయితే ఆ వైరస్‌ని అధిగమించాం. ఆ సంఘటనల ఆధారంగా మలయాళ దర్శకుడు ఆషిక్ అబూ 'వైరస్' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. మలయాళ క్రేజీ స్టార్స్ చాలా మంది ఈ సినిమాలో నటించారు. మన దేశంలో తెరకెక్కిన బెస్ట్ మెడికల్ థ్రిల్లర్‌గా ఈ సినిమా గురించి చెప్పుకోవచ్చు.
(ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో చూడొచ్చు.)

### కంటేజిన్ (2011)




కరోనా వైరస్ విపరీతంగా వ్యాప్తి చెందినప్పటినుంచి 2011లో వచ్చిన 'కంటేజిన్' సినిమా ప్రస్తావన వస్తూనే ఉంది. కారణం.. ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితులను ఆ సినిమాలో ముందే చూపించడమే. స్టీవెన్ సోడన్ బెర్గ్ తెరకెక్కించిన ఆ సినిమాలో కేట్ విన్స్ లెట్, మాట్ డెమన్ ముఖ్య పాత్రల్లో నటించారు. గాల్లో ప్రయాణించే వైరస్ ప్రపంచవ్యాప్తంగా సోకితే ఏం జరిగింది? అనే కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. మందు కనుగొన్నారా? వంటి అంశాలను చూపించారు. (అమెజాన్ ప్రైమ్‌లో చుడొచ్చు.)

### అవుట్ బ్రేక్ (1995)




ఎబోలా వైరస్ అమెరికాను ఎటాక్ చేస్తే, దాన్ని ఎదుర్కోవడానికి శాస్త్రవేత్తలు, సామాన్య ప్రజలు ఎం చేశారు? అనే కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'అవుట్ బ్రేక్'. రిచర్డ్ ప్రెస్టన్ రచించిన 'ది హాట్ జోన్' ఆధారంగా ఈ సినిమాను దర్శకుడు పెటెర్ సెన్ తెరకెక్కించారు.
(చూడాలనుకుంటే యూట్యూబ్‌లో రెంట్ చేసుకోవచ్చు.)

### ఫ్లూ (2013)




36 గంటల్లో మనుషుల ప్రాణాల్ని తీసుకునే భయంకరమైన వైరస్ ఒకటి సౌత్ కొరియాలో పుడితే, దాన్ని ఎలా ఎదుర్కొన్నారు? అనే కథతో తెరకెక్కిన కొరియన్ చిత్రం 'ఫ్లూ'. కిమ్ సంగ్ సూ తెరకెక్కించారు.

### 12 మంకీస్ (1995)




12 మంకీస్ అనే గ్యాంగ్ భయంకరమైన వైరస్‌ని తయారు చేసి ప్రపంచం మీద వదులుతుంది. దాంతో ప్రపంచం దాదాపు అంతమవుతుంది. బతికి బయటపడ్డ వాళ్లు భూ కింది భాగంలో జీవిస్తుంటారు. ఈ వైరస్ ఎలా తయారయింది? దీనికి పరిష్కారం ఎలా కనుక్కోవాలి? అని టైమ్ ట్రావెల్‌లో హీరో ప్రయాణం చేయడమే చిత్రకథ. బ్రాడ్ పిట్ ముఖ్య పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని టెర్రీ గిల్లియం తెరకెక్కించారు. (నెట్ ఫ్లిక్స్‌లో చుడొచ్చు.)

వైరస్ బ్యాక్‌డ్రాప్ కథాంశాలతోనే '28 డేస్ లేటర్' (2002), 'కారియర్స్' (2009), 'బ్లైండ్‌నెస్' (2008), 93 డేస్ (2016) వంటి మరికొన్ని సినిమాలు కూడా రూపొందాయి. ఈ సినిమాలన్నీ వేరు వేరు భాషల్లో రూపొందినవి కావొచ్చు. కానీ కథలన్నీ ఇంచుమించు ఒక్కటే. అవన్నీ చెబుతున్నది కూడా ఒక్కటే. సమస్య ఎప్పుడైనా, ఎలా అయినా రావొచ్చు. ధైర్యంగా నిలబడితేనే పరిష్కారం లభిస్తుంది. విపత్కర వైరస్‌లు వస్తే దాని పరిస్థితిని, ప్రభావాన్ని అవగాహన చేసుకోవడానికే ఈ సినిమాలన్నీ చూడండి, అనవసరమైన భయాన్ని, భ్రమను కలిగించుకోవడానికి కాదు. సినిమాలో విలన్ ఎంత బలవంతుడైతే కథ అంత రసవత్తరంగా ఉంటుంది. అతన్ని ఎదిరించి గెలిస్తే కథ మరింత రసవత్తరంగా తయారవుతుంది. ప్రస్తుతం మనందరి ముందు ఉన్న విలన్ కరోనా. ఈ వైరస్ ని ధైర్యంగా ఎదుర్కొని మనందరమూ హీరోలవుదాం. దాన్ని ఎదుర్కోడానికి ఎదురెళ్లనవసరం లేదు. ఇంట్లో ఉండే జయించవచ్చు. ఇంట్లో ఉండండి. బయటికొచ్చి ఇబ్బందుల్లో పడకండి.

**– గౌతమ్ మల్లాది**

# సరోజినీ నాయుడుగా...



● దీపికా చిఖలియా

స్వాతంత్య్ర సమరయోధురాలు, కవయిత్రి, స్వతంత్ర భారతదేశ తొలి మహిళా గవర్నర్, నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పేరు పొందిన సరోజినీ నాయుడు బయోపిక్ తెరకెక్కనుంది. సరోజినీ నాయుడు పాత్రను దీపికా చిఖలియా పోషించనున్నారు. 'రామాయణ్' (1987) టీవీ సీరియల్‌లో సీతగా నటించి, అప్పటి తరానికి అభిమాన తారగా మిగిలిపోయారు దీపికా. అప్పట్లో ఆమెను అసలు పేరుతో కాకుండా 'సీత' అనే చాలామంది పిలిచేవారు. ఆ పాత్రను అంత అద్భుతంగా చేశారు దీపికా. ఆ తర్వాత నటిగా వెండితెరపై కూడా ప్రేక్షకులను మెప్పించే ప్రయత్నం చేశారామె. 1991లో ఎన్టీఆర్ నటించిన 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' చిత్రంలో చంద్రమతిగా నటించారు దీపిక. హిందీ, తమిళం, గుజరాత్ భాషల చిత్రాల్లోనూ నటించారు. ప్రస్తుతం హిందీ చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేస్తున్నారు. సరోజినీ నాయుడు బయోపిక్ గురించి దీపిక మాట్లాడుతూ– ''సరోజినీ నాయుడు బయోపిక్‌లో నటించే అవకాశం నాకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఆన్‌లైన్‌లో సరోజినీగారి గురించి వెతికాను. నాకు కావాల్సినంత సమాచారం దొరకలేదు. రైటర్ ధీరజ్ మిశ్రా ఈ బయోపిక్ గురించి చెప్పారు. అయితే నేనింకా సైన్ చేయలేదు. లాక్‌డౌన్ పూర్తయిన తర్వాత పూర్తి స్క్రిప్ట్ విని నిర్ణయం తీసుకుంటాను'' అని పేర్కొన్నారు. ధీరజ్ మిశ్రాయే ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని బాలీవుడ్ టాక్.

# అప్పుడు మళ్లీ లాక్‌డౌన్!



● లక్ష్మీరాయ్

''21డేస్ హోం క్వారంటైన్‌లో ఉన్నంత మాత్రాన కరోనా వైరస్‌ను జయించినట్లు కాదు. 22వ రోజు నుంచి కూడా కొంతకాలం కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే చర్యలు చేపట్టాలి'' అంటున్నారు లక్ష్మీరాయ్. కరోనా వైరస్ నిరోధక చర్యలను పాటించకపోయినట్లయితే ఇంకా చెడు పరిణామాలు జరిగే అవకాశం ఉందని తనతో ఓ డాక్టర్ చెప్పినట్లు ఆమె పేర్కొన్నారు. ఆ విషయాల గురించి ఓ లాంగ్ పోస్ట్‌ను ఆమె తన సోషల్ మీడియా ద్వారా షేర్ చేశారు. ఆ పోస్ట్ సారాంశం ఈ విధంగా..

''లాక్‌డౌన్ పూర్తయిన తర్వాత దేశభక్తితో కొందరు రోడ్లపైకి వచ్చి కరోనా యుద్ధాన్ని గెలిచామని పెద్ద పెద్దగా అరుస్తారు. దేశభక్తి గీతాలను ప్లే చేస్తూ కొంత మంది, జాతీయ జెండాను పట్టుకుని మరికొంతమంది రోడ్ల పైకి వచ్చి విచ్చలవిడిగా వాహనాలను నడుపుతారు. మేం చదువుకున్నవారమంటూ చెప్పుకుంటున్న కొందరు లాక్‌డౌన్ పూర్తయిన వెంటనే సినిమా హాల్స్, మాల్స్, పబ్లిక్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్‌లోకి వెళ్లి టైమ్ గడిపే ప్రయత్నం చేస్తారు. అలాగే కొన్ని కార్పొరేట్ సంస్థలు, చిన్న, మధ్యస్థాయి కంపెనీలు లాక్‌డౌన్ వల్ల కలిగిన ఇబ్బందులను అధిగమించడానికి తమ ఉద్యోగులకు అధిక పని గంటలను కేటాయించాలని చెప్పవచ్చు. కరోనాకు భయపడి ఇప్పటికే పట్టణాల నుంచి గ్రామీణప్రాంతాలకు చేరుకున్నవారు తిరిగి తమ ఉద్యోగాలను, వ్యాపారాలను ప్రారంభించాలని పెద్ద ఎత్తున పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను వినియోగిస్తారు. ఇలా అందరూ తమ తమ సాధారణ జీవితాలను ప్రారంభిస్తారు. ఇప్పటికే 21డేస్ క్వారంటైన్‌లో ఉన్నాం కదా అని శానిటైజర్స్‌ను, మాస్కులను పక్కనపెట్టేస్తారు. పరిశుభ్రంగా ఉండే విషయాల పట్ల నిర్లక్ష్యంగా ఉంటారు. కానీ వీరిలో ఇంకా ఎవరికైనా స్వల్పంగా కరోనా లక్షణాలు ఉన్నా, అవగాహన లేక కరోనా పరీక్షలు చేయించుకోకుండా ఉండి జనసంద్రంలో తిరిగినా.... మళ్లీ కరోనా వైరస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. అప్పుడు మరోసారి ప్రజలందరూ లాక్‌డౌన్ పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావొచ్చు. 21 రోజుల క్వారంటైన్ పూర్తయిన వెంటనే 22వ రోజు నుంచి కూడా కొంత కాలం సామాజిక దూరాన్ని, కరోనా వైరస్‌ను అరికట్టడానికి పాటించాల్సిన సూత్రాలను మర్చిపోకండి. ఒక వేళ వీటిపట్ల అశ్రద్ధగా ఉంటే ఇప్పటివరకు మనం పాటించిన 21డేస్ లాక్‌డౌన్ వృథా కావొచ్చు. 22వ రోజున ప్రజా రవాణా, ప్రజాజీవనం ఎలా ఉండాలో ప్రభుత్వాలు కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది'' అని పేర్కొన్నారు లక్ష్మీరాయ్.

epaper.sakshi.com

సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com
శుక్రవారం
3-4-2020




# వైద్య సేవల గుండె చప్పుడు.. నర్సింగ్!

రకరకాల శారీరక, మానసిక అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులకు సేవలందించే వారే.. నర్సులు. వైద్యులు చికిత్స చేసిన తర్వాత రోగులు త్వరగా కోలుకోవాలంటే.. నర్సింగ్ సేవలు చాలా అవసరం. నర్సులు నిరంతరం రోగుల పరిస్థితిని పర్యవేక్షిస్తూ.. డాక్టర్లు సూచించిన మందులను క్రమం తప్పకుండా ఇస్తారు. శస్త్రచికిత్సల సమయంలో ఆపరేషన్ థియేటర్లు, క్లినికల్ లేబొరేటరీల్లో వైద్యపరికరాలను అందుబాటులో ఉంచడంతోపాటు డాక్టర్లకు సహాయకులుగా సేవలు అందిస్తారు. రోగి కోలుకున్నాక కూడా కొన్ని రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండాల్సి వస్తుంది. ఆలాంటప్పుడు ఆయా రోగులను కంటికి రెప్పలా చూసుకునేది కూడా నర్సులే. ఒక్క మాటలో చెప్పాలంటే.. వైద్య సేవల గుండె చప్పుడు నర్సింగ్ అని భావించొచ్చు. ఇలాంటి ఉన్నతమైన సేవల కెరీర్ నర్సింగ్‌పై ప్రత్యేక కథనం...

- ఇంటర్మీడియెట్ అర్హతతో ఏఎన్ఎం, జీఎన్ఎం కోర్సులు
- బీఎస్సీ నర్సింగ్‌తో ఆకర్షణీయ వేతనాలు ఖాయం
- ఎంఎస్సీ నర్సింగ్ పూర్తిచేసుకుంటే ఉన్నత ఉద్యోగాలు
- దేశ విదేశాల్లో నర్సింగ్ సిబ్బందికి పెరుగుతున్న డిమాండ్

## ఆక్సిలరీ నర్సింగ్ మిడ్‌వైఫరీ (ఏఎన్ఎం)

నర్సింగ్‌లో కెరీర్ కోరుకునే అభ్యర్థుల కోసం వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి, అభిరుచిని బట్టి వివిధ స్థాయి కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఆయా కోర్సును బట్టి ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) అర్హతలను నిర్దేశించింది. త్వరగా ఉద్యోగంలో చేరాలనుకునేవారు 'ఏఎన్ఎం'(ఆక్సిలరీ నర్సింగ్ మిడ్‌వైఫరీ) కోర్సు ఎంచుకోవచ్చు. ఏఎన్ఎం కోర్సు కాల పరిమితి రెండేళ్లు. ఇందులో చేరేందుకు అర్హత 10+2/ ఇంటర్మీడియెట్(ఏదైనా గ్రూప్) ఉత్తీర్ణత. ఓపెన్ స్కూలింగ్‌లో చదివినవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థి కనీస వయసు 17 ఏళ్లు ఉండాలి. ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్ లభిస్తుంది. వీరికి హోమ్ నర్స్, మిడ్‌వైఫ్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్, సర్టిఫైడ్ నర్సింగ్ అసిస్టెంట్, కమ్యూనిటీ హెల్త్ నర్సు, ఐసీయూ నర్స్ వంటి విభాగాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఈ కోర్సు తర్వాత ఏదైనా పోస్ట్ బేసిక్ స్పెషాలిటీ(ఏడాది డిప్లొమా) కోర్సు కూడా పూర్తిచేస్తే.. మంచి ఉద్యోగంతోపాటు మెరుగైన వేతన ప్యాకేజీ సైతం లభిస్తుంది.

» **స్పెషలైజేషన్‌లు..**
కార్డియో థొరాసిక్ నర్సింగ్, క్రిటికల్ కేర్ నర్సింగ్, అత్యవసర – విపత్తు నర్సింగ్, నియోనాటల్ నర్సింగ్, న్యూరో నర్సింగ్, నర్సింగ్ ఎడ్యుకేషన్, అడ్మిని స్ట్రేషన్, ఆంకాలజీ నర్సింగ్, ఆపరేషన్ రూమ్ నర్సింగ్, ఆర్థోపెడిక్ అండ్ పునరావాస నర్సింగ్, మిడ్‌వైఫరీ ప్రాక్టీషనర్, సైకియాట్రిక్ నర్సింగ్.

## జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్ఎం)

ఇది మూడున్నరేళ్ల జీఎన్ఎం డిప్లొమా కోర్సు. ఏఎన్ఎం కంటే మెరుగైనదిగా చెప్పవచ్చు. ఇంటర్మీడియట్ బైపీసీ కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. రిజర్వేషన్ల ప్రకారం కనీస మార్కుల సడలింపు ఉంది. ఇంటర్ అర్హతతో ఏఎన్ఎం పూర్తి చేసిన వారు సైతం జీఎన్ఎం కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సీ) అనుమతినిచ్చింది. 17 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవ చ్చు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశం కల్పిస్తారు. వీరు అనాటమీ అండ్ ఫిజియాలజీ, బయోలాజికల్ సైన్స్, మైక్రోబయాలజీ, బిహేవియరల్ సైన్స్, సోషియాలజీ, సైకాలజీ, నర్సింగ్ ప్రాథమిక అంశాలు, ప్రథమ చికిత్స వంటి అంశాలను అధ్యయనం చేస్తారు. కోర్సులో భాగంగా ఆరు నెలలు ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

» **ఉద్యోగ అవకాశాలు..**
జీఎన్ఎం కోర్సు పూర్తిచేసినవారికి మెరుగైన అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా క్లినికల్ నర్స్ స్పెషలిస్ట్, లీగల్ నర్స్ కన్సల్టెంట్, ఫోరెన్సిక్ నర్సింగ్, సీనియారిటీని బట్టి నర్సింగ్ కాలేజీల్లో టీచర్ అండ్ జూనియర్ లెక్చరర్, మిడ్‌వైఫరీ నర్స్, ఎమర్జెన్సీ రూమ్ నర్స్‌గా నియమించుకుంటారు.

## బీఎస్సీ నర్సింగ్(బేసిక్)

బీఎస్సీ నర్సింగ్ కోర్సు కాల వ్యవధి నాలుగేళ్లు. ఇంటర్మీడియెట్ బైపీసీలో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. 17ఏళ్లు నిండి ఉండాలి. ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సుల్లో ఇది ఒకటి. హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్స్, రైల్వేస్, ఎయిర్‌వేస్, డిఫెన్స్, ఇండస్ట్రీస్ తదితర విభాగాల్లో బీఎస్సీ నర్సింగ్ చేసినవారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి. అంతేగాక, బోధనా రంగంలోకి వెళ్లాలనుకుంటే పీజీ, పీహెచ్‌డీ కూడా చేయవచ్చు. బీఎస్సీ నర్సింగ్(బేసిక్) తర్వాత ఉద్యోగంలో చేరిపోవచ్చు లేదా ఎంఎస్సీ నర్సింగ్ చేయొచ్చు.

## పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్

ఇంటర్మీడియెట్ బైపీసీతో జీఎన్ఎం కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేరేందుకు అర్హులు. దీంతోపాటు స్టేట్ నర్సెస్ రిజిస్ట్రేషన్ కౌన్సిల్‌లో 'రిజిస్టర్డ్ నర్స్ మిడ్‌వైఫ్'గా నమోదు చేసుకోవడంతోపాటు జీఎన్ఎంగా రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులు. ఈ కోర్సును రెగ్యులర్‌గా చేయాలనుకుంటే రెండేళ్లు, జీఎన్ఎంగా ఉద్యోగంలో ఉన్నవారు దూరవిద్యా విధానంలో మూడేళ్లలో పూర్తి చేయవచ్చు.

## ఎమ్మెస్సీ నర్సింగ్

ప్రధానంగా నర్సింగ్ కాలేజీల్లో బోధనా వృత్తిని చేపట్టాలనుకునే వారు ఎమ్మెస్సీ నర్సింగ్‌ను ఎంచుకుంటారు. కోర్సు కాల పరిమితి రెండేళ్లు. ఈ పీజీ కోర్సులో ప్రసూతి అండ్ గైనకాలజీ, చైల్డ్ హెల్త్, సైకియాట్రిక్(మెంటల్ హెల్త్), మెడికల్ సర్జికల్, కమ్యూనిటీ హెల్త్ నర్సింగ్ విభాగాలలో స్పెషలైజేషన్ చేయవచ్చు. ఎమ్మెస్సీ నర్సింగ్ చేసినవారు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకోవచ్చు. నర్సింగ్ సూపరింటెండెంట్, టీచింగ్ కాలేజీల్లో లెక్చరర్స్ వంటి ఉద్యోగాలు దక్కించుకోవచ్చు. ఎమ్మెస్సీ నర్సింగ్ తర్వాత ఉన్నత విద్యపై ఆసక్తి ఉన్నవారు ఎంఫిల్ నర్సింగ్(రెగ్యులర్‌గా ఏడాది, డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో రెండేళ్లు) కోర్సుల్లో చేరొచ్చు. ఆ తర్వాత పీహెచ్‌డీ చేయవచ్చు.

## కళాశాలలు-ఫీజులు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం–ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 80 కళాశాలలు(5 గవర్నమెంట్ కళాశాలలు), శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 78 కళాశాలలు(4 గవర్నమెంట్ కాలేజీలు) ఉన్నాయి. తెలంగాణలోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పరిధిలో మొత్తం 8 ప్రభుత్వ నర్సింగ్(బీఎస్సీ/పోస్ట్ బీఎస్సీ/ ఎమ్మెస్సీ) కాలేజీలు, 107 ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి. ప్రైవేటు కళాశాలల్లో ఫీజు వేర్వేరుగా ఉంటుంది. బీఎస్సీ నర్సింగ్‌కు ఏడాదికి సుమారు రూ.లక్ష వరకు ఫీజు ఉంటుంది. జీఎన్ఎంకు రూ.25 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉంటుంది. ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సు ఫీజు ఏడాదికి రూ.1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు ఉంటుంది.

### నర్సింగ్ కోర్సులు

- ఏఎన్ఎమ్(సర్టిఫికెట్ ఇన్ ఆక్సిలరీ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ)– 2ఏళ్ల కోర్సు.
- జీఎన్ఎం(డిప్లొమా ఇన్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ)– మూడున్నరేళ్ల కోర్సు.
- బీఎస్సీ నర్సింగ్(బేసిక్)– నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీ కోర్సు.
- బీఎస్సీ నర్సింగ్(పోస్ట్ బేసిక్)– రెండేళ్ల బ్యాచిలర్ కోర్సు.
- ఎంఎస్సీ నర్సింగ్–రెండేళ్ల పీజీ కోర్సు.

### వేతనాలు

నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు వారి నైపుణ్యం, అనుభవం ఆధారంగా వేతనాలు లభిస్తాయి. ప్రారంభ వార్షిక వేతనం సరాసరి రూ.2.50 లక్షల వరకు ఉంటుంది. ఐదేళ్ల అనుభవం సొంతం చేసుకున్నాక రూ.5 లక్షల వరకు పొందవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఉన్న ఖాళీలను బట్టి నోటిఫికేషన్ ద్వారా ఏఎన్ఎం, స్టాఫ్‌నర్స్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. విదేశాల్లో సైతం నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ అధికంగా ఉంది.



వాస్తవానికి నర్సింగ్ కోర్సులు పూర్తి చేసినవారి ఉపాధికి డోకా లేదు.. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. ప్రయివేట్ రంగంలో అవకాశాలకు కొదవలేదు.

### డిమాండ్ ఉన్న ప్రొఫెషనల్ కోర్సు

నర్సింగ్ అనేది ప్రొఫెషనల్ కోర్సు. దీనికి దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. కోర్సు పూర్తి కాగానే ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో మంచి వేతనాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. చాలావరకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లోనే నియామకాలు జరిగిపోతున్నాయి. విదేశాల్లో సైతం మన నర్సింగ్ ప్రొఫెషనల్స్‌ను నియిమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. బీఎస్సీ నర్సింగ్ ఉంటే.. ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం లభిస్తుంది. సహనం, సేవా దృక్పథం, వృత్తిపరమైన మెళకువలు ఉన్నవారికి ఆకాశమే హద్దని చెప్పొచ్చు. విదేశాల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ చేసేందుకు లైసెన్స్ కూడా ఇస్తున్నారు. ఈ విధానం మన దేశంలోనూ అమలు చేసే దిశగా ప్రయత్నం జరుగుతోంది.

– బి.విద్యుల్లత–ప్రిన్సిపల్,
గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీ, హైదరాబాద్

# ఎన్‌టీఏ... దరఖాస్తుల పొడిగింపు



దేశంలో పరీక్షల నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ).. కరోనా కారణంగా వివిధ పరీక్షల ఆన్‌లైన్ దరఖాస్తుల తేదీలను పొడిగించింది.

1. **నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎన్‌సీహెచ్ఎం) జేఈఈ–2020:**
   - పాత తేదీలు: 01.01.2020 నుంచి 31.03.2020
   - కొత్త తేదీలు: 01.01.2020 నుంచి 30.04.2020
2. **పీహెచ్‌డీ. ఓపెన్ మాట్ (ఎంబీఏ) కోసం ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) ప్రవేశపరీక్ష–2020:**
   - పాత తేదీలు: 28.02.2020 నుంచి 23.03.2020
   - కొత్త తేదీలు: 28.02.2020 నుంచి 30.04.2020
3. **ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)–2020:**
   - పాత తేదీలు: 01.03.2020 నుంచి 31.03.2020
   - కొత్త తేదీలు: 01.03.2020 నుంచి 30.04.2020
4. **జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష (జేఎన్‌యూఈఈ)–2020:**
   - పాత తేదీలు: 02.03.2020 నుంచి 31.03.2020
   - కొత్త తేదీలు: 02.03.2020 నుంచి 30.04.2020
5. **యూజీసీ– నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (యూజీసీ–నెట్)–జూన్ 2020:**
   - పాత తేదీలు: 16.03.2020 నుంచి 16.04.2020
   - కొత్త తేదీలు: 16.03.2020 నుంచి 16.05.2020
6. **యూజీసీ సీఎస్ఐఆర్– నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీఎస్ఐఆర్–నెట్)–జూన్ 2020:**
   - పాత తేదీలు: 16.03.2020 నుంచి 15.04.2020
   - కొత్త తేదీలు: 16.03.2020 నుంచి 15.05.2020
7. **ఆల్ ఇండియా ఆయుష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్ష (ఏఐఏపీజీఈటీ)–2020:**
   - పాత తేదీలు: 01.04.2020 నుంచి 30.04.2020
   - కొత్త తేదీలు: 01.05.2020 నుంచి 31.05.2020

### ముఖ్యమైన సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించడానికి ఇచ్చిన చివరి తేది సాయంత్రం 4.00 గంటల వరకు ఉంటుంది.
- పరీక్షా ఫీజు ఇచ్చిన చివరి తేది రాత్రి 11.50 వరకు
- క్రెడిట్/డెబిట్ కార్డు/నెట్ బ్యాంకింగ్ /యూపీఐ, పేటీఎం ద్వారా చెల్లించవచ్చు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.nta.ac.in

10వ తరగతి ప్రత్యేకం
10వ తరగతి ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్ మొదలైనవి.. (EM &TM)
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

# ఇంటి నుంచే పని.. సమర్థంగా..!

- ఆఫీస్‌లో ఉన్నట్లుగా భావించి పనిచేయాలి
- స్వీయ క్రమశిక్షణ ముఖ్యం అంటున్న నిపుణులు




కరోనా వైరస్ విస్తరిస్తున్న తరుణంలో పలు కంపెనీలు ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోం సదుపాయం కల్పిస్తున్నాయి. వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్న ఉద్యోగులు.. తమ విధులను ప్రభావవంతంగా నిర్వర్తిస్తూ... నిత్యం టీం లీడర్‌లతో టచ్‌లో ఉంటూ.. నిర్ణీత కాలంలో తమ వర్క్ కార్యాలయానికి చేరేట్టు చూసుకోవడం చాలా ముఖ్యం. పలు ఐటీ కంపెనీల్లో వర్క్ ఫ్రం హోం విధానం ఎప్పటినుంచో అమలులో ఉంది. ప్రస్తుత 'కరోనా' కారణంగా మొదటిసారి వర్క్ ఫ్రం హోం చేసే ఉద్యోగులకు ఇంటి వాతావరణం పని ఏకాగ్రతపై ప్రతికూల ప్రభావాన్ని చూపకుండా, ఏ రోజు అసైన్‌మెంట్స్ ఆ రోజే పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిట్కాలు...

కరోనా వైరస్ వ్యాప్తి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి. సమావేశాలను, పనికి సంబంధించిన ప్రయాణాలను రద్దు చేయడంతోపాటు స్వచ్ఛందంగా లేదా తప్పనిసరిగా ఇంటి నుంచే పని(వర్క్ ఫ్రం హోం) చేసే విధానాలను అమలు చేస్తున్నాయి. తద్వారా కార్యాలయాల్లో ఉద్యోగులు సమూహాలుగా చేరకుండా జాగ్రత్త పడవచ్చని కంపెనీల భావన. మొదటిసారి వర్క్ ఫ్రం హోం చేసే ఉద్యోగులు కొన్ని సూచనలు పాటిస్తే సమర్థంగా తమ బాధ్యతలు నిర్వహించేందకు అవకాశం ఉంటుంది.

### అనుకూలమైన వర్క్‌స్పేస్

వర్క్ ఫ్రం హోం విషయంలో ప్రధానమైంది అనుకూలమైన వర్క్‌స్పేస్‌ను ఏర్పాటు చేసుకోవ డం. సోఫాపై కూర్చుని లాప్‌టాప్‌లో పని చేయడం కంటే.. అనువైన ఒక డెస్క్, కుర్చీని సమకూర్చుకోవాలి. దీనివల్ల సౌకర్యంగా ఉండ టంతోపాటు పనిపై ఎక్కువ దృష్టి సారించగలు గుతారు. తద్వారా ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పనిచేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

### ఆఫీస్ వాతావరణం

పని చేసేది ఇంటి నుంచే అయినప్పటికీ.. సమయపాలన పాటిస్తూ.. ఎప్పటిలాగే ఆఫీస్ సమయాన్ని పని కోసం తప్పనిసరిగా కేటాయించుకోవాలి. ఇంట్లోనే ఓ చోట ఆఫీస్ వాతావరణం లాంటిది ఏర్పాటుచేసుకోవాలి. చుట్టూ ఆఫీస్ వాతావరణం ఉందని భావించాలి. నిర్ణీత సమయం మీరు పనిచేసే టేబుల్ దగ్గర ఉండేందుకు ప్రయత్నించాలి. అప్పుడే సరైన ఉత్పాదకత సాధించగలుగుతారు. అంతేకాదు ఆఫీసుకు వెళ్ళే ఇతర రోజులాగే దుస్తులు ధరించాలి.

### సరైన నిర్వహణ

పని నుంచి దృష్టి సడలకుండా రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. ఒక్కో లక్ష్యాన్ని నిర్ణీత సమయంలో పూర్తి చేస్తూ ముందుకుసాగాలి. అవసరమైతే గూగుల్ కీప్ మొదలైన టెక్నాలజీ యాప్‌లను ఉపయోగించుకుని ఈ లక్ష్యాలను క్రమబద్ధంగా సాధించాలి.

### కమ్యూనికేషన్

వర్క్ ఫ్రం హోం చేసేటప్పుడు.. టీం లీడర్, సహచరులతో నిత్యం కమ్యూనికేషన్ కొనసాగించాలి. ఆఫీస్‌లో సీనియర్‌తో రోజుకు ఒక్కసారైనా 10 నిమిషాలు ఫోన్‌లో మాట్లాడాలి. తద్వారా ప్రేరణ పొందడంతోపాటు జట్టు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసేలా జాగ్రత్త పడొచ్చు. సహోద్యోగులతో సైతం కేవలం ఇ–మెయిల్‌లోనే టచ్‌లో ఉండకుండా.. కుదిరినప్పుడు కాల్ చేసి తాజా విషయాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రతిరోజూ స్వీయ పనితీరు విశ్లేషణ చేసుకుంటూ ముందుకు సాగాలి.

### ఉత్సాహంగా

ఒక్కోసారి ప్రతికూల అంశాలు, వార్తలు వినాల్సి వచ్చినప్పుడు ధైర్యంగా వ్యవహరించాలి. వాటి గురించే చింతిస్తూ ఆందోళనకు, అనారోగ్యానికి గురికావద్దు. ప్రతికూల మనస్తత్వాన్ని వదిలి ఉత్సాహవంతంగా ఉండాలి. అన్ని విషయాలపై సానుకూలంగా స్పందిస్తూ బృందాన్ని కూడా ఉత్తేజపరచాలి.

### ఆరోగ్యంగా

వర్క్ ఫ్రం హోం చేసేటప్పుడు మానసిక, శారీరక ఆరోగ్యంపై కూడా శ్రద్ధవహించాలి. గంటల కొద్దీ కదలకుండా కూర్చోకుండా.. చిన్న చిన్న విరామాలు తీసుకోవాలి. దినచర్యలో భాగంగా ప్రతిరోజూ ఉదయం యోగా, ధ్యానం వంటివి సాధన చేయొచ్చు. వర్క్‌ఫ్రం హోం ద్వారా లభించే ఖాళీ సమయాన్ని కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఉపయోగించుకోవాలి.

### స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలి!

గతంలో ఐటీ కంపెనీల్లో వర్క్ ఫ్రం హోమ్ కొందరు ఉద్యోగులకే పరిమితమయ్యేది. కానీ ప్రస్తుతం 'కరోనా' కారణంగా ఐటీ కంపెనీలతోపాటు అవకాశం ఉన్నటువంటి చాలా కంపెనీలు ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం అవకాశాన్ని కల్పిస్తున్నాయి. ఇలా ఇంటి నుంచే పనిచేస్తున్న ఉద్యోగులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ.. ఆఫీసులో ఉన్నట్లుగానే భావించి పనిచేయాలి. ఆటంకాలు కలగని పని వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ముఖ్యంగా స్వీయ క్రమశిక్షణను కలిగి ఉండాలి. నిర్ణీత సమయంలో పని ప్రారంభించి.. అప్పగించిన టాస్క్‌లను పూర్తి చేయాలి. క్లయింట్స్‌తో కాల్స్ మాట్లాడాల్సి వస్తే ఒక్కోసారి అదనపు సమయం కేటాయించడానికీ సిద్ధంగా ఉండాలి. అలాంటి సందర్భాల్లో ఇంటర్నెట్ అసౌకర్యాలు కలగకుండా ముందుగానే జాగ్రత్తలు వహించాలి. ఏ రోజు రిపోర్టులు ఆ రోజే సిద్ధం చేసుకోవాలి. మేనేజర్ లేదా పైస్థాయి ఉద్యోగులతో మంచి కమ్యూనికేషన్ సంబంధాలు కొనసాగించాలి.

–బి.అనూరాధ, సీనియర్ కన్సల్టెంట్, ఇన్ఫోసిస్

# కరోనా పడగ

## ప్రపంచవ్యాప్తంగా 10 లక్షలకు చేరువలో కేసులు

**కరోనా కరాళ నృత్యం చేస్తోంది. అగ్రరాజ్యం అమెరికా చిగురుటాకులా వణికిపోతోంది. యూరప్ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయి. ప్రధానంగా ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లలో కరోనా కోరలు చాచింది. ప్రపంచవ్యాప్తంగా 10 లక్షలకు చేరువలో కేసులు ఉండగా కోవిడ్ బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 50 వేలను మించిపోయింది. ఇంతటి ఘోర కలిని ఊహించని ప్రపంచ దేశాలు దీనిని ఎలా ఎదుర్కోవాలో తెలీక గందరగోళంలో పడిపోయాయి.**

వాషింగ్టన్ /పారిస్/రోమ్

**అగ్రరాజ్యానికి ఊపిరాడటం లేదు**

అగ్రరాజ్యం అమెరికాలో రోజురోజుకీ కరోనా కేసులు, మృతుల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. ఇప్పటికే 2 లక్షల 36 వేలకు పైగా కేసులు నమోదైతే, మృతుల సంఖ్య 5,700 చేరుకుంది. న్యూయార్క్ రాష్ట్రంలో ఆరువారాల వయసున్న చిన్నారి మరణించడం అందరినీ కలచివేస్తోంది. అయినా సరే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లాక్‌డౌన్ ప్రకటించడానికి అంగీకరించడం లేదు. ఒకవైపు భారీగా పెరిగిపోతున్న కేసులు, వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో అందించలేకపోవడంతో అగ్రరాజ్యం ఎన్నడూ ఎదుర్కోని సంక్షోభ పరిస్థితుల్లో చిక్కుకుంది. మాస్క్‌లు, గ్లౌవ్స్, శానిటైజర్లు, వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలకి కొరత ఉందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ అధికారులు వెల్లడించారు. గత కొన్ని దశాబ్దాల్లో ఈ స్థాయి ముప్పుని అగ్రరాజ్యం ఎప్పుడూ ఎదుర్కోలేదు. దేశవ్యాప్తంగా ఇప్పటికిప్పుడు లాక్‌డౌన్ నిర్ణయాన్ని అమలు చేసినప్పటికీ అమెరికాలో లక్ష



నిర్మానుష్యంగా వాషింగ్టన్‌లోని రహదారి

నుంచి 2 లక్షల మంది వరకు మరణించవచ్చునని కరోనాపై పోరాటానికి వైట్‌హౌస్ ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ అంచనా వేస్తోంది. అయితే ప్రజలు ఇంటిపట్టునే ఉండేలా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చర్యలు తీసుకుంది. 33 కోట్ల మంది జనాభా ఉన్న అమెరికాలో గత నెల రోజులుగా 27 కోట్ల మంది ఇంటిపట్టునే ఉంటున్నారు. విద్యాసంస్థలన్నీ మూసివేశారు. రవాణా, పర్యాటక రంగాలు స్తంభించాయి.

**భారత్‌లో ఉన్న అమెరికన్లు వెనక్కి**

కరోనా ముప్పుతో వివిధ దేశాలు అంతర్జాతీయ సరిహద్దుల్ని మూసివేయడంతో దాదాపుగా 30 వేల మందికి పైగా అమెరికా పౌరులు ఇతర దేశాల్లో చిక్కుకుపోయారు. వారిని వెనక్కి రప్పించడానికి అమెరికా ఏర్పాట్లు చేస్తోంది. భారత్‌లో ఉన్న అమెరికన్లు తిరిగి స్వదేశానికి తీసుకువచ్చే ప్రయత్నాలు మొదలుపెట్టింది.

భారత్ లాక్‌డౌన్ సమయంలో అక్కడే ఉండిపోయిన ఈ తరుణంలో భారత ప్రభుత్వం తమకు చాలా సాయం చేస్తోందని అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ వారాంతం నుంచి న్యూఢిల్లీ, ముంబై నుంచి ప్రత్యేక విమానాలు ఏర్పాటు చేసి అమెరికన్లను వెనక్కి తెస్తామని తెలిపింది.

**స్పెయిన్‌లో ఒక్కరోజే 950 మంది..**

ఆరోగ్య సదుపాయాలు పటిష్టంగా ఉండే స్పెయిన్‌లో ఒక్కరోజే 950 మంది మరణించారు. దీంతో మృతుల సంఖ్య పదివేలు దాటి పోయింది. ఇక కేసుల విషయానికి వస్తే లక్షా 10 వేలు దాటిపోయాయి. అయితే గత వారంతో పోల్చి చూస్తే కేసుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టిందనే చెప్పాలి.

- బ్రిటన్, ఫ్రాన్స్‌లో మృతుల సంఖ్య ఎక్కువవుతూ ఉంటే, ఇటలీలో కేసులు, మృతుల సంఖ్య కాస్త తగ్గుముఖం పడుతోంది.
- తమ దేశంలో ఒక్క కరోనా వైరస్ కేసు కూడా నమోదు కాలేదని ఉత్తర కొరియా ప్రకటించింది. చైనాలో కొత్త వ్యాధి బయటకు వచ్చిందని తెలియగానే జనవరిలోనే తాము సరిహద్దులన్నింటినీ మూసేశామని, అందుకే ఒక్క కేసు కూడా నమోదు కాలేదని ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు
- కరోనా వైరస్ కారణంగా కేవలం వృద్ధులే ప్రాణాలు కోల్పోతారన్నది వాస్తవం కాదని, యువకుల్లో రోగనిరోధక శక్తి లేని వారు కూడా చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది.

### దేశం గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కోబోతోంది : ట్రంప్

కరోనాపై అన్ని వైపుల నుంచి యుద్ధం చేస్తున్నామని, ఎలాగైనా వైరస్‌పై విజయం సాధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఈ వైరస్ అత్యంత ప్రమాదకరమైనదని పెరిగిపోతున్న కేసుల సంఖ్య చూస్తే తెలుస్తుందన్నారు. ''వైరస్‌పై పోరాటంలో భాగంగా ఎన్నో చర్యలు తీసుకున్నాం. భౌతిక దూరం, పనిచేసేవారికి ఆర్థిక సాయం, వైద్య సదుపాయాలు, విదేశీ ప్రయాణాలు రద్దు, కరోనాకు మందులు, వ్యాక్సిన్ కనిపెట్టే ప్రక్రియలు చేపట్టడం వంటివన్నీ ఎన్నో చేశాం. మరే దేశానికంటే ముందే ఈ చర్యలన్నీ తీసుకున్నాం''అని ట్రంప్ మీడియాతో పేర్కొన్నారు. ''రాబోయే రోజుల్లో దేశం చాలా గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కోబోతోంది. రెండు మూడు వారాలు చాలా సంక్లిష్టమైన కాలం. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొనే సమయంలో అమెరికన్లు ఎప్పుడూ కుంగిపోరు. భయపడిపోరు. కలసికట్టుగా ఎదుర్కొంటారు' అని అన్నారు.




## లాక్‌డౌన్ ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు

**న్యూఢిల్లీ:** ఏప్రిల్ 14వ తేదీ వరకూ ఉన్న దేశవ్యాప్త లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై, తప్పుడు ప్రకటనలు చేసేవారిపై రాష్ట్రాలు భారతీయ శిక్షాస్మృతి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్‌ల కింద కేసులు పెట్టవచ్చునని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు హోం శాఖ కార్యదర్శి రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ఒక లేఖ రాశారు. లాక్‌డౌన్ మార్గదర్శకాలు మార్చి 24న జారీ అయ్యాయని, వీటిని ఉల్లంఘించిన వారిపై 2005 నాటి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చట్టంలోని 51వ సెక్షన్ నుంచి 60 సెక్షన్ వరకూ అన్నీ వర్తిస్తాయని స్పష్టంగా ఉందని హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా ఆ లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా ఐపీసీలోని సెక్షన్ 188 కింద కూడా ఉల్లంఘనకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు. ఈ రెండు చట్టాలకు సంబంధించిన శిక్షల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. లాక్‌డౌన్‌ను అమలు చేసే ప్రయత్నాలను అడ్డుకునే వారికి రెండేళ్ల జైలు శిక్ష విధించే అవకాశముందని, తప్పుడు ప్రకటనలు చేసేవారికి కూడా రెండేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించవచ్చునని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో నిధులు, వస్తు సామగ్రి దుర్వినియోగం చేస్తే కూడా రెండేళ్ల జైలు, జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

## కరోనాకు 53 మంది బలి

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కరోనా వైరస్ కారణంగా ఇప్పటివరకూ 53 మంది ప్రాణాలు కోల్పోగా సుమారు 2,069 మందికి వైరస్ సోకినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ గురువారం తెలిపింది. వైరస్ బారిన పడ్డ వారిలో 155 మందికి నయం కావడం లేదా డిశ్చార్జ్ అయిపోవడం లేదా వలస వెళ్లిపోవడంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కోవిడ్–19 బాధితుల సంఖ్య 1,860గా ఉందని ఆరోగ్య శాఖ తెలిపింది. కోవిడ్ కారణంగా గత 24 గంటల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారని, వీరిలో మహారాష్ట్రకు చెందిన వారు నలుగురు కాగా, మధ్య ప్రదేశ్‌కు చెందిన వారు ముగ్గురని, పంజాబ్ నుంచి ఒక్కరు ఉన్నారని తెలుస్తోంది. కోవిడ్ కారణంగా ఇప్పటి వరకూ మహారాష్ట్రలో 13 మంది, గుజరాత్, మధ్యప్రదేశ్‌లలో ఆరుగురు చొప్పున, పంజాబ్‌లో నలుగురు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లలో ముగ్గురు చొప్పున, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్, ఉత్తర ప్రదేశ్, కేరళల్లో ఇద్దరు చొప్పున, తమిళనాడు, బిహార్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**మహారాష్ట్రలో బాధితులు ఎక్కువ...**

కోవిడ్ బారిన పడ్డవారిలో సుమారు 335 మంది మహారాష్ట్రకు చెందిన వారు కాగా, కేరళలో 265 మంది ఉన్నారు. అలాగే తమిళనాడులో మొత్తం 234 మందికి వైరస్ సోకింది. ఢిల్లీలో బాధితుల సంఖ్య 152కు చేరుకోగా, ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఖ్య 113గా ఉంది. కర్ణాటకలో ఇప్పటివరకూ కోవిడ్ బారిన పడ్డవారు 110 మంది ఉన్నారు. రాజస్తాన్‌లో 108 మంది, మధ్యప్రదేశ్‌లో 99 మంది, గుజరాత్‌లో 82 మంది, జమ్మూ కశ్మీర్‌లో 62 మంది వైరస్ బారిన పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పంజాబ్‌లో 46 కేసులను గుర్తించగా, హరియాణాలోనూ 43 మంది వైరస్ బారిన పడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో 37 మంది, బిహార్‌లో 23 మంది చండీగఢ్‌లో 16 మంది, లడాఖ్‌లో 13 మంది కోవిడ్ బాధితులు ఉండగా, అండమాన్ నికోబార్ దీవుల నుంచి పది మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం తొమ్మిది మందికి వైరస్ సోకింది. ఉత్తరాఖండ్‌లో ఏడుగురు, గోవాలో ఐదుగురు కరోనా బారిన పడినట్లు అధికారులు చెబుతున్నారు. ఒరిస్సాలోనూ నాలుగు కోవిడ్ కేసులు ఉన్నాయని పుదుచ్చేరి, హిమాచల్ ప్రదేశ్‌లలో ముగ్గురు చొప్పున కోవిడ్ బారిన పడ్డారని గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా, ఈశాన్యరాష్ట్రాలు అస్సాం, జార్ఖండ్, మిజోరం, మణిపూర్‌లలో ఒక్కోటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

### క్లుప్తంగా...

**నేడు ప్రధాని మోదీ వీడియో సందేశం**

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తి, దేశవ్యాప్త లాక్‌డౌన్‌ల నేపథ్యంలో శుక్రవారం ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి వీడియో సందేశం ఇవ్వనున్నారు. 'రేపు ఉదయం 9 గంటలకు సహచర భారతీయులతో ఒక చిన్న వీడియో సందేశాన్ని పంచుకుంటాను' అని గురువారం ప్రధాని ట్వీట్ చేశారు. అయితే, ఆ సందేశం దేనికి సంబంధించినదనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.

**పీఎం–జీకేవై పంపిణీ సజావుగా జరపాలి**

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన(పీఎం–జీకేవై) మంజూరుచేసిన రూ.27,500 కోట్లను లబ్ధిదారులకు సజావుగా పంపిణీ అయ్యేలా చూడాలని కేంద్రం కోరింది. హోం శాఖ కార్యదర్శి అజయ్ భల్లా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఈ మేరకు లేఖ రాశారు. శుక్రవారం నుంచి బ్యాంకుల్లో మొదలయ్యే నగదు పంపిణీ సమయంలో ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులు గుమికూడకుండా వ్యక్తిగత దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అన్ని బ్యాంకుల శాఖలు, ఏటీఎంల వద్ద శాంతి భద్రతల నిర్వహణకు అవసరమైన భద్రతా సిబ్బందిని నియమించాలన్నారు.

**జూమ్ యాప్‌తో జర భద్రం**

**న్యూఢిల్లీ:** కోవిడ్ కల్లోలం నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నవారికి కొత్త సమస్యలు వచ్చిపడ్డాయి. వివిధ కార్యాలయాలు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి వీలుగా అత్యధికులు జూమ్ అనే వీడియో కాన్ఫరెన్స్ అప్లికేషన్‌ను వినియోగిస్తున్నారు. ఈ యాప్‌తో సైబర్ భద్రతా సమస్యలు ఉత్పన్నమవుతాయని, చాలా జాగ్రత్తగా ఉండాలని సైబర్ దాడుల నుంచి రక్షణ జాతీయ సంస్థ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ ఆఫ్ ఇండియా (సీఈఆర్‌టీ–ఇన్) హెచ్చరించింది. ఈ జూమ్ అప్లికేషన్ వినియోగదారుల నుంచి సైబర్ నేరగాళ్లకు కార్యాలయాలకు సంబంధించిన కీలక సమాచారం అందిపోయే అవకాశాలు అత్యధికంగా ఉన్నాయని ఆ సంస్థ తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను సులువుగా హ్యాక్ చేసి సమాచారాన్ని, సంభాషణలను తెలుసుకునే అవకాశాలున్నాయని ఆ సంస్థ వెల్లడించింది.

**రాజ్యసభ కొత్త సభ్యుల ప్రమాణ స్వీకారం వాయిదా**

**న్యూఢిల్లీ:** రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన 37 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం వాయిదా పడింది. దేశవ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్య నాయుడు వెల్లడించారు. రాజ్యసభకు 55 సీట్లు ఖాళీ కాగా 37 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. 'ప్రమాణస్వీకారానికి గాను నూతనంగా ఎన్నికైన సభ్యులను లాక్‌డౌన్ ఎత్తివేసే వరకు వేచి ఉండాల్సిందిగా కోరుతున్నాం' అని రాజ్యసభ చైర్మన్ ఒక అడ్వైజరీలో సూచించారు. కొత్తగా ఎన్నికైన వారికి ప్రభుత్వ పరంగా అందాల్సిన జీతభత్యాలన్నీ వారు ఎన్నికైనట్లు ప్రకటించిన నాటి నుంచి వర్తిస్తాయని అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేసి సభలో తన స్థానంలో కూర్చోవాలి. అయితే, ఇందుకు కాలపరిమితి అంటూ ఏదీ లేదు.

# దశలవారీగా లాక్‌డౌన్ ఎత్తివేత!

- ఏప్రిల్ 14 తర్వాత ప్రారంభించేందుకు సమాలోచన
- లాక్‌డౌన్ తరువాత నిష్క్రమణ వ్యూహంపై సూచనలు చేయండి
- ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని మోదీ
- మోదీ నాయకత్వ ప్రతిభకు ముఖ్యమంత్రుల ప్రశంసలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ, మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే దిశగా మార్చి 25 నుంచి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న లాక్‌డౌన్‌ను ఎత్తివేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకేతాలిచ్చారు. లాక్‌డౌన్ కాలపరిమితి ముగిసిన ఏప్రిల్ 14 తరువాత ఈ దేశవ్యాప్త దిగ్బంధాన్ని దశలవారీగా ఎత్తివేసే దిశగా ఆలోచిస్తున్నట్లు గురువారం ముఖ్యమంత్రులతో జరిపిన వీడియో కాన్ఫెరెన్స్‌లో వెల్లడించారు. ఏప్రిల్ 14 వరకు పూర్తిస్థాయిలో లాక్‌డౌన్‌ను అమలు చేసి, ఆ తరువాత పరిస్థితులను బేరీజు వేసుకుంటూ దశలవారీగా ఎత్తివేసేందుకు ఒక నిష్క్రమణ వ్యూహాన్ని రూపొందించాల్సి ఉందని సీఎంలతో ఆయన వ్యాఖ్యానించారు. అందుకు అవసరమైన సూచనలను ఇవ్వాల్సిందిగా ఆయన సీఎంలను కోరారు. సాధారణ స్థితి నెలకొనేవరకు సమన్వయ పూరిత నిష్క్రమణ వ్యూహాన్ని అమలు చేయాలన్నారు. అలాగే, కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు రానున్న వారాల్లో నిర్ధారణ పరీక్షల నిర్వహణ(టెస్ట్), అనుమానితుల గుర్తింపు(ట్రేస్), వారిని ఐసోలేట్ చేయడం, క్వారంటైన్ చేయడం అనే అంశాలపై నిశిత దృష్టి పెట్టాలని మోదీ రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. ప్రాణ నష్టాన్ని అత్యంత కనిష్ట స్థాయికి చేర్చడమే అందరి ఉమ్మడి లక్ష్యం కావాలన్నారు. ఏప్రిల్ 14న లాక్‌డౌన్ కాలం ముగిసిన తరువాత సాధారణ స్థితికి వచ్చేందుకు సమన్వయ పూరిత నిష్క్రమణ వ్యూహాన్ని అమలు చేయాలని, ఆ దిశగా తమకు సూచనలు చేయాలని కోరారు. కరోనా కట్టడి కోసం తీసుకున్న చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన వ్యూహాలు.. తదితర అంశాలపై గురువారం మోదీ వీడియో కాన్ఫెరెన్స్ ద్వారా ముఖ్యమంత్రులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. వైరస్ హాట్ స్పాట్స్‌ను గుర్తించడం, ఆ ప్రాంతాలను నిర్బంధించి, అక్కడి నుంచి వైరస్ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవడాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఈ సందర్భంగా ప్రధాని సీఎంలను ఆదేశించారు. అలాగే, వ్యవసాయం సహా వెసులుబాటు కల్పించిన రంగాల్లోనూ భౌతిక దూరం పాటించడాన్ని తప్పనిసరి చేయాలని కోరారు.

**పరస్పర ప్రశంసలు**

కరోనాపై పోరులో కేంద్రానికి రాష్ట్రాలు అద్భుతంగా సహకరిస్తున్నాయని, అందుకు కృతజ్ఞతలని పీఎం చెప్పారు. రాష్ట్రాల సహకారంతో కరోనాపై పోరులో కొంత విజయం సాధించగలిగామన్నారు. ఈ సందర్భంగా కరోనా వ్యాప్తిని నిరోధించడంలో తాము చేపట్టిన చర్యలను రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానికి వివరించారు. నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లిన వారిని ట్రాక్ చేయడం, సంబంధీకులందరినీ క్వారంటైన్ చేయడం, ప్రజలంతా లాక్‌డౌన్‌ను కచ్చితంగా పాటించేలా చూడటం, ఔషధాలు ఇతర నిత్యావసరాలను అందుబాటులో ఉంచడం సహా.. తమ ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను వివరించారు. ఈ వైరస్‌పై పోరులో ఆర్థికంగా, వైద్యపరంగా వనరులనందించి రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని కోరారు. కరోనాపై పోరాటంలో ప్రధాని చూపిన నాయకత్వ ప్రతిభను ఈ సందర్భంగా పలు రాష్ట్రాల సీఎంలు కొనియాడారు. సరైన సమయంలో సాహసోపేతంగా లాక్‌డౌన్ నిర్ణయం తీసుకున్నారని, ఈ సంక్షోభ సమయంలో క్రమం తప్పకుండా రాష్ట్రాలకు సూచనలు, సలహాలు ఇచ్చారని ప్రశంసలు కురిపించారు.

**నిత్యావసరాలపై దృష్టి**

అంతర్జాతీయంగా ఈ వైరస్‌పై పోరు అంత ఆశాజనకంగా లేదని ప్రధాని వ్యాఖ్యానించారు. కొన్ని దేశాల్లో రెండో సారి వైరస్ విజృంభించే అవకాశాలున్నాయన్న వార్తలు వస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఔషధాలు సహా అత్యవసర వైద్య ఉత్పత్తులను, వాటి తయారీకి అవసరమైన ముడి పదార్థాలను అందుబాటులో ఉంచడంపై దృష్టి పెట్టాలన్నారు. కోవిడ్–19 పేషెంట్ల కోసం ప్రత్యేక ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, దేశవ్యాప్తంగా శాంతిభద్రతలు అదుపు తప్పకుండా చూడాలన్నారు. కోవిడ్ 19 మన విశ్వాసాలపై దాడి చేసి, మన జీవితాలను ప్రమాదంలోకి నెట్టేసిందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్, హోంమంత్రి అమిత్ షా, పలు కీలక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొన్ని రాష్ట్రాల్లో మరింత కఠినంగా లాక్‌డౌన్‌ను అమలు చేయాల్సి ఉందని అమిత్ షా వ్యాఖ్యానించారు. ఢిల్లీలో జరిగిన తబ్లిగి జమాత్ సహా దేశంలో కోవిడ్–19 కేసుల విస్తరణకు కారణాలను కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి ప్రీతి సుదాన్ వివరించారు. కేసులు భారీగా నమోదైన జిల్లాలపై దృష్టి పెట్టాలని, అక్కడి నుంచి వైరస్ వ్యాప్తి చెందకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రులతోపాటు ఆయా రాష్ట్రాల హోం మంత్రులు, ఆరోగ్యశాఖ మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, హోంశాఖ, ఆరోగ్య శాఖల కార్యదర్శులు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## ముందుచూపులేని 'లాక్‌డౌన్'

**కేంద్రంపై సోనియాగాంధీ మండిపాటు**

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడం అవసరమే అయినప్పటికీ అమలు విషయంలో మాత్రం కేంద్ర ప్రభుత్వం ప్రణాళికారహితంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఆక్షేపించారు. కేంద్రం తీరుతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది వలస కూలీలు, నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం నిర్వహించారు. మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, నేతలు రాహుల్ గాంధీ, చిదంబరం, గులాం నబీ ఆజాద్, ఏకే ఆంటోనీ, మల్లికార్జున ఖర్గే, అహ్మద్ పటేల్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ తదితరులు పాల్గొన్నారు. కరోనా ఉధృతి నేపథ్యంలో తాజా పరిస్థితిపై చర్చించారు. కరోనా మహమ్మారి వల్ల పేదలు, బలహీనులే ఎక్కువగా ఇక్కట్ల పాలవుతున్నారని సోనియా గాంధీ పేర్కొన్నారు. లక్షలాది మంది వలస కూలీలు వందలాది కిలోమీటర్లు నడుస్తూ వెళ్తున్న దృశ్యాలు తనను కలచివేస్తున్నాయని చెప్పారు. వారికి కనీసం కడుపు నిండా ఆహారం కూడా అందించకపోవడం బాధాకరమన్నారు. ఈ పరిస్థితికి కేంద్రమే కారణమని ఆరోపించారు. కరోనా బాధితులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బందికి అత్యాధునిక రక్షణ పరికరాలను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చాలని సోనియా కోరారు.

# 'తబ్లిగీ'కి వెళ్లిన వారిలో 9 వేల మంది క్వారంటైన్

**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్‌లో జరిగిన తబ్లిగీ జమాత్ సమావేశాలకు హాజరైన వారిలో సుమారు 9,000 మందిని క్వారంటైన్‌లో ఉంచినట్లు కేంద్ర హోం శాఖ గురువారం ప్రకటించింది. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకుగాను తబ్లిగీ సమావేశాల్లో పాల్గొన్న వారిని గుర్తించేందుకు ప్రయత్నాలు జరిగాయని హోంశాఖ జాయింట్ సెక్రెటరీ పుణ్యసలీల శ్రీవాస్తవ చెప్పారు. ''తబ్లిగీ సమావేశాలకు హాజరైన 9000 మందిని, వారితో సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించి క్వారంటైన్‌లో ఉంచాం. వీరిలో 1,306 మంది విదేశీయులు ఉన్నారు. తెలంగాణలో 96 మందిని, ఆంధ్రప్రదేశ్‌లో 24 మంది విదేశీయులను గుర్తించాం'' అని పేర్కొన్నారు. కోవిడ్–19కు సం బంధించిన అధికారిక సమాచారం కోసం సమాచార, ప్రసార శాఖ ఒక ప్రత్యేక విభాగాన్ని నెలకొల్పిందని, pibfactcheck@gmail.com అనే మెయి ల్ అడ్రస్‌కు మెయిల్ పంపడం ద్వారా ప్రజలు అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఢిల్లీలోని నిజాముద్దీన్ మర్కజ్ మసీదులోంచి ఖాళీ చేయించిన వారిలో ఇద్దరు కరోనా కారణంగా గురువారం మరణించారని సీఎం కేజ్రీవాల్ తెలిపారు.

**కరోనాపై అంచనాకు 'ఆరోగ్యసేతు'**

కరోనా వైరస్ సోకే అవకాశాలను ప్రజలు తమంతట తాము అంచనా వేసుకునేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఒక స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్‌ను విడుదల చేసింది. 'ఆరోగ్యసేతు' అని పిలుస్తున్న ఈ అప్లికేషన్ ద్వారా ఎవరైనా కరోనా సోకిన వ్యక్తికి దగ్గరగా వెళితే అధికారులకు తెలియజేయడమూ వీలవుతుంది. ఈ అప్లికేషన్ ద్వారా కొత్తగా వ్యాధి బారిన పడ్డ వారి గురించి తెలుసుకోవచ్చని, వారితో దగ్గరిగా వ్యవహరించిన వారికి అలర్ట్‌లు పంపుతుందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ అప్లికేషన్ ఇంగ్లిష్‌తోపాటు 11 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది.



ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో క్రిమిసంహారిణిని స్ప్రే చేస్తున్న ఫైర్ సిబ్బంది

**దేశాన్ని బట్టి... విమానాలకు అనుమతి**

దేశంలో లాక్‌డౌన్ గడువు ముగిసిన తరువాత అంతర్జాతీయ విమానాల పునరుద్ధరణపై పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటామని పౌర విమానయాన శాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరి తెలిపారు. ఏప్రిల్ 15వ తేదీ తరువాత ఎవరు ఏ దేశం నుంచి వస్తున్నారన్న అంశాల ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

## 960 మంది వీసాల రద్దు

ఢిల్లీలో తబ్లిగీ జమాత్ సమావేశానికి హాజరైన 960 మంది విదేశీయులను బ్లాక్‌లిస్టులో పెట్టామని, వారి వీసాలను సైత రద్దు చేశామని కేంద్ర హోంశాఖ వర్గాలు తెలిపాయి. వారంతా వీసా నిబంధనలను ఉల్లంఘించి, తబ్లిగీ జమాత్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నందుకు ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ఇలాంటి విదేశీయులు భారత్‌లో ఎక్కడున్నా ఫారినర్స్ యాక్ట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ కింద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్ర పోలీసు శాఖలకు ఆదేశాలు జారీ చేసింది.

## టీవీ చానళ్లకు పెరిగిన వీక్షకులు

**ముంబై:** లాక్‌డౌన్ విధించడంతో దేశవ్యాప్తంగా జనమంతా ఇళ్లకే పరిమితమయ్యారు. చాలా మంది టీవీ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. దేశంలో వారం రోజుల్లో టీవీ వీక్షణం రికార్డు స్థాయిలో 37 శాతం పెరిగినట్లు బ్రాడ్‌కాస్టు ఆడియెన్స్ రీసెర్చ్ కౌన్సిల్(బార్క్) గురువారం ప్రకటించింది. లాక్‌డౌన్ కొనసాగినంత కాలం టీవీ వీక్షణం ఇదే స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉందని బార్క్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సునీల్ లుల్లా చెప్పారు. నాన్–ప్రైమ్‌టైమ్‌లోనూ వీక్షకుల సంఖ్య భారీగా పెరుగుతోందని తెలిపారు.

సాక్షి 24|7 నల్లగొండ
NALGONDA DISTRICT
శుక్రవారం | 3 | ఏప్రిల్ | 2020

## జన్‌ధన్ ఖాతాల్లో నగదు జమ

నల్లగొండ టౌన్ : జిల్లాలోని మహిళా జన్‌ధన్ ఖాతాల్లో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ పథకంలో భాగంగా రూ.500 జమ చేస్తున్నారు. గురువారం జిల్లాలోని పలువురి ఖాతాల్లో నగదు జమయ్యాయి. డబ్బులు జమ అయిన వారు ఈ నెల మూడు నుంచి తొమ్మిదో తేదీ వరకు నగదు డ్రా చేసుకోవచ్చు. అకౌంట్ నంబర్ చివర 0, 1 సంఖ్య ఉన్నవారు నేడు, అకౌంట్ నంబర్ చివర 2, 3 సంఖ్య ఉన్నవారు ఈ నెల 4న, 4 ,5 నంబర్లు కలవారు ఈ నెల 7 వ తేదీన, 6,7 సంఖ్య ఉన్నవారు ఈ నెల 8న, 8, 9 సంఖ్య ఉన్న వారు ఈ నెల 9 వ తేదీన నగదు తీసుకోవచ్చు.

## న్యూస్‌రీల్

### కరోనా పరీక్షలకు .. స్వచ్ఛందంగా ముందుకు రండి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



సాక్షిప్రతినిధి, నల్లగొండ : 'కరోనా వ్యాధి ఎవరో ఒకరు ఏ ఒక్క రోజో సృష్టించింది కాదు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చింది. ఎవరైతే జమాత్‌కు వెళ్లివచ్చాక జరిపిన పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి కుటుంబ సభ్యులు, వారు ఎవరెవరిని కలిశారో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలి.' అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన పరీక్షలు చేయించుకోవడానికి ఎవరూ సిగ్గుపడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. కావాలని ఎవరూ ఉద్దేశపూర్వకంగా చేయరని, అనుకోకుండా ప్రపంచాన్ని చుట్టుముట్టిన కరోనా వైరస్ బారిన మీరంతా పడ్డారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి సహరించాలని, తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలని గుత్తా సుఖేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

### ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉండండి

- జిల్లా ప్రజలకు మంత్రి జగదీశ్‌రెడ్డి పిలుపు



సాక్షిప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరోనా (కోవిడ్ –19) పాజిటివ్ కేసులు ఉన్నట్లు తేలడంతో రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. పాజిటివ్ వచ్చిన వారికి అందించాల్సిన చికిత్సల గురించి వాకబు చేశారు. గురువారం ఉదయమే కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్పీ ఏవీ రంగనాథ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావుతో మాట్లాడారు. పాజిటివ్‌గా తేలిన వారు ఇప్పటికే క్యారంటైన్‌లో ఉన్నందున వారి వారి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి క్యారంటైన్‌లకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తుల నివాస ప్రాంతాలకు చెందిన కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, మతపెద్దలతో కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కూడా మంత్రి అధికారులకు సూచించారు. ఈ అంశం సున్నితమైనందున ఏ ఒక్కరినీ నొప్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కరోనా వైరస్ పాజిటివ్ వచ్చిన వారందరూ ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఉన్నారని, అవసరమైన చికిత్సలు అందించేందుకు ఏర్పాట్లు జరిగాయని వివరించారు. వైద్య పరీక్షలకు స్వచ్ఛందంగా సహకరించాలని, అత్యంత ప్రమాదకరమైన ఈ వైరస్ ఒకరినుంచి మరొకరికి సోకడానికి ఎంతో సేపు పట్టదని, స్వీయ నియంత్రణతో కరోనాను మట్టుబెట్టాలని మంత్రి పిలుపు ఇచ్చారు.

### ఖాళీ బస్తాలు పెట్టి..



శాలిగౌరారం : కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు భౌతికదూరం ఒక్కటే శరణ్యమని అధికారులు నెత్తినోరు మొత్తుకుంటున్నా జనం వినడం లేదు. జనాలు గుంపులు, గుంపులుగా నిల్చుంటున్నారు. ఆకారం గ్రామంలో రేషన్ దుకాణానికి వచ్చిన లబ్ధిదారులు ఒకేచోట నిలబడి నిబంధనలకు ఉల్లంఘించగా, వారు బియ్యం తీసుకెళ్లేందుకు వెంట తెచ్చుకున్న ఖాళీ బస్తాలు, సంచులను మాత్రం ఇలా భౌతిక దూరాన్ని పాటిస్తూ క్యూలైన్‌లో పెట్టడం గమనార్హం.

నల్లగొండలోని రామాలయంలో కల్యాణతంతులో భాగంగా మంగళసూత్రాన్ని చూపెడుతున్న అర్చకులు, తలంబ్రాలు పోస్తున్న అర్చకులు, కల్యాణంలో పాల్గొన్న జిల్లా ప్రధాన జడ్జి రమేష్, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి తదితరులు







## నిరాడంబరంగా సీతారామ కల్యాణం

శ్రీరామనవమిని లాక్‌డౌన్ నేపథ్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా నిరాడంబరంగా నిర్వహించారు. రెండో భద్రాద్రిగా పేరొందిన నల్లగొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామ కల్యాణ మహోత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనారాధన, కంకణధారణ చేసి అనంతరం జీలకర్ర బెల్లం తతంగం జరిపించారు. అనంతరం మాంగళ్యధారణ చేశారు. చివరగా తలంబ్రాలను పోసి కల్యాణ తంతు ముగించారు. ఈ కల్యాణోత్సవాన్ని వేదపండితులు భగవాన్ ఆచార్య , ఆలయ అర్చకులు యాద గిరాచార్య, షఠగోపాలాచార్య , రఘునందన్, బట్టాచార్య జరిపించారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా జడ్జి రమేశ్ దంపతులు, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దంపతులు, ఆలయ చైర్మన్ చకిలం వేణుగోపాల్‌రావు, సంధ్యారాణి, ఈఓ రాజేశ్వరశర్మ, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ తదితరులు పాల్గొన్నారు. – నల్లగొండ కల్చరల్

# పాజిటివ్.. ప్రకంపనలు!

## జిల్లాలో ఒకే రోజు ఆరుగురికి కరోనా వైరస్

- ఒకరు మిర్యాలగూడ, ఐదుగురు నల్లగొండ పట్టణవాసులు
- వారి కుటుంబాలకు చెందిన 39మంది క్వారంటైన్‌కు తరలింపు
- పరీక్షల కోసం రక్త నమూనాలను సీసీఎంబీకి పంపిన అధికారులు
- కరోనా పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో కలెక్టర్, ఎస్పీల పరిశీలన
- లాక్‌డౌన్ మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు
- భయం గుప్పిట నల్లగొండ



నల్లగొండ : కరోనా పాజిటివ్ బాధితుల ఇళ్ల వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు



పాజిటివ్ కేసులు నమోదైన కాలనీలు

| | |
|---|---|
| మీర్‌బాగ్ కాలనీ | 02 |
| మాన్యంచెల్క | 01 |
| రెహమాన్‌బాగ్ | 01 |
| బర్కత్‌పుర | 01 |
| మిర్యాలగూడ | 01 |

సాక్షి ప్రతినిధి నల్లగొండ : నల్లగొండ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జిల్లా తొలిసారిగా ఒక్క రోజే ఆరుగురు వ్యక్తులకు కరోనా సోకినట్లు తేలడం సంచలనం సృష్టించింది. రెండు రోజుల కిందట జిల్లా కేంద్రంనుంచి నిజాముద్దీన్ మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారిలో 44మందిని పరీక్షలకు పంపించగా వారిలో 37మంది ఫలితాలు వచ్చాయి. వీరిలో నల్లగొండ పట్టణంలోని ఐదుగురికి, మిర్యాలగూడలో ఒకరికి కరోనా (కోవిడ్ –19) వైరస్ సోకినట్లు (పాజిటివ్) అని తేలింది. కాగా, బుధవారం మరో 17మంది బర్మా దేశస్తులను పరీక్షల కోసం తరలించారు. అంటే మరో 24 మంది రిపోర్టులు అందాల్సి ఉంది. కాగా, కరోనా పాజిటివ్ రిపోర్టు వచ్చిన ఆరుగురిని హైదరాబాద్ క్వారంటైన్‌లో ఉంచారు. నెగిటివ్ వచ్చిన వారిని నల్లగొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ సెంటర్‌లో ఉంచారు.

### పాజిటివ్ వచ్చిన వారి కుటుంబ సభ్యులకూ పరీక్షలు

మర్కజ్ వెళ్లి వచ్చి కరోనా వైరస్ బారిన పడిన ఆరుగురు వ్యక్తులకు చెందిన 39మంది కుటుంబ సభ్యులను పోలీసులు, వైద్యాధికారులు గురువారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలోని క్వారంటైన్‌కు తరలించారు. ఉదయం 5.30 గంటల ప్రాంతంలో పోలీసులు, వైద్య సిబ్బంది వెళ్లి 15 వాహనాల్లో వారందరినీ తీసుకొచ్చారు. వారినుంచి రక్తనమూనాలు సేకరించి సీసీఎంబీకి పంపించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండల్‌రావు తెలిపారు. నల్లగొండ పట్టణంలో కరోనా పాజిటివ్ వచ్చిన ఐదుగురు వ్యక్తుల నివాస ప్రాంతాలను జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఎస్పీ ఏ.వి.రంగనాథ్, ఇతర అధికారులు పరిశీలించారు.

### ప్రజాప్రతినిధులు, మతపెద్దలతో సమావేశం

కరోనా వైరస్ పాజిటివ్ కేసులు రావడంతో జిల్లా యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. జనతా కర్ఫ్యూనుంచి కరోనా వ్యాప్తి నివారణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటూనే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కలెక్టర్ , ఎస్పీలు అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతోపాటు స్వయంగా పర్యటనలు చేస్తూ, పరిశీలిస్తూ వస్తున్నారు. నిజాముద్దీన్ మర్కజ్ ధార్మిక కార్యక్రమానికి వెళ్ళొచ్చిన వారు రాష్ట్రంలో ఆరుగురు మృతి చెందడంతో జిల్లా అధికారులు అలెర్ట్ అయ్యారు. జిల్లానుంచి నిజాముద్దీన్ వెళ్లొచ్చిన వారిని గుర్తించారు. వీరిలోనే ఆరుగురికి కరోనా వైరస్ సోకింది. నల్లగొండలోని ఐదుగురు, మిర్యాలగూడలోని ఒకరి నివాస ప్రాంతాల్లో చేపట్టాల్సిన కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు ఆయా కౌన్సిలర్లు , మతపెద్దలతో సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో పూర్తి లాక్ డౌన్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. ఆ ప్రాంతాలను పూర్తిగా మూసివేసేలా బారికేడ్లను ఏర్పాటు చేయాలని పోలీసులు నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లోని నివాసితులకు అవసరమైన సరుకులు ప్రభుత్వ యంత్రాంగమే అందించేలా చర్యలు తీసుకోనున్నారు. వైరస్ సోకిన వారి కాలనీలను రెడ్‌జోన్లుగా ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు.

### నార్కట్‌పల్లి మండలంలో భయాందోళన

మరోవైపు నార్కట్‌పల్లి మండలంలోనూ భయాందోళనలు నెలకొన్నాయి. కరోనా వైరస్ సోకిన ఆరుగురిలో నల్లగొండకు చెందిన ఓ వ్యక్తి నార్కట్‌పల్లి మండలం మాండ్ర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎస్సెస్సీ పరీక్షలకు ఆయన ఇన్విజిలేటర్‌గా గత నెల 19, 20, 21తేదీల్లో విధులు నిర్వహించారు. మాండ్ర పరీక్ష కేంద్రంలో రెండువందల మందిదాకా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎస్సెస్సీ పరీక్షలకు హాజరయ్యారు. వీరితోపాటు పన్నెండు మంది దాకా ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. దీంతో వీరందరినీ గుర్తించే పనిలో జిల్లా విద్యాశాఖ నిమగ్నమైంది.

### చికిత్స అందించిన వైద్యుడికి అస్వస్థత?

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడకు చెందిన వ్యక్తి నిజాముద్దీన్ మర్కజ్ వెళ్లి వచ్చాక ఒక విందు ఏర్పాటు చేశారని ప్రచారం జరుగుతోంది. ఆ వేడుకకు ఎవరెవరు హాజరయ్యారనే విషయాన్ని తెలుసుకునే పనిలో అధికార యంత్రాంగం ఉంది. ఢిల్లీ నుంచి వచిన తరువాత సదరు మహిళ జలుబు, దగ్గుతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్నట్లు తెలిసింది. ఆ వైద్యుడు సైతం అస్వస్థతకు గురి కావడంతో హైదరాబాద్‌లో వైద్యపరీక్షలు చేయంచుకుని స్థానికంగా క్వారంటైన్‌లో ఉన్నాడనే ప్రచారం జరుగుతుంది. పాజిటివ్ వచ్చిన వారితో కలిసిన వారు ఎవరైనా ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయంచుకుని అధికారులకు సహకరించాలని సీఐ దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కేశా రవి కోరారు.



మిర్యాలగూడ : కరోనా పాజిటివ్ మహిళ కుటుంబ సభ్యులను హైదరాబాద్‌కు తరలిస్తున్న వైద్యసిబ్బంది



## సూర్యాపేటలో తొలి కరోనా

- జిల్లా కేంద్రంలోని కుడకుడ వాసికి పాజిటివ్
- గతనెల 13న మర్కజ్‌కు వెళ్లి వచ్చిన సదరు వ్యక్తి
- హై అలర్ట్ అయిన జిల్లా యంత్రాంగం
- ఆ ప్రాంతమంతా హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారీ

సాక్షిప్రతినిధి, సూర్యాపేట : సూర్యాపేట జిల్లాలో కరోనా తొలి పాజిటివ్ కేసు నమోదైంది. మర్కజ్ మత ప్రార్థనలకు వెళ్లి వచ్చిన కుడకుడకు చెందిన ఓ వ్యక్తికి వైరస్ సోకినట్లు పరీక్షల్లో తేలడంతో జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా అలర్ట్ అయింది. చికిత్స కోసం అతన్ని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇంటికి వచ్చినప్పటి నుంచి అతను ఎవరెవరిని కలిశాడు, ఎక్కడెక్కడ తిరిగారన్న దానిపై పూర్తి స్థాయి సమాచార సేకరణలో అధికారులు నిమగ్నమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా మర్కజ్ ప్రకంపనల కలకలంతో అతన్ని మూడు రోజుల క్రితం చందన నర్సింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు అతన్ని తరలించారు. నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపడంతో పాజిటివ్‌గా తేలింది. అతని కుటుంబ సభ్యులు నలుగురు, అతను కలిసిన మరో 15మందిని క్వారంటైన్‌కు తరలించారు.

### కుడకుడ ఇక.. రెడ్‌జోన్..

కుడకుడలో పాజిటివ్ వచ్చిన వ్యక్తి నివాసం ఉన్న కాలనీని మున్సిపల్, ఇతర శాఖలు అధికారులు వెళ్లి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. సిబ్బంది వెంటనే కాలనీలోని రోడ్లు, ఇళ్లల్లో హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఎవరు కూడా ఇళ్లనుంచి బయటికి రావద్దని ప్రత్యేకంగా ఆటోమైకుల ద్వారా ఈ ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేశారు.

### మెడికల్ షాపు సిబ్బంది ఐసోలేషన్‌కు తరలింపు

కరోనా పాజిటివ్ వ్యక్తి వారం రోజుల క్రితం పట్టణంలోని ఓ మెడికల్ దుకాణంలో మందులు కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో విషయం తెలుసుకున్న కమిషనర్ ఆ ప్రాంతమంతా హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అనంతరం దుకాణాన్ని సీజ్ చేయించి, ఇందులో విధులు నిర్వహించిన ఆరుగురు సిబ్బందిని ఐసోలేషన్‌కు తరలించారు.

# కాలనీల దిగ్బంధం

- కరోనా పాజిటివ్ కాలనీల చుట్టూ బారికేడ్ల ఏర్పాటు
- రాకపోకలు నిషేధం
- విపత్కర పరిస్థితిలో అందరూ సహకరించాలి
- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎస్పీ రంగనాథ్





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఇన్‌సెట్‌లో పాల్గొన్న అధికారులు, మతపెద్దలు



నల్లగొండలోని మీర్‌బాగ్‌కాలనీలో బారికేడ్లు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

నల్లగొండ : కరోనా కట్టడిలో భాగంగా నల్లగొండ పట్టణంలోని కరోనా పాజిటివ్ వచ్చిన వ్యక్తులు నివాసం ఉంటున్న కాలనీలను దిగ్బంధనం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వెల్లడించారు. గురువారం జిల్లాకు చెందిన ఆరుగురు వ్యక్తులకు కరోనా వైరస్ నిర్ధారణ కావడంతో జిల్లా అధికారులు, ఎస్పీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ఆర్‌డీఓ, సంబంధిత కౌన్సిలర్‌లు, మత పెద్దలు, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాజిటివ్ వ్యక్తుల నివాసాలైనా మీర్‌బాగ్‌కాలనీ, బర్కత్‌పుర, మాన్యంచెల్క, రెహమాన్‌బాగ్ కాలనీల చుట్టూ బారికేడ్‌లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేస్తున్నామన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఢిల్లీ నిజాముద్దీన్ మర్కజ్ నుంచి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి కరోనా పాజిటివ్ అని తేలిందని చెప్పారు. మిగిలిన 34 మందికి నెగిటివ్ రావడంతో ఎంజీ యూనివర్సిటీ క్వారంటైన్‌లో ఉంచి, అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. పట్టణంలో వైరస్ వ్యాప్తి చెందకుండా పాజిటివ్ వచ్చిన 39 మంది కుటుంబ సభ్యులను కూడా ప్రభుత్వ ఆస్పత్రి క్వారంటైన్‌కు తరలించి రక్త నమూనాలను సేకరించి హైదరాబాద్‌కు పంపామని పేర్కొన్నారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ఆయా కాలనీల్లో రాకపోకలు నిలిపివేసేందుకు బారికేడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. వారికి నిత్యావసర వస్తువులు, సరుకులతోపాటు, 12 కేజీల బియ్యం డోర్ డెలివరీ చేసి ప్రభుత్వం ఇచ్చే రూ. 1500 కూడా వారి అకౌంట్లలో జమచేస్తామన్నారు. ఆ ప్రాంతాల్లో రాపిడ్ సర్వే టీంల ద్వారా అందరి ఆరోగ్య వివరాలు పరీక్షిస్తారని వారికి సహకరించాలని కోరారు.

### మర్కజ్ వెళ్లొచ్చిన వారు వివరాలివ్వాలి..

మర్కజ్ వెళ్లి వచ్చిన వారు ఇంకా ఎవరైనా ఉంటే వివరాలు తెలియజేయాలని కోరారు. పరీక్షలు చేయించడం వల్ల వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, గ్లౌజ్‌లు, దుస్తులు అందిస్తూ వారికి మనోధైర్యం కలిగించే విధంగా కౌన్సిలర్‌లు, అధికారులు సహకరిస్తారన్నారు. విద్యుత్ మంచినీటి సరఫరాలో అంతరాయం ఉండదని కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే కంట్రోల్‌రూం టోల్‌ఫ్రీ నంబర్ 18004251442 ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నల్లగొండలో 5 పాజిటివ్ కేసులు రావడం బాధాకరమన్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండి వైరస్ వ్యాప్తి చెందకుండా సహకరించాలన్నారు. ఎస్పీ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పాజిటివ్ వచ్చిన కాలనీల్లో కార్డన్ ఆఫ్ విధించామని, ఇంటినుంచి ఎవరూ బయటికి రావద్దని తెలిపారు. కాలనీల్లో పెన్సింగ్‌తో నియంత్రిస్తామని పేర్కొన్నారు. అవసరమైతే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని, పోలీస్ ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆ ప్రాంతంలో వాట్సాప్ గ్రూప్‌లతో చర్యలు తీసుకుంటామన్నారు. ఆ ప్రాంత మత పెద్దలకు కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు.

### ఆ.. 4 ప్రాంతాల్లో హైఅలర్ట్

నల్లగొండ క్రైం : కరోనా వైరస్ నల్లగొండ పట్టణంలో ఐదుగురికి సోకడంతో పోలీస్ అధికారులు మరింత ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గురువారం బర్కత్‌పురా, రహమాన్‌బాగ్, మీర్‌బాగ్‌కాలనీ, మాన్యంచెల్క ప్రాంతాల్లో కరోనా వైరస్ సోకినవారి నివాసాల్లో కెమికల్ పిచికారీ చేశారు. 14 రోజులపాటు ఆ నాలుగు కాలనీల నుంచి ప్రజలు బయటికి రాకుండా ఇతరులు ఆ కాలనీలకు వెళ్లకుండా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. రెడ్ జోన్ తరహాలో జాగ్రత్త చర్యలు చేపట్టారు. నిత్యావసర సరుకులతోపాటు బీపీ, షుగర్ ఇతర మెడిసిన్స్ వివిధ శాఖల అధికారులు సరఫరా చేయనున్నారు. ఏ అవసరం ఉన్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. జిల్లా ఎస్పీ రంగనాథ్ పలు ప్రాంతాల్లో పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐలు బాషా, సురేష్, ఎస్సై నర్సింహులు, ఇతర అధికారులు బారికేడ్‌లను ఏర్పాటుచేసి మార్కింగ్ ఇచ్చారు.

# ఆడంబరాలు దూరమాయే..



సీతమ్మవారిని తీసుకొస్తున్న అర్చకులు



హారాన్ని మెడలో వేస్తున్న అర్చకులు



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు



జీలకర, బెల్లం, ముత్యాలు



పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, అజయ్‌కుమార్ దంపతులు



సీతా, రామ, లక్ష్మణ స్వాములు



వింజామరలు ఊపుతున్న అర్చకులు

గతంలో ఏనాడూ ఎరుగని, ఎవరూ ఊహించని విధంగా భద్రాద్రి రాములోరి కల్యాణం ఎంతో నిరాడంబరంగా జరిగింది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని భక్తులు లేకుండానే పరిమిత సంఖ్యలో వేదపండితులు, అర్చకులు, ఇద్దరు మంత్రులు, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, కొద్దిమంది అధికారుల మధ్య నిర్వహించారు.

నల్లగొండ : సిద్ధార్థ కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..



నల్లగొండ : రామాలయంలో పూజలు చేస్తున్న మహిళలు



## భక్తిశ్రద్ధలతో రాములోరి కల్యాణం

శ్రీరామ నవమి వేడుకలను గురువారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లాక్‌డౌన్ కారణంగా కొద్దిమంది భక్తులతో అర్చకులు ఆలయాల లోపలే సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనారాధన , కంకణధారణ చేసి అనంతరం సీతారాముల తలలపై జిలకర బెల్లాన్ని అలంకరింపచేశారు. మంగళసూత్రాలను రాములవారి కరములకు తాకించి అమ్మవారి మెడకు అర్చకులు అలంకరింపజేశారు. సీతారాముల తలలపై తలంబ్రాలను పోసి కళ్యాణతంతు ముగించారు.



దామరచర్ల : శ్రీకోదండ రామాలయంలో..



కొండమల్లేపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నాగార్జునసాగర్ : రామాలయంలో..



చిట్యాలలో తాళిబొట్టు చూపుతున్న అర్చకులు



హాలియా : రాములోరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే నర్సింహయ్య దంపతులు



నకిరేకల్‌లోని గీతా మందిరంలో..

## ఐదు టన్నుల పుచ్చకాయల పంపిణీ



పుచ్చకాయలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**పెద్దవూర(నాగార్జున సాగర్) :** మండలంలోని పులిచర్ల గ్రామంలో గురువారం గ్రామానికి చెందిన టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దేవసాని శ్రీనివాస్‌రెడ్డి 5 టన్నుల పుచ్చకాయలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దేవసాని లక్ష్మమ్మపుల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## తొమ్మిది వాహనాల సీజ్

**కొండమల్లేపల్లి :** లాక్‌డౌన్ నేపథ్యంలో రాత్రి ఏడు గంటల తర్వాత రోడ్లపైకి వచ్చిన తొమ్మిది వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ ఆదిరెడ్డి గురువారం తెలిపారు. రాత్రి 7 గంటల నుంచి కర్ఫ్యూ ఉన్న నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప రోడ్లపైకి రాకూడదని సూచించారు. అదేవిధంగా కేవలం నిత్యావసర వస్తువులు విక్రయించే వ్యాపార సముదాయాలు తప్ప మిగతా వాణిజ్య సముదాయాల నిర్వాహకులు దుకాణాలను మూసి ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఏడుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## మాస్కుల పంపిణీ



మాస్కులు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్

**హాలియా :** కరోనా వైరస్ కట్టడిలో భాగంగా ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్‌లో హాలియా పట్టణంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్, మున్సిపల్ శాఖ సిబ్బందికి 12వ వార్డు కౌన్సిలర్ చింతల చంద్రారెడ్డి గురువారం రూ. 15 వేల విలువైన మాస్కులను ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా దుర్గా ఎలక్ట్రికల్ షాపు నిర్వాహకులు పొదిల కృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది, మెడికల్ సిబ్బందికి ఉచితంగా కొబ్బరి బొండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నల్లగొండ పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షుడు గౌనీ రమేష్‌యాదవ్, పొదిల కృష్ణ, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కరోనా వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

**నకిరేకల్ :** కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ బాలగోపాల్ కోరారు. స్థానిక మణిసాయి సూపర్ మార్కెట్, ఏవీఎం 1992–93 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థుల సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు, హ్యాండ్ వాష్, డెటాల్ సబ్బులు, టవల్స్ గురువారం అందజేశారు.

# లాక్‌డౌన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

- మధ్యాహ్నం 12 గంటల వరకే అందుబాటులో నిత్యావసర వస్తువులు
- ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు



సీతారాంపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

**మిర్యాలగూడ :** కరోనా వైరస్ (కోవిడ్ –19) వ్యాప్తి నివారణలో భాగంగా మిర్యాలగూడలో లాక్‌డౌన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని సీతారాంపురంలో కరోనా పాజిటివ్ కేసు నమోదు కావడంతో ఆ కుటుంబానికి చెందిన పది మందిని వైద్య ఆరోగ్య సిబ్బంది హైదరాబాద్‌కు తరలించగా ఆ కాలనీని ఆయన సందర్శించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆటో ద్వారా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సీతారాంపురంలో హై అలర్ట్ నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. నిత్యావసర వస్తువులకు కూడా పట్టణంలో మధ్యాహ్నం 12 గంటల వరకే అందుబాటులో ఉంటాయన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఆర్డీఓ రోహిత్‌సింగ్, తహసీల్దార్ గణేష్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్ జానిపాష తదితరులు ఉన్నారు.

## స్వీయ నియంత్రణ పాటించాలి




అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

**కొండమల్లేపల్లి :** ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన కరోనాపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డ్యాన్స్ మాస్టర్ రమేశ్ కరోనా వేషధారణతో అవగాహన కల్పించారు. అదేవిధంగా దేవరకొండ మండలంలోని శేరిపల్లిలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేషన్ బియ్యాన్ని పంపిణీ చేశారు.

## ఊరూరా రేషన్ బియ్యం పంపిణీ

**సాక్షి నెట్‌వర్క్ :** నల్లగొండ జిల్లాలోని మునుగోడు, చిట్యాల, కట్టంగూర్, దామరచర్లతోపాటు, నాగార్జునసాగర్‌లోని పలు వార్డుల్లో, నకిరేకల్‌తోపాటు తదితర గ్రామాల్లో గురువారం ప్రజాప్రతినిధులు 12 కిలోల ఉచిత రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో లబ్ధిదారులు భౌతికదూరం పాటించి బియ్యం తీసుకున్నారు.

## లాక్‌డౌన్‌కు సహకరించాలి

- ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య



రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య

**హాలియా(నాగార్జునసాగర్) :** కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న లాక్‌డౌన్‌కు ప్రతి ఒక్కరూ సహకరించి, ఇళ్లల్లోనే ఉండాలని ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కోరారు. గురువారం హాలియా పట్టణంతో పాటు అనుముల మండలంలోని పలు గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, వైస్ చైర్మన్ నల్లగొండ సుధాకర్, కౌన్సిలర్లు చింతల చంద్రారెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, గౌనీ సుధారాణీరమేష్‌యాదవ్, చింతల దీప్తిచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళం అందజేత



ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నగదును అందజేస్తున్న మధుసూదన్

**చిట్యాల(నకిరేకల్) :** కరోనా మహమ్మారి నియంత్రణకుగాను సీఎం రిలీఫ్ ఫండ్‌కు గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన పలువురు టీఆర్‌ఎస్ నాయకులు 70వేల రూపాయలను నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు గురువారం అందజేశారు. చెరుకు మధుసూదన్ రూ. 25,000, కోయగూర నర్సింహ రూ.20,000, షేక్ మోసీన్ రూ.10,000, మారగోని శివశంకర్ రూ.10,000, బొడిగె బాలరాజు 5,000 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## తాగునీరు లేక ప్రజల ఇబ్బందులు

**రామగిరి(తిప్పర్తి) :** తాగునీరు లేక తిప్పర్తి మండలం గడ్డికొండారం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 రోజుల నుంచి తమ గ్రామానికి కృష్ణా జలాలు రాకపోవడంతో దూరం నుంచి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామ ప్రజలు వాపోతున్నారు. అధికారులను అడిగితే పైప్‌లైన్ పగిలిందని, మోటార్లు నడవడం లేదని సాకులు చెబుతున్నారని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మహవీర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న మహవీర్ ఆస్పత్రి నిర్వాహకులు

**నల్లగొండ కల్చరల్ :** మహవీర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిరాశ్రయులకు, పోలీసులకు గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 100 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ పగడాల దేవేందర్, అల్లావుద్దీన్, పార్వతమ్మ, రాధ, అఖిల్, శివ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు కూరగాయల పంపిణీ

**కట్టంగూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ ప్రకటించడంతో ఈదులూరు సర్పంచ్ ఐతగోని నారాయణ తన మూడు నెలల వేతనంతో గ్రామంలోని నిరుపేదలకు గురువారం ఉచితంగా కూరగాయలు పంపిణీ చేశారు. అదే విధంగా శ్రీసాయి గోసంరక్షణశాల సొసైటీ ఆధ్వర్యంలో మల్లారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలకు కూరగాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తవిడబోయిన భవాని, ఆ సంఘం అధ్యక్షులు తండు సైదులు, దాసరి యాదయ్య తదితరులు ఉన్నారు.

**కేతేపల్లి (నకిరేకల్) :** లాక్‌డౌన్ నేపథ్యంలో మండలంలోని గుడివాడ గ్రామంలోని పేద ప్రజలకు జనసేన, బీజేపీ నాయకులు గురువారం కోడిగుడ్లు, కూరగాయలు పంపిణీ చేశారు.

## సిబ్బందికి ఆహార పొట్లాల పంపిణీ



**మిర్యాలగూడ :** కరోనా వైరస్ (కోవిడ్ –19) వ్యాప్తి నియంత్రణలో భాగంగా లాక్‌డౌన్ నేపథ్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు, వైద్య సిబ్బందికి గురువారం ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ సభ్యులు తిరంశెట్టి కోటేశ్వర్‌రావు, నాగరాజు, చందుయాదవ్, హనుమాన్‌సింగ్, వజ్రం, పునాటి లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

**రెండు వేల మందికి మాస్కులు, శానిటైజర్ల పంపిణీ**

ఆలగడప గ్రామంలో కరోనా వైరస్ వ్యాప్తి నివారణలో భాగంగా రెండు వేల మందికి 1.50 లక్షల రూపాయలు వెచ్చించి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ చెన్నబోయిన శ్రీనివాస్ మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ పరమేష్, ఉప సర్పంచ్ నాగరాజు, చెన్నబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

**SERVICES**

■ వ్యక్తిగత, వ్యవసాయం, ప్రాపర్టీ, బిజినెస్, టేకోవర్, ప్రాజెక్ట్ మరియు సిబిల్ కేసులు వంటి అన్ని రకముల రుణములు ఇవ్వబడును. సంప్ర।। 7838016584. [W-723337]

**BUSINESS OFFER**

■ పుట్టగొడుగుల పెంపకం ద్వారా నిరుద్యోగులు, గృహిణులు, మీ ఇంటి వద్దనే నెలకు అధిక ఆదాయం సంపాదించండి. శిక్షణ ఇచ్చి మీ వద్దకు వచ్చి మేము కొంటాము. స్రవంతి ఉపాధి శిక్షణ కేంద్రం. 93923 71493 [G-732863]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## భౌతిక దూరం పాటించని ప్రజలు



వారాంతపు సంతలో గుంపులుగా ఉన్న ప్రజలు

**మునుగోడు :** కరోనా వైరస్‌ను నివారించేందుకు ప్రభుత్వం లాక్‌డౌన్ ప్రకటించి అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావొద్దని, వచ్చినా విధిగా భౌతిక దూరం పాటించాలని ఆదేశిస్తుంది. అయితే ఆ నిబంధనలు ఏమి మునుగోడు ప్రజలు పాటించడం లేదు. ప్రతి గురువారం జరిగే వారంతపు సంత మునుగోడులో జరుగగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 2వేల మంది సంతకు వచ్చి కూరగాయలను గుంపులు గుంపులుగా ఉండి కొనుగోళ్లు చేశారు.

## పేదలకు బియ్యం, నగదు పంపిణీ

**నాగార్జునసాగర్ :** నందికొండ మున్సిపాలిటీలోని 8, 10 వార్డుల్లో రెక్కాడితేనే డొక్కాడే కూలీలకు ఆయా వార్డు కౌన్సిలర్లు తిరుమల కొండ మోహన్‌రావు,అన్నపూర్ణలు బియ్యం, నగదు పంపిణీ చేశారు. లాక్‌డౌన్ ప్రకటించిన నేపథ్యంలో కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. పూట గడువని పరిస్థితులు దాపురించడంతో ఆయా వార్డులలోగల పేదల జాబితాను తయారు చేసుకొని 300మందికి బియ్యం, నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓర్సు కృష్ణ, స్వామి, అబ్రహం, నర్సింహారావు, ఇర్ల శేఖర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కరోనా నేపథ్యంలో ప్రజాపంపిణీ రేషన్ షాపు ద్వారా కుటుంబానికి 12కిలోల చొప్పున పైలాన్‌కాలనీలో టీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి కౌన్సిలర్లతో కలిసి పంపిణీ ప్రారంభించారు.



8,10 వార్డులలోని కూలీలకు బియ్యం నగదు పంపిణీ చేస్తున్న వార్డు కౌన్సిలర్లు

## పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

**గుర్రంపోడు :** పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కొప్పోలు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ డి.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. కొప్పోలు గ్రామానికి చెందిన మామిడి మమత(28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. తన కూతురి మృతికి అత్తామామ, భర్త నరేష్ వేధింపులే కారణమని ఆరోపిస్తూ మృతురాలి తండ్రి దామెర భీమనపల్లికి చెందిన చెక్క పెంటయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-4-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

| దేశీ సూచీలు (బుధవారం ముగింపు) | సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|---|
| తగ్గుదల ▼ | 1203 | 344 |
| ముగింపు | 28,265 | 8,254 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు (తెల్లవారు రాత్రి 11.30 ముగింపు) | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,435 | ▲ 75 |
| డోజోన్స్ | 21,199 | ▲ 256 |
| ఎఫ్‌టీఎస్ఈ 100 | 5,480 | ▲ 26 |
| డాక్స్ | 9,571 | ▲ 26 |
| షాంఘై | 2,781 | ▲ 46 |
| నికాయ్ | 17,819 | ▲ 247 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 72.28 | 79.40 |
| £ | బ్రిటన్ పౌండ్ | 91.78 | 96.52 |
| € | యూరో | 80.09 | 85.22 |
| ¥ | జపాన్ ఎన్ (100) | 60.00 | 78.00 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | 44.07 | 48.27 |
| SS | సింగపూర్ డాలర్ | 51.33 | 54.99 |
| SAR | సౌదీ రియాల్ | 19.10 | 20.97 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 19.24 | 21.88 |
| ¥ | చైనా యువాన్ | 9.51 | 11.28 |

## వారంటీ పొడిగిస్తున్న ఎలక్ట్రానిక్స్ కంపెనీలు



**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ నేపథ్యంలో ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ తయారీ కంపెనీలు తమ ఉత్పత్తులకు వారంటీని పొడిస్తున్నాయి. వీటిలో శామ్‌సంగ్, వన్‌ప్లస్, ఒప్పో వంటి కంపెనీలు ఉన్నాయి. మార్చి 20 నుంచి ఏప్రిల్ 30 మధ్య ముగిసే అన్ని రకాల ఉత్పత్తులకు మే 31 వరకు వారంటీ పొడిగిస్తున్నట్టు శామ్‌సంగ్ ప్రకటించింది. మార్చి 1 నుంచి మే 30 వరకు ముగిసే వాటికి మే 31 వరకు వారంటీ ఇస్తున్నట్టు వన్ ప్లస్ తెలిపింది. ఒప్పో సైతం ఇదే విధానాన్ని అనుసరిస్తోంది. అలాగే ఆన్‌లైన్ రిపేర్ సర్వీస్‌ను సైతం అందిస్తోంది. పరిస్థితి సర్దుమణగగానే కస్టమర్ల అవసరానికి తగ్గట్టుగా సర్వీసు అందిస్తామని షావొమీ స్పష్టం చేసింది. రియల్‌మీ మే 31 వరకు వారంటీ ఎక్స్‌టెండ్ చేసింది. మార్చి 15–ఏప్రిల్ 30 మధ్య కొనుగోలు చేసిన డివైస్‌లకు రిప్లేస్‌మెంట్ పీరియడ్‌ను అదనంగా 30 రోజులు పొడిగించింది. మార్చి 20 నుంచి మే 20 మధ్య వారంటీ ముగిసే ఉత్పత్తులకు 60 రోజులు పొడిగించినట్టు డీటెల్ వెల్లడించింది. మార్చి 15–మే 15 పీరియడ్‌లో వారంటీ పూర్తి అయ్యే ప్రొడక్టులకు 60 రోజులు ఎక్స్‌టెండ్ చేసినట్టు లావా పేర్కొంది. వారంటీ పీరియడ్‌ను రెండు నెలలు పొడిగించామని టెక్నో, ఇన్‌ఫినిక్స్ ప్రకటించాయి.

## హెల్త్ పాలసీల రెన్యువల్‌కు 21 వరకు గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్త లాక్‌డౌన్ నేపథ్యంలో సంబంధిత కాలంలో గడువు ముగిసే హెల్త్ పాలసీల రెన్యువల్‌కు ఈ నెల 21 వరకు గడువు పొడిగించాలని అన్ని బీమా సంస్థలను బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ కోరింది. ఇందుకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ ఈ నెల 1నే నోటిఫికేషన్‌ను కూడా విడుదల చేసినట్టు తెలిపింది. మార్చి 25 నుంచి ఏప్రిల్ 14 మధ్య గడువు ముగిసే పాలసీలకు ప్రీమియం చెల్లించలేని వారికి ఏప్రిల్ 21 వరకు అవకాశం ఇవ్వాలని సంబంధిత నోటిఫికేషన్‌లో కేంద్రం పేర్కొంది. అలాగే, వాహనదారులు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ పాలసీల ప్రీమియం చెల్లింపునకు కూడా ఏప్రిల్ 21 వరకు గడువు పొడిగించాలని ఆదేశాల్లో కేంద్ర ప్రభుత్వం కోరింది.

# 25 శాతంపైగా పెరిగిన క్రూడ్

### రష్యా–సౌదీ 'ప్రైస్‌వార్' కొలిక్కి వస్తుందన్న ట్రంప్ అంచనాల నేపథ్యం




క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర గురువారం 25 శాతం పైగా పెరిగింది. రష్యా–సౌదీ అరేబియా మధ్య నెలకొన్న 'ప్రైస్‌వార్' ఉపశమించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నట్లు వచ్చిన వార్తలు దీనికి నేపథ్యం. రష్యా, సౌదీలు 10 మిలియన్ బ్యారల్స్ నుంచి 15 మిలియన్ బ్యారల్స్ వరకూ చమురు ఉత్పత్తి కోత నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ట్రంప్ అంచనావేస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఒకేరోజు క్రూడ్ ఆయిల్ ఈ స్థాయిలో పెరగడం ఒక రికార్డు. ఈ వార్తరాసే 10 గంటల సమయంలో బ్రెంట్ క్రూడ్ బ్యారల్ ధర 23% లాభంతో 30.42 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 35.99 డాలర్ల స్థాయినీ చూసింది. ఇక లైట్ స్వీట్ నైమెక్స్ క్రూడ్ ధర 25 శాతం (4.5 డాలర్లు) లాభంతో 25 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా ఒక దశలో 27.30 డాలర్ల స్థాయినీ తాకింది.

**40 డాలర్లకు పైగా పెరిగిన పసిడి...**

ఇకమరోవైపు పసిడి ఔన్స్ (31.1 గ్రా) ధర కూడా న్యూయార్క్ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఈ వార్తరాసే సమయానికి 44 డాలర్లు పెరిగి 1,635 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒకదశలో 1,637 డాలర్లను కూడా చూసింది. కరోనా ప్రభావం అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలపై కొనసాగుతుందన్న అంచనాలు పసిడి పెరుగుదలకు నేపథ్యం.

**లాభాల్లో అమెరికా 'ఈక్విటీ'లు**

మరోవైపు అమెరికా స్టాక్ మార్కెట్లు ఈ వార్తరాసే 10 గంటల సమయంలో కొంత లాభాల్లో ఉండడం గమనార్హం. అయితే ఇది కేవలం షార్ట్ సెల్లింగ్ ప్రభావమని కొందరు విశ్లేషిస్తున్నారు. మార్కెట్లు బులిష్ ధోరణిలోకి వెళ్లే అవకాశం ఇప్పుడు కనబడ్డంలేదన్నది వారి అభిప్రాయం.

## మార్చిలో తయారీకి కరోనా దెబ్బ: పీఎంఐ డౌన్



**న్యూఢిల్లీ:** తయారీ రంగంపై కోవిడ్–19 ప్రభావం మార్చిలో తీవ్రంగా కనబడిందని ఐహెచ్‌ఎస్ మార్కిట్ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) స్పష్టం చేసింది. తయారీ పీఎంఐ ఏకంగా 51.8కి పడిపోయింది. ఫిబ్రవరిలో సూచీ 54.5గా ఉంది. బిజినెస్ సెంటిమెంట్ బలహీనంగా ఉండడం, అంతర్జాతీయ డిమాండ్ పడిపోవడం వంటి అంశాలు దీనికి కారణం. నిజానికి పీఎంఐ 50 పాయింట్లపైన ఉంటే అది వృద్ధి ధోరణిగానే భావించడం జరుగుతుంది. ఆ దిగువకు పడిపోతేనే క్షీణతగా పరిగణిస్తారు. దీని ప్రకారం, గడచిన 32 నెలల నుంచీ తయారీ రంగం 50 పాయింట్లపైనే కొనసాగుతోంది.

## ఎన్‌సీడీల ద్వారా 25 వేల కోట్ల సమీకరణ: ఆర్‌ఐఎల్




**న్యూఢిల్లీ:** నాన్ కన్వర్టబుల్ డిబెంచర్స్ (ఎన్‌సీడీ) రూపంలో రూ.25,000 కోట్లు సమీకరించనున్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) ప్రకటించింది. పలు విడతలుగా ప్రైవేటు ప్లేస్‌మెంట్ విధానంలో ఎన్‌సీడీల జారీ ద్వారా రూ.25వేల కోట్ల వరకు నిధులు సమీకరించే ప్రతిపాదనకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపినట్టు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం ఇచ్చింది.

### ముడిచమురు... (బ్యారల్)

| | రాత్రి 11.30కు | బుధవారం ముగింపు |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 24.70 | $ 20.31 |
| బ్రెంట్ | 29.89 | $ 24.74 |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 3-4-2020

| | |
|---|---|
| విశాఖ | 345–00 |
| చిత్తూరు | 363–00 |
| వరంగల్ | 338–00 |
| గోదావరి | 345–00 |
| విజయవాడ | 345–00 |
| 2–4–2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 335–00 |

# రికవరీకి ఏడాది పడుతుంది..

**కరోనా వైరస్ ప్రభావాలపై ప్రజల మనోగతం**
- క్యాన్సర్, ఎయిడ్స్‌ని మించి కరోనాపై భయం
- వెలాసిటీ ఎంఆర్ సర్వేలో వెల్లడి



**హైదరాబాద్:** కరోనా వైరస్ మహమ్మారి ప్రపంచ దేశాలను గడగడలాడిస్తోంది. ఇది ఎప్పటికి వదులుతుందో తెలియక అందరిలోనూ భయాందోళనలు పెరిగిపోతున్నాయి. ఒకవేళ కోవిడ్ 19 అదుపులోకి వచ్చినా.. దీని ప్రతికూల ప్రభావాల నుంచి బైటపడేందుకు కనీసం ఆరు నెలల నుంచి ఏడాది పట్టేస్తుందని దేశీయంగా ప్రజలు భావిస్తున్నారు. అంతే కాదు.. అత్యంత భయంకరమైన వ్యాధుల జాబితాలో క్యాన్సర్, ఎయిడ్స్‌ను కూడా దాటేసి కోవిడ్ 19 టాప్ ప్లేస్‌లో ఉంది. మార్కెట్ రీసెర్చ్, అనాలిసిస్ సంస్థ వెలాసిటీ ఎంఆర్ నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మార్చి 19–20 మధ్య హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై తదితర ప్రధాన నగరాల్లో ఈ ఆన్‌లైన్ సర్వే నిర్వహించారు. ఇందులో 2,100 మంది పాల్గొన్నారు.

**చేతులు కడుక్కుంటున్నారు..**

ఈ సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వృద్ధులు, అనారోగ్యంగా ఉన్న వారు ఎక్కువగా కరోనా వైరస్ బారిన పడే అవకాశం ఉందని 70 శాతం మందిలో అవగాహన ఉన్నట్లు వెల్లడైంది. సక్రమంగా పరిశుభ్రత పాటించి, తగు జాగ్రత్తలు తీసుకుంటే దీని వ్యాప్తిని అరికట్టవచ్చని 63 శాతం మంది అభిప్రాయపడ్డారు. 81 శాతం మంది గతంలో కన్నా మరింత తరచుగా చేతులు కడుక్కుంటున్నారు. 78 శాతం మంది జనసమ్మర్ధం ఉండే ప్రదేశాలకు వెళ్లడం తగ్గించుకున్నారు. భవిష్యత్‌లోనూ విదేశాలకు ప్రయాణించేటప్పుడు ఇదే తీరు పాటించాలని భావిస్తుండటంతో .. జీవనవిధానపరమైన ఈ మార్పులు ఇకపైనా కొనసాగే అవకాశాలే కనిపిస్తున్నాయని వెలాసిటీ ఎంఆర్ ఎండీ, సీఈవో జసల్ షా తెలిపారు.

**బైటతిరగడం మానుకోలేకపోతున్నారు..**

లాక్‌డౌన్, ఆంక్షలు అమలవుతున్నప్పటికీ చాలా మంది.. ఎంత వద్దనుకున్నా తమ రోజువారీ అలవాట్లను మానుకోలేకపోతున్నారు. రద్దీ లేని వేళల్లోనే నిత్యావసరాల కొనుగోళ్లు జరపడం, ప్రజా రవాణా వ్యవస్థ పనిచేస్తున్న ప్రాంతాల్లో దాన్ని ఉపయోగించడం మానుకోలేకపోవడం వంటివి ఇందులో ఉన్నాయి. ఇక, ఉద్యోగ సంబంధ ప్రయాణాలు చేయడం తప్పటం లేదని 46 శాతం మంది తెలిపారు. 25 శాతం మంది తమకు వర్క్ ఫ్రం హోం వెసులుబాటు లభించలేదని పేర్కొన్నారు.

**సర్వేలో మరిన్ని విశేషాలు**

- కోవిడ్–19 సంబంధ సమాచారం తెలుసుకునేందుకు ప్రజలు ఎక్కువగా టీవీ, సోషల్ మీడియా, ఆన్‌లైన్ వెబ్‌సైట్లు, దినపత్రికల (వరుస క్రమంలో)పై ఆధారపడుతున్నారు. ప్రధానంగా విశ్వసనీయ సమాచారం కోసం టీవీలు, దినపత్రికలపై ఆధారపడుతున్నారు.
- వైరస్ వ్యాప్తితో ప్రధానంగా వ్యక్తిగత శుభ్రత, భౌతిక దూరం పాటించడం పెరిగింది.
- దీని వ్యాప్తి నివారించడానికి కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలే తీసుకుందని 87 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- చాలా మంది ప్రయాణ ప్రణాళికలను రద్దు చేసుకోవడంతో ట్రావెల్, టూరిజం రంగాలు అత్యధికంగా దెబ్బతిన్నాయన్న అభిప్రాయం ఉంది. ఇతర త్రా వ్యాపారాలపైనా తీవ్ర ప్రతికూల ప్రభావమే పడిందని 92 శాతం మంది భావిస్తున్నారు.
- తెలిసినవారు ఎదురుపడినప్పుడు షేక్‌హ్యాండ్‌లు, కౌగిలించుకోవడాల్లాంటివి కొంత కాలం పాటు ఆగుతాయని 71 శాతం మంది తెలిపారు. అలాగే, విదేశాలకు వెళ్లేవారు కూడా మరింత జాగ్రత్తగా ఉంటారని అభిప్రాయపడ్డారు.
- వచ్చే ఆరు నెలల నుంచి ఏడాది వ్యవధిలో ప్రపంచం కోవిడ్ 19 ప్రభావాల నుంచి బైటపడగలదని 84% మంది ఆశాభావం వ్యక్తం చేశారు.

## పెరిగిన ఐఫోన్ ధరలు



**న్యూఢిల్లీ:** టెక్నాలజీ కంపెనీ ఆపిల్ తన ఉత్పత్తుల ధరలను పెంచింది. జీఎస్టీ 12 నుంచి 18 శాతానికి పెరగడమే ఈ ధరల సవరణకు కారణం. సవరించిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చాయి. 64 జీబీ ఐఫోన్ 11 ధర రూ.64,900 నుంచి రూ.68,300లకు చేరింది. 64 జీబీ ఎక్స్ఆర్ మోడల్ రూ.2,600 అధికమై రూ.52,500లకు ఎగసింది. 64 జీబీ 11 ప్రో ధర రూ.1,06,600లుగా ఉంది. అంతక్రితం ఈ మోడల్ ధర రూ.1,01,200 ఉండేది. 64 జీబీ 11 ప్రో మ్యాక్స్ రూ.1,11,200 నుంచి రూ.1,17,100కు చేరింది. 32 జీబీ ఐఫోన్ 7 రూ.1,600 పెరిగి రూ.31,500లుగా ఉంది.

**రియల్‌మీ కూడా...**

స్మార్ట్‌ఫోన్స్ తయారీ కంపెనీ రియల్‌మీ తన ఉత్పత్తుల ధరను పెంచింది. జీఎస్టీ పెంపు, రూపాయి పతనం కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. పాత, కొత్త మోడళ్లపై ధరల పెంపు వర్తిస్తుందని కంపెనీ ప్రకటించింది. 2018 తర్వాత ఇలా ధరలను పెంచడం ఇదే తొలిసారి అని స్పష్టం చేసింది. కోవిడ్–19 ప్రభావం స్మార్ట్‌ఫోన్ పరిశ్రమపై తీవ్రంగా పడిందని తెలిపింది. దీంతో సరఫరా కొరతతోపాటు విడిభాగాల ధర అధికమైందని వివరించింది. అటు రూపాయి పతనం కూడా మొబైల్ ధర పెరిగేందుకు కారణమైందని తెలిపింది. జీఎస్టీ పెంపుతో కస్టమర్లపై రూ.15,000 కోట్ల భారం పడుతుందని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ అంచనా వేస్తోంది.

# ముందుంది మరింత గడ్డుకాలం!




- ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి
- కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందే...
- ఉద్యోగాలకు కోత పెట్టకండి
- జీతాల తగ్గింపు, వాయిదాల్లాంటివి ప్రయత్నించండి
- కరోనాపై స్టార్టప్‌లకు వీసీల సూచన

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి కట్టడికి ఉద్దేశించిన 21 రోజుల లాక్‌డౌన్‌తో వ్యాపారాలు కుదేలవుతున్నాయి. స్టార్టప్ సంస్థలు మరింతగా విలవిల్లాడుతున్నాయి. ఈ నేపథ్యంలో మరిన్ని గడ్డు పరిస్థితులు ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని స్టార్టప్‌లకు యాక్సెల్, కలారి, ఎస్ఏఐఎఫ్ పార్ట్‌నర్స్, సెకోయా వంటి వెంచర్ క్యాపిటల్ (వీసీ) సంస్థలు సూచించాయి. కష్టకాలంలో ఉద్యోగాలకు కోత పెట్టకుండా ప్రత్యామ్నాయాలు అన్వేషించాలని పేర్కొన్నాయి. జీతాలు వాయిదా లేదా తగ్గించడం వంటివి పరిశీలించాలని సూచించాయి. వీసీలు ఈ మేరకు స్టార్టప్‌లకు బహిరంగ లేఖ రాశాయి. వచ్చే 21–30 రోజుల్లో అంకుర సంస్థల వ్యవస్థాపకులు ప్రణాళికల అమలుకు సంబంధించి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని, వచ్చే ఏడాది–ఏడాదిన్నర కాలానికి ఎలా ప్రణాళిలు వేసుకోవాలన్న దానిపై తీవ్రంగా కసరత్తు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. లాక్‌డౌన్ కారణంగా వ్యాపారాలు కుదేలవడంతో వ్యయాలను తగ్గించుకునేందుకు, గడ్డుకాలం గట్టెక్కేందుకు పలు స్టార్టప్ సంస్థలు, డిజిటల్ వ్యాపార సంస్థలు.. సిబ్బందిని తొలగిస్తుండటం, జీతాల్లో కోత పెడుతుండటం తదితర పరిణామాల నేపథ్యంలో తాజాగా వీసీల సూచనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**వేచి చూసే ధోరణి వద్దు ..**

'భారత్‌లో తొలి దశ ఇన్వెస్టర్లుగా .. మేమంతా దేశీ స్టార్టప్ వ్యవస్థ దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై చాలా ఆశావహంగా ఉన్నాం. మేం ఇన్వెస్ట్ చేసిన సంస్థల వ్యవస్థాపకులు, టీమ్‌లపై పూర్తి నమ్మకంతో ఉన్నాం. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నుంచి వారంతా బైటపడాలని కోరుకుంటున్నాము' అని లేఖలో వీసీ సంస్థలు పేర్కొన్నాయి. నిధుల సమీకరణ, ఉద్యోగుల నిర్వహణ, వ్యాపారాన్ని కొనసాగించే ప్రణాళికలు మొదలుకుని ఇన్వెస్టర్లు, వివిధ వాటాదారులతో వ్యవహరించాల్సిన తీరు గురించి ఇందులో పలు సలహాలు, సూచనలు చేశాయి. స్థూలంగా దేశంలో పరిస్థితులు మారిపోతూ ఉన్నాయని ఎప్పటికప్పుడు వాటికి అనుగుణంగా మార్పులు చేసుకోగలగడం స్టార్టప్‌లకు చాలా కీలకమని పేర్కొన్నాయి. 'అత్యంత దారుణ పరిస్థితులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి. ఒకవేళ పరిస్థితి వేగంగా మెరుగుపడిన పక్షంలో దానికి తగ్గట్లుగా సర్దుకుపోవడానికి కూడా సంసిద్ధత ఉండాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో స్పష్టత వస్తుందనే ఆశతో.. వేచి చూద్దాం, స్పష్టత వచ్చాకే ఏదో ఒక చర్య తీసుకుందాంలే అనే ధోరణి సరికాదు' అని వెంచర్ క్యాపిటల్ సంస్థలు సూచించాయి.

**ఉద్యోగులు ముఖ్యం...**

ఈ సందర్భంగా ఏయే అంశాలకు అత్యంత ప్రాధాన్యమివ్వాలన్నదీ వీసీలు వివరించాయి. 'ముందు ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాతే వ్యాపారాల కొనసాగింపు, లిక్విడిటీ ఉండాలి ' అని పేర్కొన్నాయి. మిగతా వ్యయాలన్నింటినీ సమీక్షించుకుని, తగ్గించుకున్న తర్వాతే సిబ్బంది వ్యయాలపై దృష్టి పెట్టాలన్నాయి. సిబ్బంది తొలగింపు, జీతాల తగ్గింపు వంటి అంశాల విషయంలో ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తెలుసుకుంటూ అప్‌డేట్ అవుతూ ఉండాలని సూచించాయి. ఒకవేళ ఉద్యోగులపరమైన వ్యయాలను తగ్గించుకోవాల్సి వస్తే.. రిక్రూట్‌మెంట్‌ను తాత్కాలికంగా ఆపడం, జీతాలు వాయిదా వేయడం.. తగ్గించడం, విధుల్లో మార్పుచేర్పులు చేయడం, ప్రమోషన్లు వంటి మదింపు విధానాలను సవరించుకోవడం వంటి ప్రత్యామ్నాయ అవకాశాలు పరిశీలించాలని తెలిపాయి.

## ఐదో అతిపెద్ద బ్యాంక్ యూబీఐ

**ఏటీఎం వినియోగంలో అదనపు చార్జీలుండవు**

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)లో ఆంధ్రా, కార్పొరేషన్ బ్యాంక్‌ల విలీనం (అమాల్గమేషన్) తర్వాత దేశంలో ఐదో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా యూబీఐ అవతరించిందని ఎండీ అండ్ సీఈఓ రాజ్‌కిరణ్ రాయ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం యూబీఐకు దేశవ్యాప్తంగా 9,500 బ్రాంచీలు, 13,500 ఏటీఎంలు, 120 మిలియన్ల మంది కస్టమర్లున్నారని పేర్కొన్నారు. ఆంధ్రా, కార్పొరేషన్ బ్యాంక్‌ల వినియోగదారులు తమ డెబిట్ కార్డ్‌లను యూబీఐ ఏటీఎంలలో వినియోగించినా సరే ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని చెప్పారు. కస్టమర్ల ఖాతా నంబరు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్, డెబిట్, క్రెడిట్ కార్డ్‌లు, ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ పోర్టల్స్‌లో ఎలాంటి మార్పులు ఉండవని.. గతంలో మాదిరిగానే వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు. నగదు ఉపసంహరణ, నిల్వ, బ్యాలెన్స్ ఎంక్వైరీ వంటి బేసిక్ సర్వీస్‌లను మూడింట్లో ఏ బ్యాంక్‌లోనైనా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

## శాండోజ్ కొనుగోలు ఒప్పందం రద్దు

**అరబిందో–శాండోజ్ పరస్పర అంగీకారం**




**న్యూఢిల్లీ:** అమెరికాకు చెందిన ప్రముఖ జనరిక్ ఫార్మా కంపెనీ శాండోజ్‌ను కొనుగోలు చేసే ఒప్పందాన్ని అరబిందో ఫార్మా రద్దు చేసుకుంది. అనుకున్న సమయంలోగా యూఎస్ ఫెడరల్ ట్రేడ్ కమిషన్ నుంచి అనుమతి రాకపోవడంతో ఇరు కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అరబిందో ఫార్మా తెలిపింది. నోవార్టిస్ కంపెనీకి చెందిన శాండోజ్ అమెరికాలో జనరిక్ ఔషధాలు, బయోసిమిలర్ ఔషధాల్లో దిగ్గజ కంపెనీగా ఉంది. నోవార్టిస్ డివిజన్‌గా ఉన్న శాండోజ్ ఐఎన్‌సీ వాణిజ్య కార్యకలాపాలను, మూడు తయారీ కేంద్రాలను 900 మిలియన్ డాలర్లతో సొంతం చేసుకునేందుకు అరబిందో ఫార్మా 2018 సెప్టెంబర్‌లో ఒప్పందం చేసుకోవడం గమనార్హం. అమెరికాలో తన సొంత సబ్సిడరీ కంపెనీ అరబిందో ఫార్మా యూఎస్ఏ ఐఎన్‌సీ ద్వారా శాండోజ్‌ను సొంతం చేసుకోవాలనుకుంది. ఇది సఫలమై ఉంటే అమెరికాలో ప్రిస్క్రిప్షన్ ఔషధాల పరంగా రెండో అతిపెద్ద జనరిక్ ఔషధ కంపెనీగా అరబిందో అవతరించి ఉండేది.

# నిత్యావసరాలకు ఆందోళన వద్దు

- 2–3 వారాల నిల్వ ఉంది
- రిటైలర్స్ అసోసియేషన్ వెల్లడి...



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ నేపథ్యంలో వినియోగదారులు నిత్యావసర వస్తువుల కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. విక్రేతల వద్ద సరిపడ నిల్వ ఉందని రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఏఐ) తెలిపింది. స్పెన్సర్, వీ–మార్ట్ వంటి కొన్ని కొన్ని సంఘటిత రిటైలర్లు పలు రకాల సరుకుల మీద నియంత్రణ పెట్టారని ఆర్ఏఐ సీఈఓ కుమార్ రాజగోపాలన్ తెలిపారు. లాక్‌డౌన్ నేపథ్యంలో సరుకుల సరఫరా మీద ప్రభావం ఉందని స్పెన్సర్ రిటైల్ ఎండీ దేవేంద్ర చావ్లా తెలిపారు. 'ప్రస్తుతం మా స్టోర్లలో నిత్యావసరాల పూర్తి స్థాయి స్టాక్ ఉంది. కొన్ని రకాల బ్రాండ్ల తయారీ సంస్థలతో మాట్లాడుతున్నాం. త్వరలోనే అవి కూడా అందుబాటులోకి వస్తాయి' అని పేర్కొన్నారు.

**కొనుగోళ్ల మీద నియంత్రణ..**

గ్రాసరీల నిల్వ సరిపడా ఉన్నా సరే ఫ్యూచర్ గ్రూప్‌నకు చెందిన ఫుడ్ అండ్ గ్రాసరీ స్టోర్ చెయిన్ ఈజీడే క్లబ్, వీ–మార్ట్ కొనుగోళ్ల మీద నియంత్రణ పెట్టాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని వీ–మార్ట్ స్టోర్లలోనూ సరుకుల కొరత లేదని, వినియోగదారులు కొనుగోలు మీద నియంత్రణ పెట్టామని వీ–మార్ట్ రిటైల్ చైర్మన్ అండ్ ఎండీ లలిత్ అగర్వాల్ తెలిపారు. ఉదాహరణకు బియ్యం 20 కిలోలు, పిండి 10 కిలోలు, పప్పు దినుసులు 4 కిలోలు, బిస్కెట్స్ 12 ప్యాకెట్లు, చక్కెర 5 కిలోలు మాత్రమే కొనుగోలు చేయడానికి వీలుంది. బిగ్ బజార్ స్టోర్లలో ఎలాంటి నియంత్రణ లేదని తెలిపింది.

**కార్మికుల కొరత..**

ఫ్యాక్టరీలలో కార్మికుల కొరత, సరుకుల రవాణా వాహనాల లభ్యత ప్రధాన సవాళ్లుగా మారాయని హెచ్‌యూఎల్, ఐటీసీ, డాబర్ ఇండియా, పార్లే, జీసీపీఎల్, జ్యోతి ల్యాబ్స్ వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీలు తెలిపాయి. వచ్చే 2–3 వారాల పాటు సరిపడే నిత్యావసరాల నిల్వ ఉందని, ఆ తర్వాత తయారీ ప్లాంట్ల కార్యకలాపాలకు, ఆయా ఉత్పత్తుల సరఫరా వాహన అనుమతులకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్నాయి. 'లాక్‌డౌన్ నేపథ్యంలో కొన్ని ప్లాంట్ల ఉత్పత్తి మీద ప్రభావం పడింది. అయినా ఇతరత్రా మార్గాల ద్వారా రోజువారీ అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సాధ్యమైనంత చర్యలు తీసుకుంటున్నాం' అని హెచ్‌యూఎల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాటక్ తెలిపారు. ముడిసరుకుల వాహనాలు, ప్యాకేజింగ్ మెటీరియల్స్ సప్లయి ఆగిందని డాబర్ ఇండియా ఆపరేషన్స్ ఈడీ షారుఖ్ ఖాన్ తెలిపారు. స్థానిక ప్రభుత్వం అనుమతితో కొద్ది మంది కార్మికులతో నిత్యావసర సరుకుల తయారీ ప్లాంట్లలో మాత్రం ఉత్పత్తి కార్యకలాపాలు సాగిస్తున్నామని, పూర్తి స్థాయి అనుమతులకు మరికొంత సమయం పట్టే సూచనలున్నాయని ఐటీసీ తెలిపింది. ఉత్పత్తులకు కొరత రాకుండా ప్రభుత్వ అనుమతులతో 50% కార్మికులు, షిఫ్టుల వారీగా ప్లాంట్ నిర్వహణ చేస్తున్నామని పార్లే తెలిపింది. దేశవ్యాప్తంగా 90 లక్షల ట్రక్స్ ఉండగా.. కేవలం 5% మాత్రమే నడుస్తున్నాయని ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కాంగ్రెస్ (ఏఐఎంటీసీ) తెలిపింది. లాక్‌డౌన్‌తో డ్రైవర్ల కొరతతోపాటూ లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికుల కొరత ఉందని పేర్కొంది.

**ఉబెర్ ద్వారా ఇంటికి సరుకులు**



ట్యాక్సీ సేవల్లో ఉన్న ఉబెర్ తన కస్టమర్లకు కావాల్సిన సరుకులను డెలివరీ చేయనుంది. బిగ్‌బాస్కెట్‌తో ఈ మేరకు చేతులు కలిపింది. హైదరాబాద్ సహా బెంగళూరు, చండీగఢ్, నోయిడాలో ఈ సేవలను అందించనుంది. ద్విచక్ర వాహనాలు (ఉబర్ మోటో), కార్ల ద్వారా (ఉబెర్ గో, ఉబెర్ ఎక్స్ఎల్) సరుకులను వినియోగదార్ల ఇంటికే చేరవేస్తామని ఉబెర్ తెలిపింది. ఇటువంటి సేవల కోసం ఇతర సూపర్ మార్కెట్లు, ఫార్మాసీలతోనూ చర్చిస్తున్నట్టు వివరించింది.



కరోనా కల్లోలంతో ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల వాతావరణం నెలకొన్న తరుణంలో ఒక సానుకూల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావించారు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉన్న ఈ హోటల్ నిర్వాహకులు. దీంతో ఖాళీగా ఉన్న తమ హోటల్‌లో లవ్ అని ఆంగ్ల అక్షరాలు వచ్చేలా.. ఆయా గదుల్లో లైట్లను ఇలా వెలిగించి ప్రదర్శించారు.

# గుండెల నిండా గాలి పీల్చుకోండి!

## నగరాలు, పట్టణాల్లో మెరుగైన వాయు నాణ్యత

**లాక్‌డౌన్ తర్వాత హైదరాబాద్ సహా పలు నగరాల్లో గణనీయమార్పు**

**గతేడాది ఇదే సమయంలో ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరులో కాలుష్య కాటు**

**కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాల్లో వెల్లడి**

**సాక్షి, హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా పలు నగరాలు, పట్టణాల్లోని ప్రజలు స్వచ్ఛమైన గాలి పీలుస్తున్నారు. ఒకవైపు ఉదయాన్నే పక్షుల కిలకిలారావాలు వారిని ఆహ్లాదకర వాతావరణంలో నిద్రలేపుతుండగా, గతంలో ఎప్పుడూ లేనంతగా మెరుగైన గాలి వారి శరీరంలోకి చేరి ఉత్సాహపరుస్తోంది. దీనికి ప్రధాన కారణం.. లాక్‌డౌన్‌తో వాహనాలు, ఇతరత్రా రూపాల్లోని కాలుష్యం గణనీయంగా తగ్గిపోవడంతో వాయు నాణ్యత క్రమంగా పెరుగుతోంది. తాజాగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వెల్లడించిన గణాంకాల ప్రకారం.. దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో వాయునాణ్యత మెరుగ్గా రికార్డయింది. ముఖ్యంగా లాక్‌డౌన్‌కు ముందు లాక్‌డౌన్ అమల్లోకి వచ్చిన వారం రోజుల తర్వాత నగరాల్లో గాలి నాణ్యతలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంతేకాకుండా గతేడాది (2019) మార్చి 29న వివిధ నగరాల్లోని వాయునాణ్యతతో.. ఈ ఏడాది మార్చి 29న అవే నగరాల్లోని గాలి నాణ్యతను పోల్చి చూడగా, పలు ఆశ్చర్యకరమైన అంశాలు వెల్లడయ్యాయి.



**తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన వాయు నాణ్యత..**

రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం వాయు కాలుష్యం గణనీయంగా తగ్గింది. హైదరాబాద్ సహా పలు నగరాల్లో లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లు సహా అన్ని వాహనాలు నిలిచిపోవడంతో కాలుష్యం గణనీయంగా తగ్గిపోయింది. ఈ కారణంగా గతంలో ఏ వేసవిలోనూ లేనంతగా తెలుగు రాష్ట్రాల్లో వాయు నాణ్యత పెరిగింది. గత వర్షాకాలంలో రాష్ట్రంలో ఉన్న వాయునాణ్యత స్థాయిలో ప్రస్తుత పరిస్థితి కూడా ఉంది.

**సమీర్ యాప్ ద్వారా ఏక్యూఐ పరిశీలన..**

దేశవ్యాప్తంగా ముఖ్యమైన నగరాలు, పట్టణాల్లో వాయు నాణ్యతను (ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) వాస్తవ సమయం (రియల్‌టైం)లో పరిశీలించి 'సమీర్‌యాప్'ద్వారా ఆ వివరాలను ఒకసూచీ ద్వారా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు వెల్లడిస్తోంది. తాజా వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మెరుగైన వాయు నాణ్యత నమోదు కాగా.. ఉత్తరాదిలో మాత్రం కొన్నిచోట్ల పరిస్థితులు మెరుగుపడలేదు. దక్షిణాది రాష్ట్రాల్లో పరిస్థితి ఎంతో నయంగా ఉంది. తెలంగాణలోని 9 ఉమ్మడి జిల్లాల పరిధిలో మాన్యువల్, ఇతరత్రా పద్ధతుల్లో మానిటరింగ్ చేస్తున్నారు. హైదరాబాద్ చుట్టుపక్కలున్న సనత్‌నగర్, బొల్లారం, జూలాజికల్ పార్కు, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ, పాశమైలారం, పటాన్‌చెరువులలో ఆటోమేటిక్ సాధనాల ద్వారా, మాన్యువల్‌గానూ గాలి నాణ్యతను నమోదు చేస్తుండగా, ప్రస్తుత లాక్‌డౌన్ కారణంగా మాన్యువల్ నమోదు జరగడం లేదు, గతంలో వేసవి సందర్భంగా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్‌లో రాష్ట్రం ముఖ్యంగా హైదరాబాద్ మహానగరం వంద పాయింట్లకు పైబడి ఉండగా, ప్రస్తుతం వాయునాణ్యత 68 పాయింట్లుగా ఉంది. ఏపీ రాజధాని అమరావతి 54 పాయింట్లతో అత్యల్పంగా రికార్డ్ కాగా ఇతర నగరాల్లో ఎయిర్ క్వాలిటీ మెరుగ్గానే ఉంది.




**గతేడాది పలు ప్రధాన నగరాల్లోని వాయు నాణ్యతతో పోల్చి చూస్తే..**

| నగరం | 29, మార్చి 2019 | 29, మార్చి 2020 |
|---|---|---|
| ఢిల్లీ | 302 | 65 |
| ముంబై | 93 | 49 |
| కోల్‌కతా | 153 | 74 |
| చెన్నై | 64 | 39 |
| హైదరాబాద్ | 136 | 74 |
| బెంగళూరు | 166 | 46 |
| పుణే | 136 | 65 |
| అహ్మదాబాద్ | 277 | 73 |
| లఖ్‌నవూ | 317 | 43 |
| జైపూర్ | 193 | 41 |

**వాయునాణ్యత తీరు ఇలా...**

ఏక్యూఐలో 50 పాయింట్ల లోపు ఉంటే స్వచ్ఛమైన వాతావరణంతో పాటు అతినాణ్యమైన వాయువు ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు లెక్కిస్తారు. 50 నుంచి 100 పాయింట్ల వరకు మంచి వాయు నాణ్యత ఉన్నట్లు అంచనా వేస్తారు. మిగతా గణాంకాలు, వాటి ప్రమాణాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**ఎయిర్‌క్వాలిటి లెక్కింపు ఇలా..**

**వాయు నాణ్యత సూచీ ప్రమాణాలు.. ఆరోగ్యంపై చూపే ప్రభావాలు**

**ముదురు ఆకుపచ్చ రంగు** 0–50పాయింట్లు గుడ్– అతి తక్కువ ప్రభావం
**లేత ఆకుపచ్చ:** 50–100 సంతృప్తికరం– సున్నితులపై స్వల్పప్రభావం
**పసుపురంగు:** 100–200 మోడరేట్– ఆస్తమా, గుండెకు కొంత ఇబ్బంది
**ఆరెంజ్:** 200–300 పూర్– శ్వాసతీసుకోడంలో ఇబ్బందులు
**లేత ఎరుపు:** 300–400 వెరీపూర్– శ్వాస తీసుకోవడంలో తీవ్రప్రభావం
**ముదురు ఎరుపు:** 400–500 సివియర్– ఆరోగ్యవంతులపైనా ప్రభావం

**తెలుగు రాష్ట్రాల్లో...**

(మార్చి 28 సాయంత్రం 4 గంటలకు అప్‌డేట్ చేసినప్పుడు)
అమరావతి =54పాయింట్లు
రాజమండ్రి =60 పాయింట్లు
హైదరాబాద్ =68 పాయింట్లు
తిరుపతి =65పాయింట్లు
విశాఖపట్నం=88పాయింట్లు

## ధరల నియంత్రణ చట్టం పరిధిలోకి వైద్య ఉపకరణాలు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ కట్టడిలో భాగంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో నిత్యావసరాలు, ఔషధాల ధరల పెరుగుదలపై ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో దేశంలో విక్రయించే అన్ని రకాల వైద్య ఉపకరణాలను ఏప్రిల్ 1వ తేదీ నుంచి 'ఔషధాలు'(డ్రగ్స్)గా గుర్తిస్తున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. వైద్య ఉపకరణాలు తయారు చేసే కంపెనీలు ధరలు పెంచకుండా 'ఔషధ ధరల నియంత్రణ చట్టం'పరిధిలోకి తెస్తున్నట్లు తెలిపింది. మనుషులు, జంతువుల చికిత్సలో ఉపయోగించే వైద్య ఉపకరణాల ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) పరిధిలోని 'డ్రగ్ ప్రైస్ కంట్రోల్ ఆర్డర్ 2013'కింద నియంత్రిస్తారు. హృద్రోగ చికిత్సలో ఉపయోగించే స్టెంట్లు, కండోమ్స్, ఇంట్రా యుటెరిన్ డివైజెస్‌కు గరిష్ట ధరలను కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

## ధరల నియంత్రణ పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

**సాక్షి, హైదరాబాద్:** నిత్యావసర సరుకుల ధరల పర్యవేక్షణ, వినియోగదారుల సహాయం, ఫిర్యాదుల కొరకు పౌర సరఫరాల సంస్థలో కంట్రోల్ రూమ్ ఏర్పాటైంది. సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. కంట్రోల్ రూమ్‌లో 040–23336116 నంబర్‌ను 24 గంటల పాటు పనిచేసేలా ఏర్పాటు చేసింది. ఈ నంబర్‌కు ఫోన్ చేసి నిత్యావసరాల నిల్వలు తెలుసుకోవడంతో పాటు ఎక్కడైనా వ్యాపారులు అధిక ధరలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయవచ్చు. ఈ కంట్రోల్ రూమ్ ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే నిత్యావసర సరుకులు రవాణా చేస్తున్న వాహనాల వివరాలను నమోదు చేయడంతోపాటు ఎల్పీజీ గ్యాస్ నిల్వలను కూడా ప్రతిరోజూ సమీక్షిస్తుంది.

## కరోనాపై హైకోర్టులో రెండు వ్యాజ్యాలు

**నేడు వీడియో కాన్ఫరెన్స్‌లోవిచారణ**

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వైరస్ తీవ్రత దృష్ట్యా జైళ్లలో ఉన్న ఖైదీలు, విచారణ ఖైదీల ఆరోగ్య నిమిత్తం సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. ప్రొఫెసర్ హరగోపాలరావు దాఖలు చేసిన ఈ పిల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ ఇతరులను ప్రతివాదులుగా చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ జైళ్లలోని ఖైదీల రక్షణ కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించిందని పేర్కొన్నారు. విచారణ ఖైదీల కోసం రివ్యూ కమిటీ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాల్లో పేర్కొందని హైకోర్టు దృష్టికి తెచ్చారు. మన దేశంలో పరిమితికి మించి ఖైదీలు జైళ్లలో ఉన్నారని, ఇలాంటి పరిస్థితుల్లో చిన్నపాటి నేరాలకు పాల్పడిన వారిని, సామాజిక కార్యకర్తలను జైళ్ల నుంచి విడుదల చేయాలని కోరారు.ఈ చర్యలు తీసుకోని పక్షంలో కరోనా వ్యాప్తి ఎక్కువయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని 1,382 జైళ్లలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సుప్రీం మార్గదర్శకాలను అన్ని స్థాయిల్లోని జైళ్లలో అమలు చేయాలని కోరారు.

**వారికి వసతులు కల్పించాలి..**

ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి తెలంగాణలోకి వచ్చే వాళ్ల కోసం ఏర్పాటు చేసే క్వారంటైన్‌లో వసతులు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ హైకోర్టులో మరో 'పిల్' దాఖలైంది. కరోనా అనుమానితులు, క్వారంటైన్‌లో ఉండే వారికి చికిత్స అందించే వైద్యులు, ఇతర సిబ్బందికి వైద్య రక్షణ పరికరాలు సమకూర్చేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇవ్వాలని ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు ఈ పిల్ వేశారు. ఈ వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించనుంది.

## మేము.. డబ్ల్యూహెచ్‌వో నుంచి..!

- కరోనా సహాయ నిధి పేరుతో సైబర్ క్రైమ్ నేరస్తుల దొంగాట
- అప్రమత్తంగా ఉండాలని కోరుతున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ..



**సాక్షి, హైదరాబాద్:** 'మేము.. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులం.. ప్రపంచాన్ని గడగడలాడిస్తోన్న కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు గాను మీ వంతు సాయం చేయాలి. మేం ఏర్పాటు చేసిన సహాయ నిధికి నిధులివ్వండి..'అంటూ ఈ మెయిళ్లు, వెబ్‌సైట్లలో ప్రకటనలు, ఫోన్ కాల్స్, సోషల్ మీడియాలో మెసేజ్‌లు, ఎస్ఎంఎస్‌లు, లింకులు పంపితే నమ్మొద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) విజ్ఞప్తి చేస్తోంది. తమ పేరుతో ప్రజల నుంచి నగదు, వారి విలువైన, గోప్యమైన సమాచారాన్ని తస్కరించేందుకు సైబర్ నేరస్తులు చేసే యత్నాలను తిప్పికొట్టాలంది. వాటికి స్పందించే ముందు ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలని, తమ పేరుతో మోసపోవద్దని తెలియజేస్తోంది. తమ అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే కరోనా రెస్పాండ్ ఫండ్ పేరుతో నిధుల సమీకరణకు ప్రత్యేక ఏర్పాటు చేశామంది. ఎవరైనా తమ పేరుతో నకిలీ సందేశాలు పంపిస్తే వెంటనే తమ అధికారిక వెబ్‌సైట్‌లో రిపోర్టు చేయాలని డబ్ల్యూహెచ్‌వో స్పష్టంచేసింది.

**డబ్ల్యూహెచ్‌వో ఎప్పుడూ అడగనివివే..**

- మీరు భద్రపర్చుకున్న సమాచారాన్ని తెలుసుకునేందుకు ఎప్పుడూ యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌లు అడగదు.
- ఈమెయిల్‌లో ఫైళ్లు అటాచ్ చేయమని అడగదు.
- www.who.int మినహా ఎలాంటి వెబ్ సైట్ లింక్ ఇవ్వదు. ఓపెన్ చేయాలని అడగదు.
- ఉద్యోగ దరఖాస్తు కోసం, సమావేశాలకు హాజరయ్యే ప్రతినిధిగా రిజిస్టర్ చేసుకునేందుకు, హోటల్ రిజర్వ్ చేసుకునేందుకు డబ్బు అడగదు.
- బహుమతులు, గ్రాంట్లు, సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఎప్పుడూ లాటరీలు నిర్వహించదు. ఈమెయిల్ ద్వారా నిధుల సమీకరణకు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించదు.

## నల్లాల ద్వారా కరోనా రాదు..

**నీటి పైపుల ద్వారా వైరస్ సంక్రమించే అవకాశం లేదన్న డబ్ల్యూహెచ్‌వో**



**సాక్షి, హైదరాబాద్:** 'తాగునీటి పైపుల ద్వారా కరోనా వైరస్ సంక్రమిస్తుంది. ప్రజలెవ్వరూ నల్లాల్లో వచ్చే నీటిని తాగొద్దు. ఇతర పనులకు కూడా వినియోగించుకోవద్దు.'ఇజ్రాయెల్ నుంచి సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న తప్పుడు ప్రచారమిది. దీన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తప్పుపట్టింది. నీటి పైపుల ద్వారా ఈ వైరస్ సంక్రమిస్తుందనడానికి శాస్త్రీయ ఆధారాల్లేవని తేల్చి చెప్పింది. ప్రపంచంలోని ఏ దేశ ప్రజలూ తాగునీటి విషయంలో ఆందోళన చెందొద్దని విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయెల్‌లో నమోదవుతున్న కరోనా బాధితుల సంఖ్యకు, తాగునీటికి సంబంధం లేదని డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి తారిఖ్ లాజరెవిచ్ వెల్లడించారు. కేవలం మనిషిని ఇంకో మనిషి తాకడం ద్వారా మాత్రమే ఈ వైరస్ వ్యాపిస్తుందే తప్ప.. గాలిలో ప్రయాణం చేసేంత తేలికపాటిది కాదన్నారు. కనీసం మనిషికి మనిషికి మధ్య మీటర్ దూరం పాటించడం, ముఖ భాగాలను తాకకపోవడం వల్లే కరోనా వైరస్‌ను నియంత్రిస్తాయని, అందరూ ఈ భౌతిక దూరాన్ని పాటించడంతో పాటు వ్యక్తిగత, పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలంది.

## ప్రైవేటు రవాణావైపే మొగ్గు

**మార్చి మూడో వారం నుంచే మొదలైన జాగ్రత్తలు**

- లాక్‌డౌన్‌కు ముందే ఇళ్లకే పరిమితమైన జనాలు
- ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ బాంబే సర్వేలో వెల్లడి



**సాక్షి, హైదరాబాద్:** లాక్‌డౌన్‌తో ఉద్యోగ, ఉపాధి అవసరాల కోసం రోజూవారీగా రాకపోకలు సాగించే వారిపై కరోనా ప్రమాద తీవ్రత తగ్గిందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన ఆన్‌లైన్ సర్వేలో వెల్లడైంది. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించడానికి ముందు మార్చి మూడో వారంలో ప్రయాణికులు రాకపోకలు సాగించిన తీరుపై ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ బాంబే సంయుక్త సర్వే నిర్వహించాయి. కరోనా లక్షణాలు బయటపడుతున్న సమయంలో ప్రయాణికులు తమ రాకపోకల్లో చేసుకున్న మార్పులకు ఈ సర్వే ఫలితాలు అద్దం పడుతున్నాయి. ఆన్‌లైన్ ప్రశ్నావళి ద్వారా దేశవ్యాప్తంగా 1,900 మందిని సర్వే చేసినట్లు ఐఐటీ విద్యార్థి బృందం ప్రకటించింది. ఇక ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలతో పోలిస్తే ప్రథమ శ్రేణి నగరాల్లో కరోనాపై ఎక్కువ అవగాహన ఉన్నట్లు సర్వేలో తేలింది. నిరుపేదలకు కరోనాపై అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని కూడా సర్వే నొక్కి చెప్పింది..

**సర్వేలో వెల్లడైన విషయాలు..**

- దేశంలో కరోనా లక్షణాలు బయట పడుతున్న సందర్భంలో మార్చి మూడో వారంలో రెగ్యులర్‌గా రాకపోకలు సాగించే ప్రయాణికులు చాలా మంది ప్రజారవాణా వ్యవస్థకు బదులుగా ప్రైవేటు రవాణా వ్యవస్థ వైపు మొగ్గు చూపారు. ప్రథమ శ్రేణి పట్టణాల్లో 12 శాతం, ద్వితీయ శ్రేణి పట్టణాల్లో 9 శాతం, తృతీయ శ్రేణి పట్టణాల్లో 7 శాతం మంది ప్రజా రవాణా వ్యవస్థను వదిలేసి ప్రైవేటు రవాణా వ్యవస్థలో ప్రయాణించారు.
- లాక్‌డౌన్ ప్రకటనకు ముందు మార్చి మూడో వారంలో 48 శాతం మంది ఉద్యోగాలకు వెళ్లకుండా ఇంటికే పరిమితం కాగా, 28 శాతం మంది మాత్రం ఎప్పటిలాగానే తమ విధులకు హాజరయ్యారు. మరో 24 శాతం మంది మాత్రం వారానికి రెండు, మూడు మార్లు మాత్రమే విధులకు వెళ్లి వచ్చారు.
- కరోనా భయంతో మార్చి మూడో వారంలో 18 శాతం మంది విమాన ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. మరో 20.2 శాతం రైలు ప్రయాణాలు, 11.6 శాతం మంది బస్సు ప్రయాణాలు రద్దు చేసుకున్నట్లు సర్వేలో తేలింది.
- ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా రవాణా వ్యవస్థ కంటే ప్రైవేటు వాహనాల్లో ప్రయాణం సురక్షితం అని 93 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటు లాక్‌డౌన్‌కు ముందు ఏ తరహా వాహనాల్లో రాకపోకలు ఎక్కువగా సాగాయి. ట్రాఫిక్ రద్దీపై ప్రభావం వంటి అంశాలపైనా వివరాలు సేకరించినట్లు సర్వే బృందం వెల్లడించింది.

## కరోనా చికిత్సకు 31 రసాయన సమ్మేళనాలు

- కృత్రిమ మేధో సాంకేతికత సాయంతో గుర్తించిన టీసీఎస్

**సాక్షి, హైదరాబాద్:** కరోనాకు పూర్తిస్థాయి చికిత్సను కనిపెట్టేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలు జోరుగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐటీ కొత్త సాంకేతికత కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారంగా కరోనా చికిత్సలో సమర్థంగా ఉపయోగపడే 31 రకాల రసాయన సమ్మేళనాలను గుర్తించినట్లు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ ప్రకటించింది. వీటిని కృత్రిమంగా తయారు చేయడం ద్వారా కరోనా మహమ్మారిని అంతమొందించే ఔషధాన్ని తయారు చేయొచ్చని వెల్లడించింది. ఔషధ తయారీ, దాని పనితీరును పరీక్షించేందుకు కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)తో జట్టు కడుతున్నట్లు ప్రకటించింది. సింథటిక్ బయాలజీ రంగంలో పరిశోధనలు చేస్తున్న టీసీఎస్ ఇన్నోవేషన్ ల్యాబ్స్ కరోనా వైరస్ చికిత్సకు అవసరమైన ఔషధ నమూనాలో ముందడుగు వేసినట్లు సైంటిస్టులు ప్రకటించారు. 'కైమోట్రిప్సిన్ లైక్ (3సీఎల్) ప్రోటియేజ్' అనే ఎంజైమ్‌ను నిర్జీవం చేస్తే కరోనాను అరికట్టవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వైరస్ ఉత్పత్తి చేసే పాలీ ప్రోటీన్లను 3సీఎల్ ప్రోటియేజ్ విచ్ఛిన్నం చేస్తుంది. మానవ శరీరంలో 3సీఎల్ ప్రోటియేజ్‌ను నిర్జీవం చేసేందుకు కృత్రిమ మేధస్సుతో గుర్తించిన 31 రసాయన సమ్మేళనాలు ఉపయోగపడతాయని ఆ వర్గాలు చెప్తున్నాయి.

లాక్‌డౌన్ నేపథ్యంలో గురువారం ఢిల్లీలోని ఆజాద్‌పూర్ రింగ్‌రోడ్డు వద్ద పరిస్థితి ఇలా..



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.